www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 30-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 31 | వరంగల్

శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం, తిథి: తదియ మ.2.13 తదుపరి చవితి, నక్షత్రం: రోహిణి సా.4.18 తదుపరి మృగశిర, వర్జ్యం: ఉ.9.07-10.33, రా.9.26-10.54, దుర్ముహూర్తం: ఉ.11.47-12.37, అమృతఘడియలు: మ.1.25-2.51, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 5.53, సూర్యాస్తమయం: 6.31

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అమెరికాలో ట్రక్కు డ్రైవర్లు ఆంగ్లం

మాట్లాడాల్సిందే!

ప్రజలు, దేశ భద్రత కోసమే నిర్ణయం

ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేసిన ట్రంప్

మా ఉపాధికి ముప్పు: సిక్కు సంఘాలు

12



నియామక పత్రాన్ని అందుకుంటున్న ప్రియాంక రెడ్డి

గీతం విద్యార్థికి 1.4 కోట్ల వార్షిక వేతనం

ప్రాంగణ నియామకాల్లో అమెజాన్‌కు ఎంపికైన ప్రియాంక రెడ్డి.. యాక్సెంచర్‌కు 91 మంది ఎంపిక

9

సైన్యానికి పూర్తి స్వేచ్ఛ



రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, త్రివిధ దళాధిపతులు, సీడీఎస్ అనిల్ చౌహాన్‌తో ప్రధాని మోదీ సమావేశం

ఉగ్రదాడికి ప్రతిగా ఎక్కడ, ఎప్పుడు, ఎలా దాడి చేయాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ వారిదే

వారి శక్తి సామర్థ్యాలపై పూర్తి విశ్వాసం ఉంది

ఉగ్రవాదులకు, వారిని పెంచి పోషిస్తున్నవారి ఊహకైనా అందనంత కఠిన శిక్షలు విధిస్తాం

అత్యున్నతస్థాయి రక్షణ భేటీలో ప్రధాని మోదీ

నేడు రెండోసారి సమావేశం కానున్న సీసీఎస్

కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ భేటీ కూడా!

'పహల్గాం'పై చర్చకు పార్లమెంట్‌ను సమావేశ పరచండి

ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే లేఖలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా.. ఎలాంటి దాడులైనా చేసేందుకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చామని.. ఎక్కడ (టార్గెట్), ఎప్పుడు (టైమింగ్), ఎలా (మోడ్) చేయాలో నిర్ణయించే అధికారం కూడా వాటిదేనని ప్రధాని మోదీ అన్నారు. మంగళవారం ఇక్కడ తన నివాసంలో అత్యున్నత స్థాయి రక్షణ సమావేశం నిర్వహించిన ప్రధాని మోదీ.. భారత దళాల శక్తిసామర్థ్యాలపై తనకు పూర్తి విశ్వాసం ఉన్నదని స్పష్టం చేశారు. ప్రధాని నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో.. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రివిధ దళాధిపతులు, మహా దళపతి (చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్-సీడీఎస్) అనిల్ చౌహాన్, జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ పాల్గొని పలు కీలక అంశాలపై చర్చించారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించాలన్నది జాతీయ సంకల్పమన్న ప్రధాని.. పహల్గాంలో పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులను, దాడి కుట్రదారులను, వారిని పెంచి పోషిస్తున్నవారిని

మిగతా 12వ పేజీలో...

పాకిస్థాన్ దిగ్బంధం?

దాయాదిని అన్ని అంశాల్లో ఇరుకున పెట్టేందుకు కేంద్రం యత్నాలు

ఇప్పటికే అమల్లోకి దౌత్య, వాణిజ్యపరమైన ఆంక్షలు

పాక్ ఎయిర్‌లైన్స్‌కు భారత గగనతలాన్ని మూసేసే యోచన

ఆ దేశ నౌకలు మన పోర్టుల్లో ఆగకుండా చర్యలు

ఏ క్షణమైనా భారత్ వైమానిక దాడులకు దిగొచ్చని పాక్ ఆందోళన

సరిహద్దులకు రాడార్ల తరలింపు.. సైబర్ దాడులకు విఫల యత్నం

12

'పహల్గాం' పాపం పాక్‌దే!

దాడిలో పాక్ మాజీ పారా కమాండో మూసా పాల్గొన్నట్టు తాజాగా వెల్లడి

12

కొట్టాలి.. తిప్పికొట్టలేకుండా!

పాక్ ఉగ్రశిబిరాలు, ఆయుధపట్లపై దాడి

భారత సైన్యం ప్రతీకార వ్యూహమిదే!

పాక్ స్పందించలేని రీతిలో బుద్ధి చెప్పాలి

పూర్తిస్థాయి యుద్ధానికి చాన్స్ తక్కువే!

అడ్డుకునేందుకే పాక్ అణు బెదిరింపులు

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు ఎప్పుడు.. ఎక్కడ.. ఎలా!? ప్రతిస్పందించాలో నిర్ణయించే పూర్తి స్వేచ్ఛను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ త్రివిధ దళాలకు ఇచ్చారు! ఉగ్రవాదం ఇక కోలుకోకుండా దెబ్బ కొట్టాలనీ నిర్దేశించారు! మరి.. ఈ పరిస్థితుల్లో భారత సైన్యం వ్యూహమేంటి!? అందుకు మన సన్నద్ధత ఎంత!? పూర్తి స్థాయి లేదా పరిమిత యుద్ధమే వస్తే పాకిస్థాన్ ప్రతిస్పందన ఎలా ఉండనుంది!? అటువంటి పరిస్థితుల్లో అమెరికా, రష్యా, చైనా ఏం చేసే అవకాశముంది!? అణు దాడి జరిగే అవకాశముందా!? జరిగితే.. ఏ స్థాయిలో ఉండనుంది!? తదితర అంశాలపై 'ఆంధ్రజ్యోతి' రక్షణ ప్రతినిధి అందిస్తున్న సమగ్ర విశ్లేషణ..

13



ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగానికి

పర్యావరణ అనుమతులు!

ఈ ప్రాజెక్టుకు కేంద్ర అనుమతులన్నీ వచ్చేసినట్లే

కేంద్ర క్యాబినెట్‌లో ఆమోదించడమే తరువాయి

నిర్వాసితులకు పరిహారం చెల్లింపునకూ సుగమం

6 లేన్లతో రహదారి నిర్మాణం.. తుది దశకు డీపీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగం నిర్మాణం దిశగా మరో అడుగు ముందుకుపడింది. కేంద్ర ప్రభుత్వం ఈ రహదారికి పర్యావరణ అనుమతులను మంజూరు చేసింది. ఇప్పటికే అటవీ అనుమతులు వచ్చాయి. దీంతో రోడ్డు నిర్మాణానికి కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులన్నీ వచ్చేసినట్లయింది. ఇక ఈ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్‌లో ఆమోదించడమే తరువాయి. మంత్రివర్గ ఆమోదం లభించగానే రహదారి నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశం ఉంటుంది. తాజాగా పర్యావరణ అనుమతులు రావడంతో భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపులకు మార్గం సుగమమైంది. త్వరలోనే ఈ ప్రక్రియ వేగిరమవనుంది. అయితే తమకు అధిక పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సాగు భూములు కోల్పోతున్న రైతులకు ఆమోదయోగ్యంగా ఉండేలా మెరుగైన పరిహారం చెల్లించే మార్గాలను అన్వేషించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం నిర్మాణం కోసం 1,920 హెక్టార్ల భూమిని సేకరిస్తుండగా, పరిహారం కోసం సుమారు రూ.5,200 కోట్లు కావాలని

మిగతా 3వ పేజీలో...



52వ సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్

14న ప్రమాణ స్వీకారం

కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్

12

టెన్త్‌లో మళ్లీ మార్కులు

మెమోల్లో గ్రేడ్ల స్థానంలో మార్కులు

పాఠశాల విద్యాశాఖ నిర్ణయం

ప్రభుత్వం ఆమోదం.. ఈసారే అమలు

విద్యావేత్తలు, సంఘాల అభ్యంతరం

విద్యార్థులపై ఒత్తిడి పెంచే నిర్ణయాన్ని తీసుకోవడం ఏమిటని విమర్శలు

9

ప్రజల విశ్వాసం కోల్పోతున్న సీబీఐ!

ఆ సంస్థపై అవినీతి ఫిర్యాదులు పెరుగుతున్నాయి: మద్రాస్ హైకోర్టు

సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షించాలని సూచన

12

కెనడా ప్రధానిగా కార్నీ!

విజయం దిశగా లిబరల్ పార్టీ

కొనసాగుతున్న కౌంటింగ్..

ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ ఓటమి అంగీకారం

ప్రభావం చూపని ఖలిస్థానీ అనుకూల న్యూడెమొక్రటిక్ పార్టీ

అధ్యక్ష పదవికి జగ్మీత్ రాజీనామా

12

అసౌకర్యం కలగొద్దు



మిస్ వరల్డ్‌కు వచ్చే పోటీదారులు, అతిథులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలి

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చెయ్యండి

ఏర్పాట్లపై ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

మే 2న 224 మంది ఏఈలకు నియామక పత్రాలు

హైదరాబాద్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ 2025 పోటీల కోసం హైదరాబాద్‌కు వచ్చే పోటీదారులు, అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పోటీదారులు, అతిథులు, ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ముఖ్యంగా విమానాశ్రయం, హోటళ్లు, పోటీలు జరిగే ప్రాంతాల వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. మే నెలలో హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్-2025 పోటీలు

మిగతా 2వ పేజీలో...



'కర్మణ్యే వాధికారస్తే.. మా ఫలేషు కదాచన'

బదిలీ నేపథ్యంలో భగవద్గీత శ్లోకం పోస్టు చేసిన స్మిత సబర్వాల్

పర్యాటక శాఖ పని తీరును పూర్తిగా మార్చి జవాబుదారీతనాన్ని పెంచా

అంతర్జాతీయ ఈవెంట్ కోసం ప్రణాళికలు రచించా: స్మిత

2



సచివాలయంలో మీడియాతో మంత్రులు ఉత్తమ్, పొన్నం, జూపల్లి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, జగ్గారెడ్డి

కాళేశ్వరం బాధ్యుల్ని వదలం

కేసీఆర్ అయినా.. అధికారులైనా.. ఎవరైనా చర్యలు తప్పవు

ఎన్డీఎస్‌ఏ నివేదికపై క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం

బ్యారేజీలను రిజర్వాయర్లుగా వినియోగించనందునే విఫలం

తుమ్మిడిహెట్టి వద్ద నీటిలభ్యతపై తప్పుడు ప్రచారం: మంత్రి ఉత్తమ్

బ్యారేజీల వైఫల్యంపై మంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల వైఫల్యానికి కారకులెవరైనా వదిలిపెట్టబోమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అది మాజీ సీఎం కేసీఆర్ అయినా, మాజీ మంత్రి హరీశ్‌రావైనా, అధికారులైనా తప్పక చర్యలుంటాయన్నారు. రూ.లక్ష కోట్లతో ప్రాజెక్టు నిర్మించి, దానిని ముంచి.. తెలంగాణకు తీరని నష్టం చేశారని ఆరోపించారు. కాళేశ్వరం బ్యారేజీలపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి, ఎలా ముందుకెళ్లాలన్న దానిపై

మిగతా 2వ పేజీలో...

2

ఎన్డీఎస్‌ఏ నివేదిక పేరిట మాపై దుష్ప్రచారం

ఉత్తమ్ చెప్పేవన్నీ అబద్ధాలే.. మాజీ మంత్రి హరీశ్ ధ్వజం

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువు మే 31 వరకు పెంపు



మహేశ్వరి



మనీషా

వాహనం ఢీకొని ఇద్దరు

నర్సింగ్ విద్యార్థినుల మృతి

మరో విద్యార్థినితోపాటు ఓ బాలుడికి తీవ్ర గాయాలు

డ్రైవర్ మద్యం మత్తే కారణం.. త్రుటిలో తప్పించుకున్న గర్భిణి

జోగులాంబ గద్వాల్లలో ఘటన

9

డీజీపీ పేర్ల జాబితా వెనక్కి

రాష్ట్రానికి తిప్పి పంపిన యూపీఎస్సీ

కొత్త డీజీపీ ఎంపికకు 8 మంది ఐపీఎస్‌ల పేర్ల జాబితాను ఇటీవల పంపిన రాష్ట్ర ప్రభుత్వం

వారిలో ఇద్దరికి మిగిలిన సర్వీసు 6 నెలల్లోపే..

ఇది నిబంధనలకు విరుద్ధమన్న యూపీఎస్సీ

తాజా జాబితా పంపాలని రాష్ట్రానికి సూచన

హైదరాబాద్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పూర్తిస్థాయి డీజీపీ ఎంపికకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పంపిన జాబితాను యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ) వెనక్కి పంపినట్లు సమాచారం. 8 మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లతో ఈ జాబితా పంపినా.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించలేదని తెలిసింది. దీంతో యూపీఎస్సీ ఆ జాబితాను వెనక్కి పంపినట్లు సమాచారం. మార్గదర్శకాలను పాటిస్తూ జాబితాను పంపాలని సూచించింది. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి రాష్ట్రం కొత్త డీజీపీ ఎంపిక సమయంలో 30 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఐపీఎస్

మిగతా 2వ పేజీలో...



హనుమకొండలో ప్రజా సంఘాల నిరసన ప్రదర్శన

'ఆపరేషన్ కగార్'ను

నిలిపివేయండి

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపండి

కేంద్రానికి మంత్రి ధనసరి సీతక్క డిమాండ్

శాంతి చర్చల కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తాం

2న సదస్సు నిర్వహిస్తాం: వామపక్ష పార్టీలు

14

'కర్మణ్యే వాధికారస్తే... మా ఫలేషు కదాచన'

» ఎక్స్‌లో భగవద్గీత శ్లోకం పోస్టు చేసిన స్మిత సబర్వాల్

» పర్యాటకరంగ అభివృద్ధికి శక్తిమేరకు కృషి చేశానని వెల్లడి



హైదరాబాద్, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): పర్యాటక శాఖ కార్యదర్శి నుంచి తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శిగా ఇటీవల బదిలీ అయిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మిత సబర్వాల్ ఎక్స్‌లో ఆసక్తికర పోస్టు చేశారు. హైదరాబాద్ వేదికగా జరగనున్న మిస్ వరల్డ్-2025 ఏర్పాట్లలో పర్యాటక శాఖ కార్యదర్శిగా స్మిత కీలకంగా వ్యవహరిస్తున్న వేళ ప్రభుత్వం ఆమెను బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో భగవద్గీతలోని 'కర్మణ్యే వాధికారస్తే... మా ఫలేషు కదాచన' అనే శ్లోకంతో ఆమె తన పోస్టును ప్రారంభించడం చర్చనీయాంశమైంది. పర్యాటక శాఖలో నాలుగు నెలలు ఉన్నానని, శాయశక్తులా పని చేశానని స్మిత పేర్కొన్నారు. "దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పర్యాటక పాలసీ 2025-30ని తొలిసారిగా అమలులోకి తెచ్చాను. నిర్లక్ష్యానికి గురైన టూరిజం సర్క్యూట్‌ల్లో పెట్టుబడులు రావడానికి అది దిశానిర్దేశం చేయనుంది. పర్యాటక శాఖ పని శైలిని పూర్తిగా మార్చి జవాబుదారీతనాన్ని పెంచా. ఎన్నో అవకాశాలకు తలుపులు తెరిచే అంతర్జాతీయ ఈవెంట్ నిర్వహణకు అవసరమైన లాజిస్టిక్స్, ప్రణాళికలకు పునాది వేశా. తెలంగాణ పర్యాటక శాఖతో పని చేయడం ఆనందంగా, గౌరవంగా ఉంది" అని స్మిత తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై కృత్రిమ మేధ సాయంతో రూపొందించిన ఓ ఫొటోను ఆమె ఎక్స్‌లో ఇటీవల రీపోస్ట్ చేయడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఈ పోస్టు అంశంలో గచ్చిబౌలి పోలీసులు స్మిత సబర్వాల్‌కు నోటీసులు కూడా జారీ చేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ.. తనలాగే 2000 మంది పోస్టులు పెట్టారని, వారందరిపైనా ఇలాంటి చర్యలే ఉంటాయా? అని 'ఎక్స్'లో ఆమె ప్రశ్నించారు.ఆ తర్వాత కొద్ది రోజులకే ఆమె బదిలీ అయ్యారు.

పర్శ సాయికి అండగా ఉంటాం..

» రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా సాయం

» ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం: సీఎం రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జనగామలోని కుర్మవాడకు చెందిన బాలుడు పర్శ సాయి కుటుంబానికి అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "పర్శ సాయి దీన పరిస్థితి నా దృష్టికి వచ్చింది. ఆ బాలుడి ఆరోగ్యం, తల్లిదండ్రుల ఆర్థిక స్థితి వివరాలు తెలుసుకుని ప్రభుత్వం వైపు నుంచి చేయగలిగిన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించాను. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పర్శ సాయి ఇంటికి వెళ్లి పరిశీలించారు. ఆ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. సాయికి నిమ్స్‌లో వైద్యం అందించడానికి నిర్ణయించారు" అని తెలిపారు.

'కంచి' ఆచార్యులు గణేశ్ శర్మకు అభినందనలు

కంచి కామకోటి పీఠం 71వ ఆచార్యులుగా దుడ్డు సత్య వెంకట సూర్య సుబ్రహ్మణ్య గణేశ్ శర్మ అభిషేక వేడుక బుధవారం జరగనున్న నేపథ్యంలో ఆయనకు సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఆయన రుగ్వేద పండితులుగా బాసర సరస్వతి దేవికి, తెలంగాణ ప్రాంతానికి ఎనలేని ధార్మిక సేవచేశారని గుర్తుచేశారు. ఈ గురు పరంపర ధర్మాన్ని, జ్ఞానాన్ని, శాంతిని సతతం అందించాలని కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు.

సీఎంను కలిసిన జస్టిస్ షమీమ్, జస్టిస్ శివశంకర్..

రాష్ట్ర మానవ హక్కుల సంఘం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జస్టిస్ షమీమ్ అక్తర్, పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన జస్టిస్ శివశంకర్ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి సీఎం శుభాకాంక్షలు చెప్పారు. కాగా, రాష్ట్ర పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం సీఈవోగా నియామకమైన జయేశ్ రంజన్, అదే విభాగానికి అదనపు సీఈవోగా నియామకమైన ఐఏఎస్ ఈ.వీ నర్సింహారెడ్డి కూడా సీఎంను కలిశారు.

ఈసారి విద్యుత్ చార్జీల పెంపు లేదు

» నిజానికి చార్జీలు పెంచితేనే డిస్కమ్‌ల మనుగడ

» ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పెంచడం లేదు

» వ్యవసాయ ఫీడర్లకు మీటర్లు పెట్టే.. ఆర్‌డీఎస్ఎస్‌లో చేరడానికి డిస్కమ్‌లు ముందుకొచ్చాయి

» ఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరెంట్ చార్జీలు పెంచితేనే డిస్కమ్‌లు ఆర్థికంగా మనుగడ సాగిస్తాయని.. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో క రెంట్ చార్జీలు పెంచలేమని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మంగళవారం ఈఆర్‌సీ కార్యాలయంలో టారిఫ్ ఉత్తర్వులను విడుదల చేశారు. 2025-26లో రూ.65,849.74 కోట్ల ఆదాయం అవసరమని డిస్కమ్‌లు తెలిపాయని, అందులో ప్రధానంగా వ్యవసాయ విద్యుత్ డిమాండ్ అధికంగా ఉంటుందని అంచనా వేశాయని వివరించారు. వాస్తవికంగా అన్ని అంశాలను పరిశీలించి రూ.58,628.09 కోట్లకు అనుమతించామని తెలిపారు. 2025-26లో కరెంట్ చార్జీల పెంపు లేదని, కొత్త టారిఫ్ ఆర్డర్ మే 1వ తేదీ నుంచే అమల్లోకి వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో డిమాండ్ లేని (నాన్ పీక్) సమయంలో విద్యుత్ ఉంటోందని.. డిమాండ్ అధికంగా ఉన్న (పీక్) సమయంలో బహిరంగ మార్కెట్ నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోందని వివరించారు. 2025-26లో రూ.13,499 కోట్లను టారిఫ్ సబ్సిడీ కింద చెల్లించడానికి ప్రభుత్వం ముందుకొచ్చిందని తెలిపారు. ఇందులో 29.15 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు కరెంటు కోసం రూ.11,602.60 కోట్లు, గృహ విద్యుత్ వినియోగదారులకు సంబంధించి రూ.1,896.81 కోట్లు చెల్లించనుందని వివరించారు.

ఆర్డీఎస్ఎస్‌లో చేరడానికి రాష్ట్ర డిస్కమ్‌లు సిద్ధం

వ్యవసాయ ఫీడర్లకు మీటర్లు పెట్టడానికి వీలుగా 'రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్డీఎస్ఎస్)'లో చేరడానికి డిస్కమ్‌లు సమ్మతి తెలిపాయని జస్టిస్ దేవరాజు నాగార్జున్ వెల్లడించారు. దీనికోసం కమిటీ కూడా వేసినట్టు తెలిపారు. దీనికి మంత్రివర్గం ఆమోదం వచ్చాక త్రైపాక్షిక ఒప్పందం (తెలంగాణ ప్రభుత్వం, డిస్కమ్‌లు, కేంద్రం) కుదుర్చుకుంటారని వెల్లడించారు. ఓపెన్ యాక్సెస్ (బహిరంగ విపణి)విధానంలో నేరుగా కరెంట్ కొనుగోలు చేసుకునేవారి నుంచి వసూలు చేసే క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీలను నిర్ధారిస్తూ కూడా ఈఆర్‌సీ ఉత్తర్వులు జారీ చేసింది.

డీజీపీ పేర్ల జాబితా వెనక్కి

(మొదటిపేజీ తరువాయి)

అధికారుల పేర్లను పంపించాలి. పదవీ విరమణకు ఆరు నెలలు మాత్రమే ఉన్న వారి పేర్లను ఈ జాబితాలో చేర్చకూడదు. ఇక్కడే తెలంగాణ అధికారులు పొరపాటు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుత డీజీపీ జితేందర్ (పూర్తి అదనపు బాధ్యతలు) పదవీ కాలం ఈ ఏడాది సెప్టెంబరులో, కొత్తకోట శ్రీనివాస రెడ్డి పదవీ కాలం ఈ ఏడాది ఆగస్టులో ముగియనుంది. అంటే వీరిద్దరి పదవీ విరమణ ఆరు నెలల్లోపే ఉంది. కాబట్టి వీరి పేర్లను జాబితాలో చేర్చకూడదు. ఆరు నెలలకు పైగా సర్వీసు ఉన్న అధికారుల్లో 1990 బ్యాచ్‌కు చెందిన రవిగుప్తా, 1991 బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్, 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే (సుదీర్ఘకాలంగా కేంద్ర సర్వీసుల్లో డిప్యూటేషన్‌పై ఉన్నారు), బీ శివధర్ రెడ్డి, సౌమ్యా మిశ్రా, శిఖాగోయల్ ఉన్నారు. వీరి పేర్లతో తాజాగా జాబితా తయారుచేసి పంపితే యూపీఎస్సీ పరిశీలించి ముగ్గురి పేర్లను ఎంపిక చేస్తుంది. ఆ పేర్లను రాష్ట్రానికి పంపుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆ ముగ్గురిలో ఒకర్ని డీజీపీగా నియమించవచ్చు.

అసౌకర్యం కలగొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి.. పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారం ఉన్నస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న ఏర్పాట్లను వివిధ శాఖల ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ స్థాయి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చే అతిథులకు, ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను అతిథులు సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. విభాగాల వారీగా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. మిస్‌వరల్డ్ పోటీల నేపథ్యంలో చేపట్టిన సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పోటీలు ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టే కార్యక్రమాలు, ఏర్పాట్లకు సంబంధించి పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కాగా, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, జయేశ్ రంజన్, పర్యాటక శాఖ డైరెక్టర్ హన్మంతు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ, డీజీపీ జితేందర్, ఏడీజీపీ మహేశ్‌భగవత్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

2న ఎన్‌డీఎస్ఏ నివేదికపై సీఎం సమీక్ష

అదే రోజు 224 మంది ఏఈలకు నియామక పత్రాలు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీలపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) అందించిన నివేదికపై మే 2న అధికారులతో సీఎం రేవంత్ చర్చించనున్నారు. ఐదురోజుల కిందట కాళేశ్వరం బ్యారేజీలపై ఎన్‌డీఎస్ఏ నివేదిక అందించిన విషయం విదితమే. మే 2న సాయంత్రం జలసౌధలో జరిగే కార్యక్రమంలో నీటి పారుదలశాఖలో కొత్తగా ఎంపికైన 224 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు(ఏఈ), 199 మంది జూనియర్ టెక్నికల్ అధికారుల(జేటీవో)కు ముఖ్యమంత్రి నియామకపత్రాలు అందించనున్నారు. అనంతరం నీటిపారుదల శాఖ ప్రాజెక్టుల నిర్మాణాలపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతులతో పాటే తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం దిశగా ఏయే చర్యలు తీసుకోవాలనే అంశాలపై సీఎం చర్చించే అవకాశాలున్నాయి.

లోకం తీరు



కాళేశ్వరం బాధ్యులను వదలం

(మొదటిపేజీ తరువాయి)



నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బ్యారేజీల వైఫల్యంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలపై మంగళవారం సచివాలయంలో ఎన్‌డీఎస్ఏ నివేదిక ఆధారంగా మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ చేసింది మీరే.. కట్టింది మీరే. అది కూలింది మీరు అధికారంలో ఉన్నప్పుడే.. ఎన్‌డీఎస్ఏ ప్రాథమిక నివేదిక వచ్చిందీ అప్పుడే" అని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎన్‌డీఎస్ఏ చట్టానికి పార్లమెంటులో బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని, ఇప్పుడు ఆ చట్టం ఆధారంగా ఏర్పడిన నిపుణుల కమిటీని కించపరిచేలా ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీతారామ ప్రాజెక్టుకు అనుమతివ్వాలని కేంద్ర జలశక్తిశాఖ కార్యదర్శిని తాము కోరితే.. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్లను నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) ఆమోదించినా బ్యారేజీ విఫలమైందంటూ బదులిచ్చారని అన్నారు. తెలంగాణ పేరు ప్రతిష్ఠలను గత ప్రభుత్వం మంట కలిపిందని ధ్వజమెత్తారు. 2019లో కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణం పూర్తయిన తర్వాత తొలి ఏడాదే వరదలకు దెబ్బతిన్నాయని, అయినా కనీస మరమ్మతులు కూడా చేయలేదని ఆక్షేపించారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ఎం)తోపాటు బ్యారేజీల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వలేదని మంత్రి ఉత్తమ్ అన్నారు. బ్యారేజీలు పూర్తయినా.. కాఫర్ డ్యామ్ అవశేషాలను అలాగే వదిలిపెట్టారని, తెలంగాణ ఇంజనీరింగ్ రిసెర్చ్ ల్యాబొరేటరీ నివేదికలను కూడా పట్టించుకోలేదని విమర్శించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కోసం ఒక చోట జియో టెక్నికల్/ఫిజికల్ పరీక్షలు చేసి, మరోచోట నిర్మాణానికి నిర్ణయాలు తీసుకున్నారని ఆక్షేపించారు. ఇక మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం వద్దని ఐదుగురు మాజీ ఇంజనీర్లు నివేదిక ఇచ్చినా పట్టించుకోలేదని, నిర్మాణం ప్రారంభించిన ఆర్నెల్లకు ప్రాజెక్టు డీపీఆర్‌ను సమర్పించారని అన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ వద్ద 165 టీఎంసీల నీటి లభ్యత ఉన్నా.. లేదంటూ తప్పుడు ప్రచారం చేసి బ్యారేజీని తరలించారని ఆరోపించారు. బ్యారేజీలను రిజర్వాయర్‌లుగా వినియోగించడంతో.. ఆ ఒత్తిడి పునాదులపై పడిందని, వాటి కింద ఇసుక జారి.. బ్యారేజీలు విఫలమయ్యాయని తెలిపారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువు పెంపు

మే 31 వరకు పొడగిస్తూ జీవో జారీ

కాళేశ్వరం బ్యారేజీలపై విచారణ కోసం వేసిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువును మే 31 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇదివరకు విధించిన గడువు ఈనెల 30(బుధవారం)తో ముగియనుంది. నివేదిక సమర్పించడానికి మరో నెల గడువు ఇవ్వాలని ఘోష్ కమిషన్ కోరడంతో ఆ మేరకు గడువు పొడిగిస్తూ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా మంగళవారం జీవోనెం.17ను జారీ చేశారు. మరోవైపు కాళేశ్వరం విచారణలో భాగంగా ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్‌ను కమిషన్ చైర్మన్ చంద్రఘోష్ కలిశారు. ఈ సందర్భంగా కాళేశ్వరం బ్యారేజీలపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) నివేదిక అందించాలని ఈఎన్‌సీ(జనరల్)ను జస్టిస్ ఘోష్ కోరగా.. త్వరలోనే అందజేస్తామని అనిల్‌కుమార్ చెప్పారు.

సారథి.. వాహన్.. చలో!

రాష్ట్రంలోని వాహనదారులకు ఈ డిజిటల్ సేవలు అందుబాటులోకి

నేడు సారథిని ప్రారంభించనున్న పొన్నం

ఆగస్టు నుంచి వాహన్ సేవలు అమల్లోకి

హైదరాబాద్, తిరుమలగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ అభివృద్ధి చేసిన 'సారథి', 'వాహన్ డిజిటల్ సేవలు ఇక రాష్ట్ర ప్రజలకూ అందుబాటులోకి రానున్నాయి. దేశవ్యాప్తంగా రవాణా శాఖ సేవలు ఒకే గొడుగు కిందకు తీసుకురావడం ఈ సేవల వెనుక ఉద్దేశం. ఈ డిజిటల్ సేవల ద్వారా ప్రజలు తమ వాహనానికి సంబంధించిన, డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎక్కడి నుంచైనా తెలుసుకునే అవకాశం ఉంటుంది. 'సారథి' అప్లికేషన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ సికింద్రాబాద్ ఆర్టీవో కార్యాలయంలో పైలెట్ ప్రాజెక్టుగా బుధవారం ప్రారంభించనున్నారు. 'వాహన్' సేవలను రాష్ట్రంలో వచ్చే ఆగస్టు నుంచి అమల్లోకి తెచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'సారథి' అప్లికేషన్‌తో డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ, చిరునామా మార్పు, కొత్త వాహన కేటగిరి చేర్పు తదితర సేవలను దేశంలో ఎక్కడినుంచైనా పొందొచ్చు. సారథి అప్లికేషన్ అమలుతో డ్రైవింగ్ లైసెన్స్‌లు కేంద్రం ఆధ్వర్యంలో నడిచే డీజీ లాకర్ ప్లాట్‌ఫాం ప్రయోజనాలను పొందగలుగుతున్నారు. డీజీ లాకర్ ద్వారా అధికారిక డాక్యుమెంట్లను, డ్రైవింగ్ లైసెన్స్‌లను డిజిటల్ ఫార్మాట్‌లో భద్రపరచి అవసరమైనప్పుడు పొందొచ్చు. ఇతర దేశాలకు వెళ్లినప్పుడు.. డ్రైవింగ్ లైసెన్స్ లేదా ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ అసలైనదేనని ఆయా దేశాధికారులు ధ్రువీకరించుకోవడం 'సారథి' ద్వారా సులభం అవుతుంది. ఇతర దేశాల్లో తాత్కాలికంగా నివసించే భారతీయులు వారి ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ గడువు ముగిసినప్పుడు, భారత రాయబార కార్యాలయంలో సారథి అప్లికేషన్ ద్వారా అక్కడే కొత్త పర్మిట్ (ఐడీపీ) కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

స.హ చట్టం ప్రధాన కమిషనర్‌గా చంద్రశేఖర్

కమిషనర్లుగా మరో ఏడుగురి నియామకం

ప్రభుత్వ ప్రతిపాదనకు గవర్నర్ ఆమోదం



హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్‌గా ఐఎఫ్ఎస్ అధికారి జీ చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయనతో పాటు సమాచార హక్కు చట్టం కమిషనర్లుగా మరో ఏడుగురి నియామకానికి సంబంధించి ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్‌గా జీ చంద్రశేఖర్ రెడ్డి, కమిషనర్లుగా సీఎం సీపీఆర్వో అయోధ్య రెడ్డి, జర్నలిస్టు పీవీ శ్రీనివాసరావు, కప్పర హరిప్రసాద్, కేఎల్ఎన్ ప్రసాద్, రాములు, వైష్ణవి, పర్వీన్ మొహిసిన్‌ను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకు గవర్నర్ ఆమోదం తెలపడంతో వీరి నియామక ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేయనుంది.

మీరు పదేళ్లలో చేస్తే.. రేవంత్ ఏడాదిలోనే చేశారు

బీఆర్ఎస్ పదేళ్లలో చేసిన రుణమాఫీ 20వేల కోట్లు.. కాంగ్రెస్ ఏకకాలంలో చేసింది 22వేల కోట్లు

» మరి మీరు గొప్పనా.. కాంగ్రెస్ గొప్పనా

» కేసీఆర్‌కు జగ్గారెడ్డి సూటి ప్రశ్న

» మహిళలకు ఉచిత బస్సు కూడా తప్పేనా?

» కేసీఆర్ ఆ పథకాన్ని విమర్శించారంటే సక్సెస్ అయినట్లే

» కాంగ్రెస్ సర్కారు స్వేచ్ఛతోనే బీఆర్ఎస్ సభ

» టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): "సీఎం రేవంత్‌రెడ్డి ఏక కాలంలో రూ.22 వేల కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తే.. నువ్వు పదేళ్ల పాలనలో చేసిన మాఫీ రూ.20 వేల కోట్లు మాత్రమే. ఏడాది లోపే రూ.22 వేల కోట్లు మాఫీ చేసిన కాంగ్రెస్ గొప్పనా.. లేక పదేళ్ల టైం తీసుకుని రూ.20 వేల కోట్లు మాఫీ చేసిన బీఆర్ఎస్ గొప్పనా" అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీకీ, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీకీ చాలా తేడా ఉందన్నారు. రుణమాఫీ చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డికి ఐదేళ్ల సమయం ఉన్నా, ఆయన సాగదీయలేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఏడాది లోపే, ఏక కాలంలో రూ.22 వేల కోట్ల రుణ మాఫీ చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో 8 కిస్తీల్లో చేసిన రుణమాఫీ రూ.20వేల కోట్లు మాత్రమేనన్నారు. ఈ తేడాను రాష్ట్రంలోని రైతులంతా గమనించాలని జగ్గారెడ్డి కోరారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. రైతు రుణమాఫీపై చర్చకు కేసీఆర్ సిద్ధమా అని సవాల్ విసిరారు.



గాంధీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఉచిత బస్సుతో బీఆర్ఎస్‌కు నష్టం

ఉచిత బస్సు పథకం అమలు కారణంగా ఆర్టీసీ బస్సుల్లో సీట్ల కోసం మహిళలు కొట్టుకుంటున్నారన్న కేసీఆర్ వ్యాఖ్యలపైనా జగ్గారెడ్డి స్పందించారు. ఆ పథకాన్ని అమలు చేయాలంటారా.. వద్దంటారా అన్నది కేసీఆర్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం కూడా తప్పేనా అని నిలదీశారు. "ఆర్టీసీని కేసీఆర్ కనుమరుగు చేసే ప్రయత్నం చేస్తే, దానికి జీవం పోసింది రాహుల్ గాంధీ" అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై రాహుల్ గాంధీ మాట ఇస్తే.. దాన్ని అమలు చేసిన ఘనత రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లదన్నారు. ఉచిత బస్సు పథకాన్ని కేసీఆర్ విమర్శించారంటే ఆ పథకం సక్సెస్ అయినట్లేనని ఎద్దేవా చేశారు. వరంగల్‌లో కేసీఆర్ సభ జరగడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన స్వేచ్ఛే కారణమని జగ్గారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వాళ్లు రోడ్లపై డాన్సులు చేసుకుంటూ వెళ్లినా పోలీసులు ఏమీ అనలేదన్నారు. అదే బీఆర్ఎస్ హయాంలో తమను అడ్డుకున్నారని, అరెస్టు చేశారని గుర్తు చేశారు. వరంగల్ సభలో అనేక సమస్యలు ప్రస్తావించిన కేసీఆర్..16 నెలలుగా ఇంట్లోనే ఎందుకు ఉండిపోయారని ప్రశ్నించారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్‌తో రైతులు సంతోషంగా ఉన్నారని, సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్, తుమ్మల భేష్ అంటూ కితాబునిస్తున్నారని పేర్కొన్నారు. ఐదెకరాల్లో సన్న వడ్లు సాగు చేస్తే రైతులకు బోనస్సే రూ.75 వేల దాకా వస్తుందని తెలిపారు.

వంట గ్యాస్ లీకై.. అగ్ని ప్రమాదం

ఒకే కుటుంబంలో బాలుడు, వృద్ధురాలి మృతి

తల్లాడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ సిలిండర్ లీకవడంతో ఇంట్లో మంటలు చెలరేగి ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరు చికిత్స పొందుతూ మృతిచెందారు. ముగ్గురు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉంది. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో సోమవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. తాపీ వర్కర్ గుత్తికొండ వినోద్ కుమార్ ఇంట్లో వంట గ్యాస్ సిలిండర్ ఖాళీ అవడంతో నిండుగా ఉన్న మరో సిలిండర్‌ను స్టవ్‌కు పెట్టారు. ఈ క్రమంలో సిలిండర్ నుంచి గ్యాస్ లీకై ఇంటి ఆవరణలో వ్యాపించింది. అదే సమయంలో ఇంటి ముందు కట్టెల పొయ్యి మండుతూ ఉండటంతో అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో ఇంట్లో ఉన్న వినోద్‌కుమార్‌తో పాటు అతడి నాయనమ్మ గుత్తికొండ సుశీల(70), ఏడేళ్ల వయసున్న కుమారులు(కవలలు) తరుణ్, వరుణ్.. మేనకోడళ్లు గుంట్రు ప్రిన్సీ(9), గుంట్రు లిమ్సీ(5) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సుశీల, హైదరాబాద్ నిలోఫర్ ఆసుపత్రిలో బాలుడు తరుణ్(7) మృతిచెందారు. వరుణ్, లిమ్సీ, ప్రిన్సీ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ప్రమాద సమయంలో వినోద్ కుమార్ భార్య రేవతి దుకాణానికి వెళ్లడంతో ఆమెకు ముప్పు తప్పింది. వేసవి సెలవులు కావడంతో సరదాగా గడుపుదామని మేనమామ వినోద్ ఇంటికి వచ్చి అక్కా చెల్లెళ్లు ప్రిన్సీ, లిమ్సీ ప్రమాదానికి గురయ్యారు.

మంత్రి ఉత్తమ్ చెప్పేవన్నీ అబద్ధాలే!

» ఎన్‌డీఎస్ఏ నివేదిక పేరిట దుష్ప్రచారం

» మంత్రి అజ్ఞానంతో కాదు, విజ్ఞానంతో ఆలోచించాలి: హరీశ్

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్డీఎస్ఏ) ఎక్కడా చెప్పలేదని మాజీ మంత్రి హరీశ్ చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయాలన్న ఉద్దేశంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అబద్ధాలు చెప్పారని పేర్కొన్నారు. ఎన్‌డీఎస్ఏ నివేదిక ఆధారంగా ఉత్తమ్ రాజకీయ ప్రసంగం చేశారని, ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయం చేస్తున్నాయని ఆరోపించారు. అందుకే ఎన్డీఎస్ఏ నివేదికను ఈడీ, సీబీఐలాగా వాడుతున్నాయని ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రాథమిక, లోక్‌సభ ఎన్నికలప్పుడు మధ్యస్థ, బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేళ తుది నివేదిక అంటూ తమ పార్టీపై విష ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్డీఎస్ఏ ఏర్పాటు బిల్లును కాంగ్రెస్ పక్షాన లోక్‌సభలో వ్యతిరేకించిన ఉత్తమ్.. ఇప్పుడు ఆ సంస్థను ప్రపంచ ప్రఖ్యాత సంస్థగా అభివర్ణిస్తున్నారని విమర్శించారు. పోలవరం అథారిటీ చైర్మన్‌గా పనిచేసిన ఎన్డీఎస్ఏ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ పోలవరం కడితే కుప్ప కూలిందని, ఐదేళ్లయినా దాన్ని ఎందుకు సందర్శించలేదని నిలదీశారు.

రేవంత్‌ది అసత్య ప్రచారం..



ఎన్డీఎస్ఏ నివేదికతో బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్‌రెడ్డి అసత్య ప్రచారానికి తెగబడ్డారని హరీశ్ ఆరోపించారు. ఆ నివేదికను సరిగా చదవాలని సూచించారు. ఎన్‌డీఎస్ఏ నివేదిక కాంగ్రెస్ ప్రభుత్వాన్నే తప్పుపట్టిందన్నారు. తగినన్ని నిధులు కేటాయించి, సరైన పద్ధతిలో నిర్వహణ చేపట్టి, జలాశయానికి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని చెబితే రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఏడో బ్లాక్‌ను పునర్నిర్మించడం ద్వారా మేడిగడ్డను వాడుకోవచ్చని నివేదికలో పేర్కొందని చెప్పారు. రాజకీయ ప్రేరేపితంగా ఎన్‌డీఎస్ఏ తన నివేదికను ఇచ్చినట్లు స్పష్టమవుతోందన్నారు. నివేదికతో రాజకీయ లబ్ధి పొందాలనే ఆరాటం తప్ప ప్రాజెక్టును కాపాడి, రైతులకు నీళ్లివ్వాలన్న ఆలోచన రేవంత్ సర్కార్‌కు లేదని తేలిపోయిందని హరీశ్ అన్నారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చారని ఆరోపించేందుకు ఉత్తమ్‌కు సిగ్గుండాలన్నారు. ఆ ప్రాజెక్టును ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించింది కాంగ్రెస్సేనని చెప్పారు. సర్వే మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరిట రూ.1426 కోట్లు కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నీటి లభ్యత లేదని చెప్పడంతోనే తుమ్మిడిహెట్టి నుంచి ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చాల్సి వచ్చిందని చెప్పారు. ఆయకట్టు రెండింతలైందని, అందుకు అనుగుణంగా నిర్మాణ వ్యయం కూడా పెరిగిందని.. కాంగ్రెస్ చేసిన తప్పును తాము సరిచేశామని తెలిపారు. ఈ విషయాన్ని ఉత్తమ్ అజ్ఞానంతో కాక విజ్ఞానంతో ఆలోచించాలని హితవు పలికారు.

కొడంగల్ లిఫ్ట్‌కు డీపీఆర్ ఉందా?

మేడిగడ్డను ప్రారంభించిన 4 నెలల వరకు డీపీఆర్ లేదని చెబుతున్నారని.. కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు డీపీఆర్ లేకుండానే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించారని హరీశ్ ఆరోపించారు. 'సిగ్గు లేకుండా మమ్మల్ని విమర్శిస్తున్నావ్. ఉత్తమ్ మీకో నీతి మాకో నీతా?' అని ధ్వజమెత్తారు. పరిస్థితులు, ముంపు, అవసరాలను బట్టి ప్రాజెక్టుల నిర్మాణ స్థలాలు మారతాయని.. అందులో తప్పేముందని నిలదీశారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్పుపై మంత్రివర్గ ఉపసంఘంలో అప్పట్లో తుమ్మల, ఈటలతోపాటు తాను కూడా సంతకం చేశానని హరీశ్ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా కాంగ్రెస్‌ను నిలదీస్తూనే ఉంటామని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పారు. తెలంగాణకు ఎప్పటికీ కాంగ్రెస్సే విలన్ అని స్పష్టం చేశారు.



హైదరాబాద్ నుంచి హజ్ యాత్రకు వచ్చిన వారికి మదీనాలో స్వాగతం పలుకుతున్న భారత అధికారులు

హజ్ యాత్ర షురూ

- భారత్‌నుంచి మదీనాకు చేరుకున్న విమానం
- నెల రోజులపాటు కొనసాగనున్న యాత్ర
- ఈ ఏడాది భారత్ నుంచి 1.30 లక్షలమంది

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ముస్లింల పవిత్ర హజ్ యాత్రకు యాత్రికుల రాక ప్రారంభమైంది. భారత్ నుంచి యాత్రికులతో తొలి విమానం మంగళవారం తెల్లవారుజామున సౌదీ అరేబియాలోని పుణ్యక్షేత్రం మదీనాకు చేరుకుంది. యాత్రికులకు ఇక్కడి భారత రాయబారి సుహేల్ ఎజాస్‌ఖాన్, కాన్సుల్ జనరల్ ఫహద్‌ఖాన్ సూరీ, ఇతర అధికారులు స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఈ విమానంలో 260 మంది యాత్రికులు వచ్చారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌లోని కడప నగరానికి చెందిన ప్రముఖ ఇస్లామిక్ పండితుడు అహ్మద్ షమియా సహా అనేక మంది తెలుగు రాష్ట్రాలకు చెందిన యాత్రికులు ఉన్నారు. కాగా, హజ్ యాత్ర కోసం హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా యాత్రికులను ప్రత్యేక విమానాలు మే 30వ తేదీ వరకు సౌదీ అరేబియాకు తీసుకొస్తాయి. ఈ నెల రోజుల్లో హైదరాబాద్ విమానాశ్రయం నుంచి మొత్తం 12 వేల మంది యాత్రికులు హజ్ యాత్రకు రానుండగా, వారిలో 8వేల మంది తెలంగాణ వారు, 1200 మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు ఉండనున్నారు. మిగిలిన వారు ఇతర రాష్ట్రాలకు చెందినవారు రానున్నారు. మొత్తంగా ఈ ఏడాది భారత్ నుంచి లక్షా 30 వేల మంది యాత్రికులు హజ్ యాత్రకు వస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యాత్రికులు హైదరాబాద్‌తోపాటు బెంగళూరు విమానాశ్రయం నుంచి సౌదీ అరేబియాకు చేరుకుంటారు.

కాంగ్రెస్, పాక్‌లది అక్రమ స్నేహబంధం

- ఆలోచనా సరళి ఇద్దరిదీ ఒకటే..
- కాంగ్రెస్ చెప్పినట్టు పాక్ నడుస్తోందా?
- పాక్ చెప్పినట్టు కాంగ్రెస్ చేస్తోందా?
- ఉగ్ర భాషలో కాంగ్రెస్ మాట్లాడుతోంది
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు



న్యూఢిల్లీ, హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, పాకిస్థాన్‌లది అక్రమ స్నేహబంధమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్ మంత్రులు భారతదేశానికి వ్యతిరేకంగా మాట్లాడితే, దానికి మద్దతుగా కాంగ్రెస్ నేతలు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ నేతల ట్వీట్లను పాకిస్థాన్ రీట్వీట్ చేస్తోందని.. వారిరువురి మధ్య ఉన్న అక్రమ స్నేహబంధానికి ఇదే నిదర్శనమన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం జరిగిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని మోదీ హాజరుకాకుండా.. బిహార్‌లో ఓ సభలో పాల్గొనటంపై కాంగ్రెస్ తాజాగా ఓ ఫొటోను ఎక్స్‌లో షేర్ చేసింది. మోదీ పోలికలున్న ఓ వ్యక్తి ఫొటోను తల లేకుండా షేర్ చేస్తూ.. 'బాధ్యతగా ఉండాల్సిన సమయంలో అదృశ్యం' (గాయబ్) అనే వ్యాఖ్యను జోడించింది. దీనిపై కిషన్‌రెడ్డి తాజాగా స్పందిస్తూ.. యావత్ భారతం, ప్రపంచ దేశాలు ఏకతాటిపైకి వచ్చి ఉగ్రవాదాన్ని అంతం చేయాలని నినదిస్తున్నాయని, కాంగ్రెస్ మాత్రం బాధ్యతను మరిచి ప్రధానిని కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు చేస్తోందని మండిపడ్డారు. దాయాది దేశంతో యుద్ధమేఘాలు కమ్ముకున్న సమయంలో బాధ్యతాయుత ప్రతిపక్షంగా వ్యవహరించాల్సిన కాంగ్రెస్.. పాకిస్థాన్, ఉగ్రవాదులు మాట్లాడుతున్న భాషలోనే మాట్లాడుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ, పాకిస్థాన్ వ్యవహార శైలి, ఆలోచనా విధానం ఒకటేనన్నారు. కొంతకాలం క్రితం పాకిస్థాన్ అనుకూల ఉగ్రవాదులు.. మహాశివుని చిత్రంలో శిరస్సు స్థానంలో వారి జెండాను ఎగరవేసిన చిత్రాన్ని విడుదల చేశారని, ఇప్పుడు కాంగ్రెస్ సైతం అదే తరహాలో మోదీ ఫొటోలో తలను తొలగించి గాయబ్ అంటూ పోస్టు పెట్టిందని చెప్పారు. కాంగ్రెస్ చెప్పినట్టు పాకిస్థాన్ నడుస్తోందా? పాకిస్థాన్ చెప్పినట్టు కాంగ్రెస్ వ్యవహరిస్తోందా? అనే సందేహం దేశ ప్రజల్లో కలుగుతోందని అన్నారు. కర్ణాటక సీఎం సిద్దరామయ్య, కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ తదితరులు కూడా దేశానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని తెలిపారు.

కశ్మీర్‌లో శాంతి కంటగింపుగా మారింది

హైదరాబాద్‌లో బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కిషన్‌రెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. యూపీఏ హయాంలో దేశంలో అనేక ప్రాంతాల్లో బాంబు పేలుళ్లు, కర్ఫ్యూలు, మతకల్లోలాలు, ఉగ్రవాద ఘటనలు జరిగేవని విమర్శించారు. 2019లో ఆర్టికల్ 370ని తొలగించిన తర్వాత జమ్మూకశ్మీర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ఇది పాకిస్థాన్‌కు, దేశంలోని కొన్ని అంతర్గత శక్తులకు కంటగింపుగా మారిందని ఆరోపించారు.

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి పర్యావరణ అనుమతులు!

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో రాష్ట్ర వాటాగా రూ.2,600 కోట్లు ఇవ్వాలి. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం రహదారిని 4 వరసలతోనే నిర్మించాలని కేంద్రం తొలుత నిర్ణయించింది. అయితే రోడ్డు నిర్మాణం పూర్తయి, అందుబాటులోకి వచ్చే సమయానికి ట్రాఫిక్ పెరుగుతుందని.. 6 వరసలకు విస్తరించాల్సి వస్తుందని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) భావిస్తోంది. ఇప్పటికే రహదారి మార్గంలో ట్రాఫిక్‌పై సర్వే నిర్వహిస్తోంది. ప్రాథమిక గణాంకాల ప్రకారం రహదారి అందుబాటులోకి వచ్చే సమయానికి వాహనాల రద్దీ భారీగా పెరుగుతుందని తేలింది. దీంతో రోడ్డును 6 వరసలుగా నిర్మించేందుకు గాను.. సమగ్ర ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్) రూపొందించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఓ సంస్థకు బాధ్యతలు అప్పగించారు. డీపీఆర్ పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే కేంద్రానికి కూడా సమర్పిస్తారని తెలుస్తోంది. రహదారి వరసలను పెంచితే ఇప్పటికే ఖరారు చేసిన జంక్షన్లు, ఇంటర్‌చేంజ్‌ల్లోనూ పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఉత్తర భాగం రహదారి సంగారెడ్డిలో మొదలై నర్సాపూర్, తూప్రాన్, జగదేవ్‌పూర్, ప్రజ్ఞాపూర్, గజ్వేల్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వరకు 161 కి.మీ. మేర ఉండనుంది. రహదారి నిర్మాణం కోసం 2024 డిసెంబరు 27న రూ.7,104 కోట్లతో ఎన్‌హెచ్ఏఐ టెండర్లను ఆహ్వానించింది. మొత్తం రోడ్డును 5 ప్యాకేజీలుగా విభజించింది. ఇప్పుడు రహదారి నిర్మాణంలో రెండు వరసలు పెరిగిన నేపథ్యంలో కొత్త టెండర్లను పిలవనున్నారు.

ముఖ హాజరుతో ఆందోళన వద్దు : డీఎంఈ



హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో మే 1 నుంచి అమల్లోకి వచ్చే ముఖ హాజరు విధానంపై భయాందోళనలు వద్దని వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ నరేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఎన్ఎంసీ ఈ నెల 16న ముఖ హాజరుకు సంబంధించి ఒక సర్క్యులర్ విడుదల చేసిందని, బయోమెట్రిక్ స్థానంలో దీన్ని తీసుకువస్తున్నట్లు వెల్లడించిందని పేర్కొన్నారు. ఈ విధానంలో వైద్యుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలగదని తెలిపారు. కొన్ని వైద్య కళాశాలల్లో ఘోస్ట్ ఫ్యాకల్టీ, సిలికాన్ థంబ్, డూప్లికేషన్ ఫ్యాకల్టీని చూపిస్తున్నారని, దీన్ని నివారించేందుకే ముఖ హాజరు విధానాన్ని తీసుకొస్తున్నారని వివరించారు. ఎన్ఎంసీ మార్గదర్శకాల మేరకు మన వద్ద కూడా ముఖ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఫేస్ అటెండెన్స్‌పై అధ్యాపకులు అపోహలు పెట్టుకోవద్దని చెప్పారు.

బీజేపీది అధికార కాంక్ష

- ఆ పార్టీకి దేశం విచ్ఛిన్నమైనా పరవాలేదు
- రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ



హైదరాబాద్, ఏప్రిల్, 29 (ఆంధ్రజ్యోతి) : దేశం విచ్ఛిన్నమైనా పర్వాలేదు.. ఎప్పటికీ తామే అధికారంలో ఉండాలన్న కాంక్షతో బీజేపీ పని చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. మగ్దూం భవన్‌లో మంగళవారం నిర్వహించిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. బీజేపీకి అధికార వాంఛ తప్ప ప్రజలు, దేశం పట్ల ప్రేమ లేదని విమర్శించారు. తమను ఎవరూ ప్రశ్నించకూడదనే నియంతృత్వ ధోరణితో.. చివరకు న్యాయవ్యవస్థపైనా కేంద్రం దాడి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందన్నారు. గాంధీని చంపిన గాడ్సేకు గుడులు కట్టే రోజులు కూడా త్వరలోనే వస్తాయన్నారు. సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. మోదీ ప్రధానమంత్రి అయ్యాక ప్రజాస్వామ్యం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. దేశంలో వామపక్ష శక్తులు బలహీన పడటంతో మతోన్మాద బీజేపీ చెలరేగిపోతోందన్నారు. కమ్యూనిస్టులు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వంద రోజుల్లోనే కిందకు!

ప్రతి వంటవాడూ పరిపాలించగలడు (Every cook can Govern) –ప్రాచీన గ్రీకు ప్రజాస్వామ్య స్ఫూర్తిని ట్రినిడాడ్ రచయిత, మార్క్సిస్టు చింతకుడు సిఎల్ఆర్ జేమ్స్ అలా స్ఫూర్తిదాయకంగా సంక్షేపించాడు. ఆయనే గత శతాబ్ది మధ్యనాళ్లలో అమెరికా వినోద పరిశ్రమ హాలీవుడ్ ధోరణులను నిశితంగా విశ్లేషిస్తూ అమెరికా ఉదారవాద సంస్కృతి క్షీణముఖం పట్టి నియంతృత్వ పాలకులు ప్రభవించవచ్చని భావించాడు. జేమ్స్ భయాలు 21వ శతాబ్దిలో, ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ రాజకీయ రంగంలోకి వచ్చిన తరువాత నిజమవుతున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ట్రంప్ రెండోసారి అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టి నేటితో 100 రోజులు పూర్తవుతున్న సందర్భంగా అమెరికా ప్రజానీకం, మేధో శ్రేణులు, రాజకీయ వర్గాలలోనూ అటువంటి అభిప్రాయాలే గట్టిగా వ్యక్తమవుతున్నాయి. 'అమెరికా రాజ్యాంగం ప్రమాదంలో పడింది. పౌర, మానవ హక్కులు అణచివేయబడుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైపోయింది. ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ ఏమైపోయినా ట్రంప్‌కు కావాల్సింది మాత్రం అవధులు లేని సంపూర్ణ అధికారం. నియంతృత్వంలోకి అమెరికా జారిపోతోంది' అని బిల్‌క్లింటన్ ప్రభుత్వంలో కార్మిక శాఖ కార్యదర్శిగా ఉన్న రాబర్ట్ రెయిష్ వాపోయారు.

గత నవంబర్‌లో అధ్యక్ష ఎన్నికలలో అమెరికా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఎంతో నమ్మకంతో ట్రంప్‌ను భారీ మెజారిటీతో గెలిపించారు. అయితే పదవీ బాధ్యతలు చేపట్టిన క్షణం నుంచీ ట్రంప్ చేపడుతున్న చర్యలేవీ అత్యధికులకు ఆమోదయోగ్యంగా లేవు. పెంగ్విన్ పక్షులు మాత్రమే ఉండే ఒక దీవితో సహా ప్రపంచ దేశాలన్నిటిపైనా ఆయన ప్రారంభించిన సుంకాల యుద్ధం తమను తీవ్ర ఆర్థిక మాంద్యంలోకి నెట్టివేస్తోందని అమెరికన్లు ఆందోళన చెందుతున్నారు. ఈ కారణంగానే గత ఎనభై సంవత్సరాలలో ఏ అధ్యక్షుడి వంద రోజుల పాలన కంటే ట్రంప్ తొలి వంద రోజులు (ఇప్పుడేకాదు, మొదటి పర్యాయం కూడా) అధ్వాన్నంగా ఉన్నట్టు అనేక సర్వేలలో వెల్లడయింది.

ట్రంప్ 'అమెరికా ఫస్ట్' విధానంతో చిరకాలంగా నమ్మకమైన మిత్రులుగా ఉన్న యూరోపియన్ దేశాలు అమెరికాపై చిరచిరలాడుతున్నాయి. అధికారాన్ని అప్పగిస్తే ఉక్రెయిన్ యుద్ధాన్ని 24 గంటలలో నిలిపివేస్తానన్న ట్రంప్‌ను రష్యా లెక్క చేయడం లేదు. యూరోప్‌లో శాంతి సుదూర గమ్యంగా మిగిలిపోయింది. పశ్చిమాసియాలో అమెరికా ప్రయోజనాలకే కాదు, తన సొంత కుటుంబ లబ్ధి కోసం కూడా మానవతను హతమారుస్తున్న ఇజ్రాయిల్‌ను ట్రంప్ వెనకేసుకొస్తున్నాడు. భౌగోళిక సామ్రాజ్యవాదానికి మళ్లీ ఊపిరిపోయడానికి సిద్ధమైన ట్రంప్‌కు కెనడా ఓటర్లు తమ పార్లమెంటరీ ఎన్నికలలో చెంపపెట్టు లాంటి తీర్పునిచ్చారు. కెనడా 51వ రాష్ట్రంగా అమెరికాలో చేరాలని సతాయిస్తున్న ట్రంప్‌కు వందరోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కెనడియన్లు మంచి గుణపాఠమే చెప్పారు.

అమెరికాను మళ్లీ గొప్పదేశంగా చేయాలన్న ఆరాటంతో ట్రంప్ పూర్తిగా అసంబద్ధ విధానాలను అనుసరిస్తున్నారు. ఏ రంగమూ ఆరోగ్యకరంగా అభివృద్ధి చెందేందుకు అవి తోడ్పడేవి కావు. విద్యావేత్తలు, విద్యార్థులు, పాత్రికేయులు, మేధావులు, వృత్తి నిపుణులు అందరూ ట్రంప్ ప్రభుత్వం పట్ల అసంతృప్తితో రగిలిపోతున్నారు. చివరకు ట్రంప్ నియమించిన న్యాయమూర్తులు సైతం ఆయన నిర్ణయాలను వ్యతిరేకిస్తూ తీర్పులు వెలువరిస్తున్నారు. ఇంతవరకు ఆయన తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన చర్యలపై వ్యక్తులు, ప్రభుత్వాలు, వృత్తి సంఘాలు, ప్రజాసముదాయాలు న్యాయపోరాటాలు చేస్తున్నాయి. సమీప భవిష్యత్తులోనే సుప్రీంకోర్టు తీర్పులను సైతం ధిక్కరించడానికి ట్రంప్ సాహసించవచ్చని రిపబ్లికన్ పార్టీ వర్గాలే కలవరపడుతున్నాయి. దీన్ని బట్టి అమెరికా 47వ అధ్యక్షుడు ఎంత ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదీ అర్థం చేసుకోవచ్చు.

మాజీ అధ్యక్షుడు జో బైడెన్ గత జనవరిలో వైట్‌హౌజ్ నుంచి నిష్క్రమిస్తూ అమెరికా పాలనా వ్యవస్థ పూర్తిగా బిలియనీర్ల చేతుల్లోకి పోతుందని హెచ్చరించారు. అమెరికాలో ఇప్పుడు అల్పజన పాలన జరుగుతుందనడంలో సందేహం లేదు. ట్రంప్‌కు సన్నిహితులుగా ఉండి వివిధ ప్రభుత్వ విభాగాలకు ఆధ్వర్యం వహిస్తున్న ధనవంతులు అమెరికా ప్రయోజనాల కంటే సొంత లాభానికి ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తున్నారు. దీంతో అమెరికా సమాజంలో అమానవీయమైన మనోవైఖరులు ప్రబలుతున్నాయి. సమాజజీవనంలో సంప్రదాయ విలువలు లుప్తమైపోతున్నాయి. అత్యున్నతస్థాయిలో అమెరికా ప్రభుత్వం తన మహోన్నత ప్రజాస్వామిక చరిత్రను విస్మరించి నిర్లజ్జగా సామ్రాజ్యవాద అభిజాత్యాలకు పోతోంది. అమెరికా ప్రభుత్వం చట్టాల చేత నడపబడేదేకాని, వ్యక్తులు నిర్వహించేదికాదని అమెరికా సంస్థాపకులలో ఒకరైన జాన్ ఆడమ్స్ ప్రవచించారు. ఆడమ్స్ భావాలకు పూర్తి భిన్నంగా ట్రంప్ ఏలుబడిలో వర్తమాన అమెరికా ఉన్నదని ప్రత్యేకంగా చెప్పాలా?

కశ్మీర్ విసురుతున్న సరికొత్త సవాళ్లు



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

రాజ్యాలు, ప్రభుత్వాలు అత్యంత బలంగా ఉన్నప్పుడు విముక్తి పోరాటాలైనా, విచ్ఛిన్నకర పోరాటాలైనా ఎంత సుదీర్ఘకాలం జరిగినా విజయవంతమయ్యే అవకాశాలు లేవని ఐరిష్ రిపబ్లికన్ ఆర్మీ నుంచి ఎల్‌టీటీఈ వరకు అనేక సంస్థలు నిర్వహించిన సంఘర్షణలు రుజువు చేస్తున్నాయి. ప్రజాస్వామిక స్ఫూర్తితో పాటు ప్రజాచైతన్యం వెల్లువలా లేనంతవరకూ, శక్తియుక్తులపై సరైన అవగాహన లేనంతవరకూ నెత్తురు టేరులు పారడం తప్ప వేరే ప్రయోజనం ఉండదు. కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న సంస్థలకు ఎంత పొరుగు దేశం నుంచి మద్దతు అందుతున్నా మొత్తం భారతదేశ ప్రజల ఆకాంక్షలను అధిగమించి విజయం సాధించడం ఏనాడూ సాధ్యం కాదని ఇప్పటికే తేలిపోయింది. అయినా పహల్గామ్ ఘటనలో అమాయకులైన పర్యాటకుల్ని పొట్టనపెట్టుకోవడం ఉగ్రవాదులకే కాదు, వారిని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు కూడా స్వయంఘాతుక చర్యగా మారిందనడంలో సందేహం లేదు.

'సర్జికల్ దాడుల తర్వాత మోదీ ప్రభుత్వం సీమాంతర ఉగ్రవాదాన్ని దాదాపు అరికట్టింది.' అని హోంమంత్రి అమిత్ షా గత ఏడాది ప్రకటించారు. ఈ ఏడాది ఏప్రిల్ 6–8 తేదీల్లో జమ్ముకశ్మీర్‌లో విస్తృతంగా పర్యటించిన అమిత్ షా సరిహద్దుల్లో భద్రతా చర్యలను సమీక్షించారు. అన్ని భద్రతా ఏజెన్సీలు కలిసికట్టుగా సమన్వయంతో జమ్ము కశ్మీర్‌లో శాంతి భగ్నం కాకుండా చూడాలని కోరారు. వాస్తవాధీన రేఖ వద్ద అధునాతన ఎలెక్ట్రానిక్ నిఘా వ్యవస్థల్ని ప్రవేశపెట్టే విషయం కూడా ఆయన చర్చించారు. జమ్ముకశ్మీర్‌లో అమిత్ షా పర్యటించి వచ్చి రెండు వారాలు కాకముందే ఉగ్రవాదులు పహల్గామ్‌లో పెద్ద ఎత్తున పర్యాటకుల్ని కాల్చి చంపారు. 20 నిమిషాల పాటు పర్యాటకుల్ని కాల్చి చంపుతున్నప్పుడు రాష్ట్ర పోలీసుల కానీ, సీఆర్‌పీఎఫ్ కానీ ఒక్కరు కూడా దరిదాపుల్లో లేరు రా, సైన్యం, ఐబీ, బీఎస్ఎఫ్, పోలీసు లేదా ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ఏమి చేస్తున్నాయి?

ఈ సంఘటన తర్వాత దేశ ప్రజల రక్తం మరిగిపోయినట్లు దేశ వ్యాప్తంగా వెల్లువలా వచ్చిన ప్రతిస్పందనలు స్పష్టమవుతున్నాయి. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలైంది. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసి ఆరు సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ 11 సంవత్సరాల్లో అడపాదడపా ఉగ్రవాద ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్ని చర్యలు తీసుకున్నా ఉగ్రవాదుల నెట్‌వర్క్ విచ్ఛిన్నమైనట్లు దాఖలాలు కనపడడం లేదు. 2016లో యూరిలో 14 మంది, 2018లో కుల్గామ్, పుల్వామాలో 56 మందిని, 2023లో రియాసీలో 9 మందిని చంపడం పెద్ద ఘటనలు కాగా అయిదుగురి లోపు బలిగొన్న సంఘటనలు ఎన్నో. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా 2024 జూన్ 9 నుంచి 2025 వరకు ఉగ్రవాదుల హింసాకాండకు 60 మందికి పైగా ప్రజలు బలయ్యారు. వీరిలో 33 మంది సైనికులు కూడా ఉన్నారు.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే పహల్గామ్‌లో ఇంత పెద్ద సంఖ్యలో పర్యాటకుల్ని మతం అడిగి చంపడం ఒక ఎత్తు. 2000 సంవత్సరంలో అమరనాథ్ వెళుతున్న 32 మంది యాత్రికుల్ని ఇదే పహల్గామ్‌లోని నున్వాన్ బేస్ క్యాంప్ వద్ద కాల్చి చంపారు. ఈ నేపథ్యంలో జూలై 3 నుంచి ఆగస్టు 9 వరకు జరగాల్సిన అమర్‌నాథ్ యాత్ర పరిస్థితిపై ఆందోళన నెలకొన్నది. పర్యాటకులపై దాడి చేసి స్థానిక ఆర్థిక వ్యవస్థల్ని భగ్నం చేయాలన్న ఒక దీర్ఘకాలిక ప్రణాళికతో ఈ పహల్గామ్ దాడి జరిగినట్లు పాక్ సైనికాధ్యక్షుడు ఆసిమ్ మునీర్ మాటల్ని బట్టి అర్థమవుతుంది. మరి మనకెందుకు ఉప్పందలేదు?

సీమాంతర ఉగ్రవాదం కశ్మీర్‌లో ప్రజలను ఇంకెంతకాలం బలిగొంటుంది? నిజానికి ఆర్ఎస్ఎస్ నేపథ్యం నుంచి వచ్చి, మొక్కవోని జాతీయవాద దృక్పథం ఉన్న నరేంద్రమోదీ వంటి బలమైన నాయకుడు గతంలో ఎప్పుడూ లేరని ఆయన అభిమానులు సందర్భం వచ్చినప్పుడల్లా చెప్పుతూ ఉంటారు. 'నా కవిత్వం యుద్ధ ప్రకటనతో సమానం. అది ఊకదంపుడు కాదు. అది ఓడిపోయిన సైనికుడి హృదయ స్పందన కాదు, కాని విజయం సాధించాలనుకునే యోధుడి పట్టుదల' అని అటల్ బిహారీ వాజపేయి 2000 సంవత్సరంలో కార్గిల్‌లో పాక్ చొరబాటు తర్వాత ప్రకటించారు. ఆరు రోజుల్లో భారత సైన్యం సరిహద్దులు దాటి పాకిస్థాన్‌లో ప్రవేశించేందుకు వాజపేయి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుసుకుని అప్పటి అమెరికా అధ్యక్షుడు క్లింటన్ జోక్యం చేసుకోవడంతో పాక్ చొరబాటుదారులు వెనక్కు తగ్గారు. సంకీర్ణ ప్రభుత్వం నడిపిన వాజపేయి అంత సాహసానికి సిద్ధపడితే నరేంద్రమోదీ లాంటి నాయకుడు ఇంకెంత సాహసం ప్రదర్శించాలి?

కాని పహల్గామ్ ఘటన తర్వాత జరిగిన భద్రతా వ్యవహారాల కేంద్ర కేబినెట్ తొలి సమావేశంలో ప్రకటించిన చర్యలు ఎంతో మృదువుగా ఉన్నాయి. 65 సంవత్సరాల సింధు జల ఒప్పందాన్ని రద్దుచేసినా భారతదేశం పాక్‌కు ఈ నదీజలాల్ని వెంటనే ఆపగలిగిన పరిస్థితి లేదు. సింధూ లోయ నదుల నీటి సంరక్షణ కోసం నిర్మాణ పనులు చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసేందుకైనా కొన్ని సంవత్సరాలు పడుతుంది. దౌత్య అధికారులను ఉపసంహరించుకోవడం, పాక్ పౌరులను వెంటనే వెళ్లిపొమ్మనడం పెద్ద చర్యలేమీ కాదు.

అయినా పహల్గామ్ సంఘటన భారత రాజకీయాల తీరుతెన్నుల్ని మార్చే అవకాశం ఉన్నది. ఇక నుంచి ఏ బహిరంగ సభ జరిగినా అధికార పార్టీ నేతలు ఈ ఘటన గురించి ప్రస్తావించకమానరు. ఈ ఘటన తర్వాత హిందువులు ఏకం కావాల్సిన అవసరం కనపడుతోందని, ఏకమైతే మననెవరూ ఏమీ చేయలేరని ముంబైలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. బీజేపీ, సంఘ్ పరివార్ అనుబంధ సంస్థలు ఈ ఘటనను దేశ భక్తిపై భావోద్వేగాలను రగిల్చేందుకు తప్పక ఉపయోగించుకుంటాయి. ప్రజల ఓటింగ్ శైలిపై కూడా ఈ ఘటన ప్రభావం పడక తప్పదు. పహల్గామ్ నేపథ్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్‌తో సహా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు మోదీ సర్కార్ ఏ చర్య తీసుకున్నా అండగా నిలుస్తామని చెప్పాయి. ఇది మోదీ బాధ్యతను మరింత పెంచింది.

మరోవైపు ఈ ఘటన తర్వాత ఇతర రాజకీయ అంశాల గురించి, రాజ్యాంగం గురించి మాట్లాడడం కొంతకాలం వరకు అసందర్భంగా మారవచ్చు. 'ఉగ్రవాదులు కులం అడిగి కాదు, మతం అడిగి కాల్చేశారు. వెళ్లి మోదీకి చెప్పుకోమన్నారు' అన్న వ్యాఖ్యలు చాలా కాలం పాటు ప్రభావం చూపుతాయి. బిహార్‌లోనూ, ఇతర ప్రాంతాల్లోనూ కుల సమీకరణలకు భిన్నంగా మతం కీలక పాత్ర పోషించే, కనీస ప్రజా సమస్యలు కూడా పక్కతోవన పట్టే అవకాశాలు లేకపోలేదు. దేశ రాజకీయాల్లో ముస్లింల ప్రాతినిధ్యం మరింత తగ్గిపోయేందుకు ఇది ఆస్కారం కలిగిస్తుంది. ఇండియా కూటమి రానున్న రోజుల్లో తమ వ్యూహరచన విషయంలో ఆచితూచి వ్యవహరించాల్సిన పరిస్థితులు కనపడుతున్నాయి. ఈ విషయం తెలిసినందువల్లే ఈ సంఘటన జరిగిన వెంటనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన విదేశీ పర్యటనను రద్దు చేసుకుని వచ్చి బిహార్‌లో బహిరంగ సభలో పాల్గొని ఇంగ్లీషులో హెచ్చరికలు చేశారు! అంటే పహల్గామ్‌పై అంతర్జాతీయ సమాజానికి ఒక సందేశం పంపడం కూడా ఆయన ఉద్దేశం. పహల్గామ్ నేరస్థుల్ని పాతిపెట్టేందుకు సమయం ఆసన్నమైందని, వారు ఊహించిన దానికంటే ఎక్కువ శిక్షపడుతుందని ఆయన అన్నారు. 'తాము తక్షణం బలమైన చర్యలు ప్రారంభిస్తాం' అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా చెప్పారు. ఈ హెచ్చరికల అర్థం ఏమిటి? గాజాలోని హమాస్ స్థావరాలపై ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ లాగా మోదీ పాక్‌పై దాడులు చేయిస్తారా లేక కేవలం బిహార్, బెంగాల్‌లో ఎన్నికల ప్రయోజనాలు పొందేందుకే ఈ వాతావరణాన్ని ఉపయోగించుకుంటారా అన్నది వేచి చూడాల్సి ఉన్నది. ప్రజలు బహిరంగ సభల్లో ఇలాంటి హెచ్చరికలకు ఇప్పటికే అలవాటుపడ్డారు. పుల్వామా విషయంలో జరిగినట్లు కాకుండా మోదీ తన రాజకీయ ప్రయోజనాలు, మనుగడకు మించి చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా దేశ వ్యాప్తంగా ప్రజల్లో మతం, జాతీయవాదం, దేశభక్తి కలిసిపోయి ప్రతిదానిపైనా ఉద్వేగ పూరితంగా స్పందించే తత్వం పెరిగింది. అనేక ప్రాంతాల్లో ప్రజలు బయటకు వచ్చి పాక్ వ్యతిరేక నినాదాలు చేస్తున్నారు. వారిని శాంతింపచేయడం అంత సులభం కాదు. ప్రజల భావోద్వేగాలు నేతలకు అనుకూలంగా మారినప్పుడు ఆ అనుకూలతే ఒకోసారి సింహంపై స్వారీలాగా మారుతుంది.

మరో వైపు కశ్మీర్ మరింత అంధకార బంధురమయ్యే పరిస్థితులు లేకపోలేదు. 'మేమిక్కడ జన్మించడమే మా దురదృష్టం' అని కశ్మీరీ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత అజుర్ దా శ్రీనగర్ నుంచి పంపిన వాట్సాప్ సందేశంలో చెప్పారు. ఇటీవలి కాలంలో పహల్గామ్ తదితర అందమైన ప్రాంతాల్లో హోటళ్ల నిర్మాణం ప్రారంభమైంది. బ్లూమ్స్ బరీ లాంటి సంస్థలు కశ్మీర్ ప్రకృతి సౌందర్యంపై, మారుతున్న ప్రజా జీవనంపై కాఫీ టేబుల్ బుక్స్‌ను ప్రచురించాయి. ఇప్పుడు మళ్లీ పర్యాటక స్థలాలన్నీ మూసివేస్తున్నారు. కశ్మీర్‌కు మంచి రోజులు వచ్చాయి అని ప్రభుత్వం ఇప్పట్లో చెప్పుకునే పరిస్థితి కనపడడం లేదు.

నిజానికి 31 సంవత్సరాల క్రితమే పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1994 ఫిబ్రవరి 22న ఆక్రమిత కశ్మీర్ నుంచి పాక్ ఖాళీ చేయాలని, లేకపోతే తామే దాన్ని విముక్తం చేస్తామని పార్లమెంట్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అప్పుడు ప్రతిపక్ష నేతగా అటల్ బిహారీ వాజపేయి ఉన్నారు. ఈ తీర్మానాన్ని అమలు చేసేందుకు ఇప్పుడు సమయం ఆసన్నమవలేదా? గతంలో లాహోర్ వరకు మన సైన్యం వెళ్లినా అంతర్జాతీయ ఒత్తిడులకు లోనై వెనక్కి తగ్గాల్సి వచ్చింది. మోదీ వాటికి భిన్నంగా వ్యవహరిస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



నిజానికి 31 సంవత్సరాల క్రితమే పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1994 ఫిబ్రవరి 22న ఆక్రమిత కశ్మీర్ నుంచి పాక్ ఖాళీ చేయాలని, లేకపోతే తామే దాన్ని విముక్తం చేస్తామని పార్లమెంట్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అప్పుడు ప్రతిపక్ష నేతగా అటల్ బిహారీ వాజపేయి ఉన్నారు. ఈ తీర్మానాన్ని అమలు చేసేందుకు ఇప్పుడు సమయం ఆసన్నమవలేదా?

అబ్రహం మతాల – యూదు, క్రైస్తవ, ఇస్లాం–కు జన్మస్థలమైన ఫలస్తీనాను సందర్శించి ఆ పుణ్యభూమిలో రక్తపాతాన్ని పోప్ ఫ్రాన్సిస్ తప్పుపట్టారు. అరబ్బు దేశాలలోని ఇస్లామిక్ మత గురువులతో మైత్రిని ఆకాంక్షించి వారితో సౌహార్ద సంబంధాలు నెలకొల్పుకున్నారు. ఇస్లాం, క్రైస్తవ మత గురువులు సంయుక్తంగా ప్రపంచ శాంతికి కృషి చేయాలని కోరిన విశాల హృదయుడు పోప్ ఫ్రాన్సిస్.

మానవతను మేల్కొల్పిన మహాత్ముడు

ఉన్నత స్థానాలలోని వ్యక్తుల ప్రసంగాలను ప్రజానీకం శ్రద్ధగా ఆలకించడం కద్దు. వాటి నుంచి స్ఫూర్తి, ప్రేరణ పొందుతారు. అందునా ఆధ్యాత్మిక ప్రముఖుల ప్రవచనాల ప్రభావశీలత ప్రజలపై అధికంగా ఉంటుంది. సాధారణంగా దైవభక్తి ప్రవచనాలను బోధించే మత గురువులు వర్తమాన సామాజిక సమస్యలపై తమ అభిప్రాయాలను వ్యక్తీకరిస్తే, సహజంగానే జనులు అందరూ వాటిని అమితాసక్తితో వింటారు.

ఇటీవల మరణించిన అత్యున్నత క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ నిస్సందేహంగా ఒక విశిష్ట వ్యక్తి. వినయం, కరుణ, శాంతి సందేశాలతో కోట్లాది ప్రజలకు స్ఫూర్తినిచ్చిన సమున్నత ఆధ్యాత్మికవేత్త. మెరుగైన జీవన స్థితిగతులకు ఆరాటపడుతూ అభివృద్ధి చెందిన దేశాలకు వలస వెళ్లిన వారి పక్షాన తన గొంతుక వినిపించిన మహానుభావుడు పోప్ ఫ్రాన్సిస్. అమెరికా, ఐరోపాలు అవలంబిస్తున్న కఠోర వలస విధానాలను విమర్శించి, తమ మాతృభూమిని వదిలి వచ్చిన వారి పట్ల సానుభూతి చూపాలని సంపన్న రాజ్యాల ప్రభుత్వాధినేతలకు పోప్ ఫ్రాన్సిస్ పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వలస వ్యతిరేక విధానాలను ఆయన ఆక్షేపించారు. అంతేకాదు, మెక్సికో – అమెరికా సరిహద్దులో సామూహిక ప్రార్థనలు నిర్వహించి వినూత్నంగా తన అసంతృప్తిని వ్యక్తం చేసిన మానవతావాది పోప్ ఫ్రాన్సిస్. ప్రపంచ క్రైస్తవ మత పెద్దగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సంప్రదాయాలకు భిన్నంగా ఆయన ఇటలీలోని ఒక జైలుకు వెళ్ళి ఖైదులో ఉన్న అక్రమ చొరబాటుదారుల పాదాలను పవిత్ర జలాలతో అభిషేకించారు. తద్వారా పాశ్చాత్య దేశాలు అనుసరిస్తున్న శరణార్థి వ్యతిరేక విధానాలను ఆయన నిరసించారు. పొట్టకూటి కొరకు వచ్చే పేదలూ మానవులే అని పాశ్చాత్య దేశాల పాలకులకు సందేశమిచ్చారు.

గల్ఫ్ లేఖ

ఆఫ్రికా నుంచి లిబియా మీదుగా వచ్చే శరణార్థులతో సతమతమవుతున్న ఇటలీ అనేక సందర్భాలలో ఆ అభాగ్యులను తీసుకువచ్చే పడవలను తమ తీరప్రాంతాలకు చేరేందుకు అనుమతి నిరాకరించి అవి మునిగిపోవడానికి కారణమై విమర్శలకు గురయింది. అదే విధంగా గ్రీస్‌పై కూడ వలసకారుల పట్ల అమానవీయంగా ప్రవరిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ రెండు దేశాల సముద్ర జలాలలో నిరీక్షిస్తున్న



శరణార్థుల వద్దకు వెళ్ళి వారికి సంఘీభావం ప్రకటించిన దైవ పుత్రుడు ఫ్రాన్సిస్. సిరియా నుంచి ఐరోపాకు పారిపోతూ మార్గమధ్యంలో గ్రీసులో చిక్కుకుపోయిన ఒక డజను మంది సిరియన్ ముస్లింలను తన విమానంలో వాటికన్ నగరానికి తీసుకువచ్చిన మానవతామూర్తి పోప్ ఫ్రాన్సిస్.

క్రైస్తవ మత కేంద్రమైన వాటికన్ నగరం స్వయం ప్రతిపత్తి ఉన్న దేశమైనా, అది పూర్తిగా ఇటలీపై ఆధారపడి ఉన్నది. అయినా, పోప్ ఫ్రాన్సిస్ తన అతిథ్య దేశమైన ఇటలీ వలస విధానాల పట్ల అసంతృప్తి వ్యక్తం చేయడానికి ఎప్పుడూ వెనుకాడలేదు.

మతం ప్రాతిపదికన రక్తపాతం జరుగుతున్న బర్మా, సిరియా, ఫలస్తీనా, సిరియా, ఇరాఖ్, ఇంకా అనేక ఆఫ్రికా దేశాలలో పర్యటించి అక్కడి హింసకాండను ఖండించిన పోప్, మతాలకు అతీతంగా సమస్త మానవాళికి ఒక ఆదర్శ పురుషుడు. అబ్రహం మతాల – యూదు, క్రైస్తవ, ఇస్లాం–కు జన్మస్థలమైన ఫలస్తీనాను సందర్శించి ఆ పుణ్యభూమిలో రక్తపాతాన్ని పోప్ ఫ్రాన్సిస్ తప్పుపట్టారు. అరబ్బు దేశాలలోని ఇస్లామిక్ మత గురువులతో మైత్రిని ఆకాంక్షించి వారితో సౌహార్ద సంబంధాలను పెంపొందించుకోవడంలో ఆయన కొంతవరకు సఫలీకృతులయ్యారు. ఇస్లాం అధ్యాత్మిక ఫత్వాలకు ప్రపంచవ్యాప్తంగా కేంద్రమైన ఈజిప్టు రాజధాని కైరోలోని వేయి సంవత్సరాల చరిత్ర కలిగిన అల్ అజహర్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి దాని ప్రధాన గురువు శేఖ్ అహ్మద్ తయీబ్‌తో సమావేశమై సమాలోచనలు జరిపారు. ఇస్లాం, క్రైస్తవ మత గురువులు సంయుక్తంగా ప్రపంచ శాంతికి కృషి చేయాలని కోరిన విశాల హృదయుడు పోప్ ఫ్రాన్సిస్. సహజంగానే ఆయన పట్ల ముస్లిం సమాజాలలో గౌరవాదరాలు పెరిగాయి. మక్కాలో హాజ్ నమాజుకు నేతృత్వం వహించిన ఇస్లామిక్ విద్వాంసుడు శేఖ్ మోహమ్మద్ అల్ ఈసా కూడ వాటికన్‌కు వెళ్ళి పోప్‌తో సమావేశమయ్యారు.

యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్ రాజధాని అబుధాబి నగరంలో మూడు మతాలకు కలిపి ఒక చోట ఒకే పరిమాణంలో నిర్మించిన మస్జీద్, చర్చి, సినగోగ్‌లతో కూడిన అబ్రహం హౌస్ ప్రారంభోత్సవానికి హాజరు కావడం ద్వారా పోప్ ఫ్రాన్సిస్ మతసహన సందేశాన్నిచ్చారు.

భారతదేశంలో క్రైస్తవుల సంఖ్య స్వల్పమే. అయితే భారతీయ క్రైస్తవ జనాభా అనేక దేశాలలోని క్రైస్తవుల సంఖ్య కంటే ఎక్కువగా ఉంది. భారతదేశాన్ని సందర్శించే అవకాశం పోప్ ఫ్రాన్సిస్‌కు రాలేదు. 2017లో ఆయన భారత్‌ను సందర్శిస్తారని భావించినా, అధికారికంగా ఆయనకు ఆహ్వానం అందకపోవడంతో బర్మా, బంగ్లాదేశ్‌కు వెళ్ళారని క్రైస్తవ ప్రముఖులు చెబుతారు, 2021లో ప్రధాని మోదీ వాటికన్‌ను సందర్శించి పోప్‌ను భారత పర్యటనకు అధికారికంగా ఆహ్వానించారు. పోప్ అంత్యక్రియల సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వాటికన్‌కు వెళ్ళి ఆయనకు నివాళి అర్పించడం ముదావహం.

రాబోయే కొత్త పోప్‌తో పాటు ప్రపంచంలోని అన్ని మతాల గురువులు మానవీయ విలువలను తమ చేతల ద్వారా బోధిస్తే సమస్త మానవాళిలో సౌభ్రాతృత్వం విలసిల్లుతుంది.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

బసవేశ్వరుని సంస్కర్త హృదయం


సమసమాజం శోషణకు గురై సామాజిక వ్యవస్థ బూజుపట్టి, అస్పృశ్యత, జాతి–వర్గ–వర్ణ విభేదాలు, యజ్ఞ యాగాలు, హోమాలు, నరబలి, స్త్రీ–శిశు హత్యలు, బాల్యవివాహాలు, సతీసహగమనం మొదలైన మూఢాచారాలు తాండవిస్తున్న తరుణంలో బసవేశ్వరుడు అనే క్రాంతి పురుషుడు జన్మించారు. క్రీస్తుశకం 1134లో ఇప్పటి కర్ణాటక రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, బాగేవాడి గ్రామంలో శైవ బ్రాహ్మణ కుటుంబంలో అగ్రహారం పెద్ద అయిన మాదిరాజు –మాదాంబిక దంపతులకు పుట్టారు.

బాల్యం నుంచి మూఢాచారాలను వ్యతిరేకించిన బసవేశ్వరుడు ఎనిమిదవ యేట తండ్రి ఉపనయనం చేయడానికి సిద్ధపడగా, తండ్రి మాటను తిరస్కరించి తన అక్క నాగాంబిక వద్దకు చేరుకున్నారు. అక్కడే గురుకులంలో వేద శాస్త్ర పురాణాలన్నీ అధ్యయనం చేసి దినదిన ప్రవర్ధమానమై ఎదిగిన బసవేశ్వరుడు, బుద్ధిశాలిగా, సాహిత్య, వేద, పురాణ, ఆగమ, సంగీత, గణిత విద్యలన్నింటిలో ప్రావీణుడై పండిత పూర్ణ వ్యక్తిత్వాన్ని సంపాదించారు. ఈ సమయంలో దోషరహితమైన ధార్మిక వ్యవస్థకు శ్రీకారం చుట్టారు.

విద్యాభ్యాసం అనంతరం బిజ్జల చక్రవర్తి దండ నాయకుడైన తన మేనమామ బలదేవర కూతురును వివాహమాడి, స్వయం ఆర్జనతో జీవించే తలంపుతో బిజ్జలుని కొలువులో చేరారు. అపార మేధాసంపన్నుడైన బసవేశ్వరుని నీతి, నిబద్ధత, సమాజసేవను గుర్తించిన బిజ్జల రాజు తన రాజ్యానికి ప్రధానమంత్రిగా ఆయనను నియమించాడు. అనతి కాలంలోనే బసవేశ్వరుడు ఆ రాజ్యంలో నూతన సామాజిక, ధార్మిక సంస్కరణలకు ప్రవేశపెట్టారు. వీటి ప్రచారానికి మంటపాలను నిర్మించి, వాటికి అనుభవ మంటపం అని నామకరణం చేశారు. ఈ మంటపంలో జాతి, కుల, మత, వర్గ, వర్ణ, లింగ భేదాలకు అతీతంగా స్త్రీ–పురుషులకు సమాన అవకాశాలు కల్పించారు. మహిళలకు అక్షరాభ్యాసం చేయించి, వేద శాస్త్రాలు నేర్పి, వారికి తన అనుభవ మంటపంలో స్థానం కల్పించారు. ఈ అనుభవ మంటపం నేటి మన పార్లమెంట్ వ్యవస్థతో సమానమైంది, అందుకే బసవేశ్వరుడి అనుభవ మంటపాన్ని మొదటి పార్లమెంటుగా గుర్తించవచ్చు. ఆనాడు బసవేశ్వరుడు అంకురార్పణ చేసిన మహిళల సమాన హక్కులు– నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందుండడం, భారత ప్రభుత్వం మహిళలకు రిజర్వేషన్ కల్పించడం– ఇప్పటికీ స్ఫూర్తినిస్తున్నాయి.

ఎంతో శ్రేష్ఠమైన బసవ వచనాలు సమస్త ప్రజానీకానికి ప్రేరణగా, మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. బసవేశ్వరుడు తన ఉపదేశాలను ప్రజలకు అందుబాటులో ఉండే రీతిగా వచనాలుగా రాసిన గొప్ప తత్వవేత్త. ఆ వచనాలలోని సూక్ష్మమైన తత్వం సులువుగా బోధపడుతుంది. మానవతావాదానికి మకుటమైన బసవేశ్వరుడు వచనాలను అన్ని భాషలలో అనువదించి, ఆయన చరిత్రను నేటి తరానికి తెలియజేస్తే సమాజానికి ఒక మంచి సందేశం ఇచ్చినవారం అవుతాం. బసవేశ్వరుడు 64 లక్షలకు పైగా వచనాలు రాసినప్పటికీ, నేడు కొన్ని వేలు మాత్రమే మనకు లభ్యమవుతున్నాయి. సమాజంలో పేరుకుపోయిన వైదిక, సనాతన, మూఢాచారాలను బసవేశ్వరుడు తన రచనల ద్వారా ఖండించారు. ఆ కాలంలో బిజ్జల రాజ్యంలో సాంఘిక సంస్కరణలు అమల్లో భాగంగా వర్ణాంతర వివాహాలు చేయడంతో కొందరు ఆయనని తీవ్రంగా వ్యతిరేకించారు. బసవేశ్వరుని నూతన సంవిధానం కొందరికి కంటగింపుగా మారడంతో వారంతా ఏకమై ఆయనను బిజ్జల రాజు చేత దేశ బహిష్కరణ గావించారు. అక్కడి నుంచి కూడల సంగమం చేరుకొని, అక్కడే 1196లో పరమాత్మ సన్నిధికి చేరుకున్నారు. నేడు ఆ కూడల సంగమం వీరశైవ లింగాయతుల పవిత్ర క్షేత్రంగా బాసిల్లుతున్నది.

పాల్కురికి సోమనాథుడు తన ఆరాధ్య దైవమైన బసవేశ్వరుడిపై బసవ పురాణం రాశాడు. మహాత్మా బసవేశ్వరుల గొప్పతనాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం పార్లమెంటు ప్రాంగణంలో బసవేశ్వరుని విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. 2006లో ఐదు రూపాయలు, 100 రూపాయల నాణాలను బసవేశ్వరుని బొమ్మతో ముద్రించి, ఆ మహాత్ముని స్మరించుకుంది. తెలంగాణ వాసి డాక్టర్ నీరజాపాటిల్ ఎంతో కృషి చేసి, మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా లండన్‌లో బసవేశ్వరుని విగ్రహాన్ని ఆవిష్కరింపజేశారు. తెలంగాణ ప్రభుత్వం బసవేశ్వరుని జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నది. ట్యాంక్ బండ్‌పై ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే గాక, బసవేశ్వర చరిత్రను పాఠ్యాంశంగా చేర్పించి, నేటి పౌరులకు ఆ మహాత్ముని గొప్పతనాన్ని తెలియజెప్పే ప్రయత్నం చేస్తున్నది. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో బసవేశ్వరుని చిత్రపటాన్ని తప్పనిసరి చేస్తూ కర్ణాటక ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.



మహాత్మా బసవేశ్వరుని దేవునిలా ఊహించకుండా ఒక గురువుగా, సంఘసంస్కర్తగా భావించి, ఆయన ప్రవచనాలను అన్ని ప్రముఖ భాషలలో అనువదించి, చరిత్రను ప్రచురించాలి. బహుముఖ ప్రజ్ఞాశాలి అయినా సాధువు, లోక నాయకుడు, బసవేశ్వరుని విశాల హృదయం మానవతావాదానికి నిదర్శనం. నేడు మనం ఏ విధమైన సాంఘిక సంస్కరణలు ఆశిస్తున్నామో, వాటిలో చాలా వాటిని బసవేశ్వరుడు ఆనాడే అమల్లోకి తెచ్చారు. నాటి ప్రజల్లో విప్లవం తీసుకొచ్చిన బసవేశ్వరుని సామాజిక, సమానత్వ భావన కుల–మతాలకు అతీతంగా కులరహిత సమాజం ఏర్పడేదాకా దేశానికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. సమాజంలో అసమానతలపై మహాత్మా బసవేశ్వరుడు చేసిన పెనుగర్జనలు నేడు ఏదో ఒక రూపంలో ఘంటానాదాలై మారుమోగుతూనే ఉంటాయి. ఈనాటి సమాజంలో కుల–మత–వర్గ–వర్ణ వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉంది ఈ పరిస్థితుల్లో బసవేశ్వరుని సందేశం ఎంతో ప్రాసంగికం.

● బర్మని మల్లికార్జున్
రాష్ట్ర ఉపాధ్యక్షులు, వీరశైవ లింగాయత్ సమితి

(నేడు బసవ జయంతి)

తెలుగును తప్పనిసరిగా ఉంచాలి

ఇంటర్మీడియట్ విద్యలో రెండవ ఆప్షన్‌గా సంస్కృతాన్ని తీసుకోవచ్చని ఇటీవల ఇంటర్ బోర్డు జీఓ జారీ చేసింది. విద్యార్థులు మార్కులు సాధన అనే కారణం పైకి కనిపిస్తున్నా, దీని వెనుక పెద్ద కుట్ర ఉంది. ఇది ఇంటర్ బోర్డు అధికారుల నిర్ణయం కాదు, నూతన విద్యా విధానంలో భాగంగా వచ్చిన రాజకీయ నిర్ణయం. సంస్కృతం ప్రాచీన భాష. కొద్ది మందికే చదువు అనే వివక్ష పాటించిన కాలంలో బ్రాహ్మణాధిక్య వర్గాలు, పాలకులు సొంతం చేసుకున్న భాష. వేదాలు, ఉపనిషత్తులు, భారతం, రామాయణం తదితర కావ్యాలు ఆ భాషలోనే ఉన్నాయి. సామాన్య ప్రజానీకం వాటిని చదువుకోవడానికి వీలులేని పరిస్థితి ఉండేది. సామాన్య ప్రజలు తమ వ్యావహారిక భాషలలో మాట్లాడుకునేవారు. సంస్కృత భాషా పండితుల ఆధిపత్యం కింద ప్రజల భాషలు నలిగిపోయాయి.

ఈ ఆధిపత్యాన్ని ధిక్కరిస్తూ ప్రజల భాష కోసం అనేక ఉద్యమాలు వచ్చాయి. ముఖ్యంగా తెలుగు వ్యావహారిక భాషలో రచనల కోసం గిడుగు రామ్మూర్తి, గురజాడ తదితరులు ఉద్యమించారు. భాషా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. కందుకూరి, శ్రీశ్రీ, చలం ఒకరేమిటి ఎంతో మంది రచయితలు, కవులు భాషోద్యమం చేపట్టారు. ఒక్క తెలుగు భాషా ఉద్యమమే కాదు. తమిళ భాషోద్యమం విస్తారంగా సాగింది, తమిళులందరినీ ఏకతాటి మీద నడిపింది. అది హిందీ వ్యతిరేక ఉద్యమంగా వెల్లువెత్తింది. అన్నాదురై, రామస్వామి నాయకర్ తదితరులు ఎంతో మంది తమిళాన్ని రక్షించుకోవడానికి తెగించి కొట్లాడారు. ఇటీవల మోదీ–షా ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం త్రిభాషా సూత్రం పేరుతో హిందీని జాతీయ భాషగా రుద్దాలని చూస్తే.. తమిళ ప్రజలు ఉద్యమించారు. అలాగే కన్నడం, మలయాళం, మరాఠీ, అస్సామీ, ఒరియా, బెంగాలీ, భోజ్‌పురి, బిహారీ, పంజాబీ, గుజరాతీ ఇత్యాది భాషలన్నీ అస్తిత్వం కోసం పోరాటాలు చేస్తున్నాయి. వీటన్నిటిపై హిందీని రుద్దాలని, సంస్కృతాన్ని మళ్ళీ తేవాలని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా యత్నిస్తోంది. ఈ విధానాలతో ఆయా జాతుల భాషలు కనుమరుగయ్యే ప్రమాదముంది. అందుకే భాషాధిపత్యానికి వ్యతిరేకంగా, ప్రాంతీయ భాషలు అస్తిత్వ పోరాటాలు చేయాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయి.

దేశంలో 22 అధికార భాషలున్నాయి. ప్రాంతీయ భాషలు 1200కు పైగా ఉన్నాయి. ఎవరి భాష వారికి అమృతం. దానిని గుర్తించాలి. ఇప్పటికే ఒక పక్క అంతర్జాతీయ భాష అని ఆంగ్లం, జాతీయ భాష అని హిందీ, సనాతన భాష అని సంస్కృతాన్ని రుద్దడం తెలుగును మరణశయ్య మీదకు నెట్టడమే. విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న రేవంత్‌రెడ్డికి తెలిసి జరుగుతున్నదో, కేంద్రం కుట్రలో భాగంగా జరుగుతుందో కానీ ఇంటర్ బోర్డు నిర్ణయం శరాఘాతం. తెలుగు నేలపై తెలుగు భాషను సమాధి చేసే నిర్ణయాన్ని ఇంటర్ బోర్డు అధికారులు తక్షణమే ఉపసంహరించుకోవాలి. తెలుగును కంపల్సరీ సబ్జెక్టుగా ఉంచాలి. భావితరాలు తెలుగుదనంతో, తెలుగు భాషతో వెలిగేలా నిర్ణయాలు ఉండాలి. ఇంటర్ బోర్డు నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి.

– పోటు రంగారావు
కార్యదర్శి, సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్

హేచరీస్ కంపెనీకి సైబర్ నేరస్థుడి టోకరా

- యజమానినంటూ గుమస్తాను నమ్మబలికి రూ.1.60కోట్లు లూటీ
- యజమానితో కలిసి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన గుమస్తా
- నిందితుడి అరెస్టు.. వివరాలు వెల్లడించిన సైబర్ క్రైం ఇన్‌చార్జ్ ఏసీపీ

- వివరాలు 6లో



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పక్కన మంత్రి సురేఖ, తదితరులు

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- తెలంగాణపై కేసీఆర్‌ది కపట ప్రేమ
- రైతులను ఆగం చేసిన ధరణి
- 'భూ భారతి'తో సమస్యలన్నీ పరిష్కారం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- వరంగల్ ఉర్సుగుట్ట వద్ద అవగాహన సదస్సు
- హాజరైన మంత్రి కొండా సురేఖ

7

ఎండల వేళ.. మూత్రపిండాలు జాగ్రత్త

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎండలు తీవ్రంగా ఉన్నాయి. తీవ్రమైన వేడి కారణంగా చాలామంది అనారోగ్యం బారిన పడుతున్నారు. చాలా మందిలో మూత్రపిండాలకు రక్త ప్రసరణ తగ్గుతుండటం కనిపిస్తోంది. ఇది మూత్రపిండాలు పాక్షికంగా గానీ, పూర్తిగా గానీ క్షీణించడానికి దారితీస్తుంది. ప్రధానంగా కిడ్నీలో రాళ్లు, మూత్ర నాలాల శ్లేష్మ పొరల్లో ఇన్ఫెక్షన్లు లాంటివి సంభవిస్తాయి. ప్రస్తుతం చాలామంది డీహైడ్రేషన్ లక్షణాలతో సతమతమవుతున్నారు. ఈ క్రమంలో ఎండల వేళ మూత్రపిండాల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలుసుకోవడంతో పాటు పలు అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' గురువారం నిర్వహించే ఫోన్‌ఇన్ ద్వారా డాక్టర్ బైరం రణధీర్‌ను సంప్రదించొచ్చు.

డాక్టర్ బైరం రణధీర్‌తో.. రేపు ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్



డాక్టర్ బైరం రణధీర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, యూరాలజీ విభాగం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కేఎంసీ, ఎంజీఎం

సమయం : గురువారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు	సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు 70938 47967



స్లాట్ సొమ్ము మాటేంటి?

ఏళ్లుగడుస్తున్నా చేతికిరాని ధరణి రద్దు డబ్బులు

- పోర్టల్‌లో ఇరుక్కుపోయిన రూ.30కోట్లు
- వాపస్ చేయడంపై కానరాని స్పష్టత
- ఉమ్మడి జిల్లాలో సుమారు 12వేల మంది ఎదురుచూపు
- భూభారతి అమలు నేపథ్యంలో దరఖాస్తుదారుల్లో అయోమయం

హనుమకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ స్థానంలో భూ భారతిని తీసుకువచ్చింది. సరే మరి గత ధరణిలో స్లాట్ బుక్ చేసుకొని చెల్లించిన డబ్బుల సంగతేమిటని దరఖాస్తుదారులు అడుగుతున్నారు. అసలు ఈ డబ్బులు వస్తాయో రావోనని ఆందోళన చెందుతున్నారు. భూ భారతి అమల్లోకి వచ్చిన తర్వాత ధరణి పోర్టల్ దాదాపు నిలిచిపోయింది. దీంతో ఇందులో చెల్లించిన డబ్బులు వాపస్ ఇచ్చే విషయంలో స్పష్టత లేక దరఖాస్తుదారులు అయోమయానికి గురవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 12వేల మంది తమ భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ధరణిలో స్లాట్లు బుక్ చేసుకున్నారు. నిర్దేశిత రుసుం చెల్లించారు. ఒక్కో దరఖాస్తుదారుడు రూ.25వేల నుంచి రూ.50వేల వరకు చెల్లించిన ఉదంతాలున్నాయి. ఈ మొత్తం సుమారు రూ.30 కోట్ల వరకు ఉండవచ్చునని అంచనా. భూ సమస్యలు పరిష్కారం కాకచాలా మంది స్లాట్లను ఉపసంహరించుకున్నారు. వీరందరికీ ప్రభుత్వం డబ్బులను తిరిగి చెల్లించాలి. ఇప్పటి వరకు ఎవరికి డబ్బులు తిరిగి రాలేదు. జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి అమలులోకి రానున్నది. ఈ క్రమంలో భూ భారతిపై అవగాహన కల్పించడానికి గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు.

రైతుల ప్రదక్షిణలు..

అన్నదాతలు వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు, నాలా అనుమతులు, విరాసత్ కోసం పేర్ల మార్పిడి, ఇంటి రిజిస్ట్రేషన్లు తదితర వాటి కోసం ధరణిలో స్లాట్‌ను బుక్ చేసుకునేందుకు మీ సేవా కేంద్రాల్లో నిర్దేశిత ఫీజులు చెల్లించారు. ఒక్కో జిల్లాలో 2 వేలకు తగ్గకుండా వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లిలో సుమారు 12 వేల మంది స్లాట్లు బుక్ చేసుకున్నప్పటికీ వివిధ కారణాలతో స్లాట్లను అధికారులు రద్దు చేయడమో, లేక బుక్ చేసుకున్న వారు కూడా ఆయా కారణాల వల్ల స్వయంగా రద్దు చేసుకున్నా చెల్లించిన సొమ్ములు తిరిగి వారి బ్యాంకు ఖాతాలో జమ కావాల్సి ఉంది. ధరణి అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు స్లాట్ సొమ్ములు తిరిగి రాలేదు. వాటి కోసం దరఖాస్తుదారులు రెవెన్యూ కార్యాలయాల చుట్టు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అధికారులు అదిగో వస్తాయి.. ఇదిగో వస్తాయి అని చెబుతున్నారే కానీ ఇప్పటి వరకు చెల్లింపులు జరగలేదు. అయితే ధరణిలో స్లాట్ బుక్ చేసుకొని రద్దయిన వారికి వారు చెల్లించిన సొమ్ముల విషయంలో ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. స్పష్టత ఇవ్వలేదు. అధికారులకు కూడా ఈ విషయంలో ఎలాంటి సమాచారం ఇప్పటి వరకు లేదు.

ఖాతాలో జమయ్యేది ఎప్పుడు?

స్లాట్ బుక్ చేసుకొని ఆ తర్వాత రద్దు చేసుకున్న వారికి ప్రభుత్వం నేరుగా వారి ఖాతాలోకి చలానా సొమ్ములు జమ చేస్తుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. స్లాట్ రుసుం ప్రభుత్వ ఖజానాలో జమవుతున్నాయి. తిరిగి అక్కడి నుంచి స్లాట్ రద్దు చేసుకున్న వారికి అందాల్సి ఉంటుందంటున్నారు. స్లాట్ రద్దయినా వెంటనే సొమ్ములు తిరిగి చెల్లించడం అనే విషయంలో రెవెన్యూశాఖకు సంబంధం లేదని, దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవలసి ఉంటుందని పేర్కొంటున్నారు.

నిలువు దోపిడీ

ఒక రకంగా ధరణి పోర్టల్‌తో ప్రజలు నిలువు దోపిడీకి గురయ్యారు. ఒక్కసారి ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకుంటే తప్పనిసరిగా ఆ కార్యకలాపం పూర్తి చేయాల్సిందే. ఏదైనా కారణంతో రీ షెడ్యూల్ చేసుకునే అవకాశం ఉంది. అయితే పూర్తిగా ఆ స్లాట్‌ను రద్దు చేసుకుంటే మాత్రం చెల్లించిన ఫీజు, స్టాంప్ డ్యూటీ ఎప్పుడు తిరిగి చెల్లింపు జరుగుతుందనే విషయంలో గ్యారెంటీ లేకుండా పోయింది. ధరణి పోర్టల్ ప్రారంభమైన తర్వాత 2021-22 సంవత్సరంలో రద్దు చేసుకున్న స్లాట్లకు సంబంధించి మాత్రమే సొమ్మును వాపస్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆ తర్వాత రద్దయిన స్లాట్లకు చెందిన రూ. వందల కోట్లు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. బాధితులు టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే ఎప్పుడు చెల్లింపు జరుగుతుందో చెప్పలేమన్న సమాధానం వస్తోంది. రద్దయిన స్లాట్ల సొమ్మును తిరిగి

మిగతా 7వ పేజీలో..

కనిపించని వివరాలు..

దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ధరణిలో వాటి వివరాలు ఏవీ కనిపించవు. అది ఏ స్థాయిలో ఉందనేది చూపించదు. నేరుగా అధికారులను సంప్రదించినా ప్రయోజనం ఉండదు. స్లాట్ రద్దు చేసుకున్నవారు పూర్తి ఆధారాలతో కలెక్టర్ ఆఫీసులోని ధరణి సమన్వయకర్తను సంప్రదించాలి. వాటిని నిర్ధారించుకున్నాక కలెక్టర్ ఆమోదానికి పంపుతారు. కలెక్టర్ అనుమతితో నగదు చెల్లించేందుకు ఖజానా శాఖకు పంపుతారు. అక్కడ అన్నదాతలు దరఖాస్తులో చూపించిన బ్యాంకు ఖాతాలో జమకావాలి. కానీ ఇవేవి జరగడం లేదు. కలెక్టరేట్లలోనూ వీటి పరిశీలన నిలిచిపోయింది. అధికారుల నిర్లక్ష్యం వల్లనే తమకు డబ్బులు తిరిగి రావడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

- మావోయిస్టులతో చర్చలు జరపాలి
- దళిత, గిరిజన, ఆదివాసీ ప్రజా సంఘాల డిమాండ్
- అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన



హనుమకొండ పబ్లిక్ గార్డెన్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత, గిరిజన, ఆదివాసీ ప్రజా సంఘాల నేతలు

వడ్డెపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని కర్రెగుట్టల్లో నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరుపాలని దళిత, గిరిజన, ఆదివాసీ ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కర్రెగుటల్లో కేంద్ర బలగాలను వెనక్కి మళ్లించాలనే డిమాండ్‌తో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సిద్ధబోయిన లక్ష్మీనారాయణ, కో కన్వీనర్లు జైసింగ్ రాథోడ్, సోమా రామ్మూర్తి, డాక్టర్ జిలుకర శ్రీనివాస్, బొట్ల భిక్షపతి మాట్లాడారు. మావోయిస్టులను తుదముట్టిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించడం దుర్మార్గమని దుయ్యబట్టారు. కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఆదివాసీలను నిర్మూలించాలని మోదీ ప్రభుత్వం చూస్తుందని విమర్శించారు. మావోయిస్టులు, పోలీసు లకు మధ్య ఆదివాసీలే బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలోని విలువైన ఖనిజ సంపదను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర ఉన్నదని ఆరోపించారు. భారత్ సమ్మిట్‌లో సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, ఆదివాసీ, గిరిజన హక్కులపై కాంగ్రెస్ డిక్లరేషన్లు చేస్తే సరిపోదని, ఆదివాసీలపై జరుగుతున్న దాడిని ఆపేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బాదావత్ రాజు, రాజారపు భాస్కర్, సమ్మయ్య రాథోడ్, పోరిక ఉదయ్ సింగ్, వెంగళరెడ్డి, ఓం బ్రహ్మం, చాప బాబు దొర, తెలంగాణ కొమురయ్య, మాదాసి సురేష్, కరుణాకర్ నాయక్, నలిగంటి చంద్రమౌళి, నున్నా అప్పారావు, అజ్మీరా వెంకట్, చావా రవి , పాలకుర్తి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఇనుగాల వెంకట్రాంరెడ్డి

భద్రకాళి కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన భద్రకాళి దేవస్థానంలో నిర్వహించే భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం గణపతి పూజ చేశారు. సాయం కాలం సుబ్రహ్మణ్య సేవ నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య నేతృత్వంలో మేళతాళాలతో పట్టు చీరలు, పూజ ద్రవ్యాలు సమర్పించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషు భారతి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నయనానందకరంగా ప్రారంభించారు. మున్నూరు కాపు సంఘం నాయకులు గైనేని రాజన్, ఈవీ శ్రీనివాస్, తోట వెంకన్న, కనుకుంట్ల రవికుమార్, బక్కి రాజ్‌కుమార్, కందుల సుజన్‌కాంత్, పాటి శ్రీనివాస్, శ్రీధర్, వొడితెల రాము, సత్యనారాయణ, మాడిశెట్టి వరుణ్, చందు, సతీష్, కుమారస్వామి, ప్రకాష్, కనుకరాములు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖలో ఇష్టారాజ్యం

- విధులకు ఉద్యోగుల ఎగనామం
- తమ స్థానాల్లో చిరుద్యోగుల నియామకం
- తమ వేతనం నుంచి కొంత ఇస్తున్న వైనం
- ప్రైవేటు వ్యాపారాల్లో డాక్టర్లు బిజీబిజీ



హనుమకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పశు సంవర్ధకశాఖలో కిందిస్థాయి ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విధులకు హాజరుకాకుండా ఎగనామం పెడుతున్నారు. తమకు బదులు తక్కువ వేతనంతో వేరే ఉద్యోగులను పెట్టుకొని తమ వేతనం నుంచి కొంత వారికి ఇచ్చి పనులు చేయించుకుంటున్నారు. తాము మాత్రం ఇతర వ్యాపారాలు, వ్యక్తిగత పనుల్లో బిజీగా ఉంటున్నారు. నెలకోసారి వచ్చి అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి టంచనుగా జీతం అందుకుంటున్నారు. హనుమకొండ జిల్లా పశు సంవర్ధక శాఖలో అటెండర్ సహా కింది స్థాయి ఉద్యోగాలు అనేకం ఖాళీగా ఉన్నాయి. దీంతో పశువులకు వైద్యం చేయడంలో సహాయకులు లేక వెటర్నరీ డాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నవాళ్లు సరిగా విధులకు హాజరుకావడం లేదు. తమకు బదులు ప్రైవేటుగా నెలకు కొంత వేతనమిచ్చి వేరేవారితో డ్యూటీ చేయిస్తున్నారు. ప్రధానంగా గ్రామాల్లోని వెటర్నరీ సబ్ సెంటర్లలో ఈ వ్యవహారం జోరుగా సాగుతున్నట్టు ఇటీవల పై అధికారులు ఆకస్మికంగా జరిపిన తనఖీల్లో వెల్లడైనట్టు తెలుస్తోంది. ప్రతీ సబ్‌సెంటర్‌లో ఒక లైవ్‌స్టాక్ అసిస్టెంట్ (ఎల్‌ఏ)తో పాటు ఒక అటెండర్ తప్పని సరిగా ఉండాలి. రైతులు మండల కేంద్రాల్లో ఉండే వెటర్నరీ ఆసుపత్రులకు రావలసి అవసరం లేకుండా తమకు అందుబాటులో ఉండే ఈ సబ్‌సెంటర్లకు పశువులను తీసుకువచ్చి వైద్యం చేయించుకుంటారు. పశువులకు చికిత్స చేయడంలో ఈ చిరుద్యోగుల అవసరం ఎంతో ఉంటుంది. సబ్‌సెంటర్లను ఊడ్చి శుభ్రం చేయడం, తాగునీటిని ఏర్పాటు చేయడం, పశువులకు చికిత్స చేసేప్పుడు కదలకుండా వాటిని పట్టుకోవడం, మందులు, చికిత్సా పరికరాలు అందించడం ఇతరత్రా విధులను వీరు నిర్వర్తించాల్సి ఉంటుంది. పశువులకు చికిత్స అందించడంలో వీరికి ఉన్న అనుభవం ఎంతో ఉపయోగపడుతుంది. కాగా, చాలా సబ్ సెంటర్లలో వీరు విధులకు సక్రమంగా హాజరుకాక తమకు బదులు వేరే వారిని పెట్టుకొని ఏదో విధంగా నెట్టుకువస్తున్నారు. ఒక్కో కింది స్థాయి ఉద్యోగికి సర్వీస్‌ను బట్టి గరిష్ఠంగా నెలకు రూ. 50వేల నుంచి రూ.60వేల వరకు వేతనం అందుతుంది. ధర్మసాగర్ మండలం రాంపూర్‌లోని వెటర్నరీ సబ్ యూనిట్‌లోని ఓ కింది స్థాయి ఉద్యోగి రెండేళ్లుగా విధులకే హాజరుకావడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఉద్యోగి తనకు బదులు మరో వ్యక్తిని నియమించుకొని ఆయనతో పనులు చేయిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందుకుగాను ఆ వ్యక్తికు నెలకు రూ.8వేల చొప్పున వేతనం ఇస్తున్నట్టు సమాచారం. ఈ విషయంలో తనపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు తనపై ఉద్యోగికి కూడా రెండేళ్లుగా నెలకు రూ.5వేల చొప్పున ముడుపులను ముట్టచెబుతున్నట్టు తెలుస్తోంది. ఈ ఉద్యోగి కుమారుడు కూడా ఇదే జిల్లాలోని ఓ పశువుల ఆసుపత్రిలో వైద్యుడిగా పని చేస్తుండడం గమనార్హం. హసన్‌పర్తి మండలం పెగడపెల్లిలోని ఓ ప్రాథమిక పశు వైద్యశాలలో కూడా ఇదే తంతు నడుస్తున్నట్టు సమాచారం. పలు ఇతర వెటర్నరీ సబ్ సెంటర్లలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ కింది స్థాయి ఉద్యోగులు విధులకు రాకుండా ప్రైవేటు వ్యాపారాలు, ఇతరత్రా వ్యక్తిగత పనుల్లో బిజీగా ఉంటున్నారు. పై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి ఇలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాజీపేట మీదుగా తిరుపతికి వీక్లీ స్పెషల్ రైలు

కాజీపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట మీదుగా తిరుపతికి వీక్లీ స్పెషల్ రైళ్ల నడిపించేందుకు రైల్వే అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. (08253) కాజీపేట జంక్షన్ - తిరుపతి మే 6, 13, 20 27, జూన్ 3, 10, 17, 24 తేదీల్లో మధ్యాహ్నం 1.30 గంటలకు కాజీపేటలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. (07254) తిరుపతి - కాజీపేట మే 7, 14, 21, 28, జూన్ 4, 11, 18, 25 తేదీల్లో మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. ఈ రైలు కాజీపేటలో బయలు దేరి చర్లపల్లి మీదుగా వికారాబాద్, గుంతకల్, గుత్తి, రాయపూర్, కడప, రేణిగుంట, తిరుపతికి చేరుకుంటుంది. ఈ రైలుకు జనగామ, భువనగిరి, చర్లపల్లి, సనత్‌నగర్, లింగపల్లి, వికారాబాద్, తాండూర్, సేడం, రాయచూర్, మంత్రాలయం, గుంతకల్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, కోడూర్, రేణిగుంట, రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సుబేదారి ఎస్సై సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలం మల్లక్‌పల్లి గ్రామానికి చెందిన కొలిపాక రంజిత్ (29) హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు షాపులో పనిచేస్తున్నాడు. సోమవారం ఇంటికి వచ్చిన రంజిత్ అదేరోజు రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రంజిత్‌కు భార్య, కూతురు ఉన్నారు.

నేటి నుంచి విద్యార్థులకు ఉచిత శిక్షణ శిబిరం

హనుమకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి మే 4వ తేదీ వరకు ఉచిత వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నట్టు జనవిజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని మర్కజీ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 8 నుంచి 11.30 గంటల భౌతిక, గణిత, జీవ శాస్త్ర మెళకువలు, అరిగామి, మ్యాజిక్, యోగ, శాస్త్రవేత్తల ముఖాముఖీ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ శిక్షణా శిబిరంలో పాల్గొనవచ్చు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం సెల్ నెంబర్ 83280 26266 లేదా ప్రధాన కార్యదర్శి రామంచ భిక్షపతి సెల్ నెంబర్ 9701681985కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.

పూడికతీత పనులను వేగవంతం చేయాలి

భద్రకాళి చెరువును పరిశీలించిన హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



భద్రకాళి చెరువు పూడికతీత పనులు పరిశీలిస్తున్న కలెక్టర్లు, అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : భద్రకాళి చెరువుపూడిక తీత పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. పూడికతీత పనులు, మట్టిని డంపింగ్ చేయడానికి ప్రతిపాదిత ప్రభుత్వ స్థలాలను కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీవాకడేతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పూడికతీత పనులకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించి వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భద్రకాళి చెరువు పూడిక తీత పనుల్లో భాగంగా బ్లాకులవారీగా మట్టిని తీసి బయటకు పంపించాలన్నారు. గడువులోగా పూడికతీత మట్టి తరలింపునకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. చెరువు మట్టిని డంపింగ్ చేసేందుకు నగరం చుట్టుపక్కల ఉన్న అనువైన స్థలాల జాబితాను రెవెన్యూ అధికారులు వెంటనే సాగునీటి పారుదల శాఖ అధికారులకు అందజేయాలన్నారు. ప్రతిపాదిత ప్రభుత్వ స్థలాల్లో చెరువుపూడికతీత మట్టిని డంపింగ్ చేయాలని సూచించారు. జూన్ 15 నాటికి చెరువుపూడిక తీత పనులు ఆఖరిగడువుగా ఉన్నందున గడువులోగా పూడికతీత, మట్టి తరలింపు ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. తమ పొలాల్లోకి చెరువు మట్టిని తీసుకెళ్లేందుకు ఆసక్తిఉన్న రైతులు సాగునీటి పారుదల శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, రెవెన్యూ, సాగునీటి పారుదల, కుడా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

- నల్లమట్టి కొనుగోలుకు ఆహ్వానం..

మామునూరు: భద్రకాళి చెరువు పూడికతీత కావలసిన వారు నిర్ణీత రుసుము చెల్లించి తీసుకెళ్లవచ్చని అధికారులు ప్రకటించారు. 1క్యూబిక్ మీటర్ మట్టికి రూ.71.83 చొప్పున చెల్లించి కార్యనిర్వాహక ఇంజనీర్, ఇరిగేషన్ డివిజన్ నెం.2 నక్కలగుట్ట కార్యాలయంలో సంప్రదించాలని ఇరిగేషన్ ఈఈ ఎం.శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9515483828, 9440638401 ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



కర్కాల గ్రామంలో సంవిధాన్ పాదయాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు మంగళవారం తొర్రూరు మండలంలోని కర్కాల గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. భారత రాజ్యాంగంపై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసగా పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు.

ప్రతీ పౌరుడు రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ముందుకు రావాలని సూచించారు. చేతిలో అంబేద్కర్, గాంధీ చిత్రపటాలను పట్టుకొని పాదయాత్రలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గోపాలగిరి గ్రామంలో వడదెబ్బతో మృతి చెందిన ఎనమాల సారయ్య కుటుంబాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి పరామర్శించి, తల్లిదండ్రులు, భార్య రజితను ఓదార్చారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, సోమ రాజశేఖర్, హమ్యానాయక్, మాల మహానాడు అధ్యక్షుడు చిట్టిమల్ల మహేష్, కాంగ్రెస్ నాయకులు గంజి విజయ్‌పాల్‌రెడ్డి, పొనుగోటి సోమేశ్వర్‌రావు, రామచంద్రయ్య, సురేందర్ రెడ్డి, అశోక్‌రెడ్డి, రవినాయక్, వెంకట్ రెడ్డి, ప్రశాంతి, ఉష తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు కేయూ మహిళ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 30 నుంచి మే 3 వరకు ఏపీలోని నెల్లూరు విక్రం సింహపురిలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీలకు కేయూ మహిళ జట్టును 2024-25 ఏడాదికి గాను మంగళవారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో ఎం. అనుబిందు, (న్యూసైన్స్ డిగ్రీ కళాశాల, హనుమకొండ), టి. స్పందన , (మాతృశ్రీ డిగ్రీ కళాశాల, భీమారం), ఎ. అనూష, (వాగ్దేవి వ్యాయమ విద్యా కళాశాల, బొల్లికుంట), ఎస్.సుస్మిత, (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళా శాల, హనుమకొండ) జి. పూజ, (కేయూ వ్యాయమ విద్యా కళాశాల, హనుమకొండ), జే. దుర్గభవాని, (వాగ్దేవి వ్యాయమ విద్యా కళాశాల, బొల్లికుంట), సీహెచ్. రమ, (యూని వర్సిటీ వ్యాయమ విద్యా కళాశాల, కేయూ), ఎ. నందిని, (టీజీటీబ్ల్యూఆర్‌డీసీ కళాశాల, కొత్తగూడెం), ఆర్. భార్గవి, (కేయూ వ్యాయమ విద్యా కళాశాల, హనుమకొండ), బి. అరవింద, (టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ కళాశాల, కొత్తగూ డెం), పి. సోనాలి ,(టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ కళాశాల, ఆసిఫాబాద్), పి. నాగలక్ష్మి, (ఆర్‌డీ డిగ్రీ కళాశాల, హనుమకొండ), ఎస్. సాయిప్రసన్న, (వాగ్దేవి వ్యాయమ విద్యా కళాశాల, బొల్లికుంట), ఎస్. శైలజ, (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఖమ్మం),ఎ. అర్చన, (కిట్స్ కళాశాల, వరంగల్), టి. శ్యామల, (యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబే దారి)లన్నట్లు తెలిపారు. ఈ జట్టుకు హనుమకొండ జాగృతి డిగ్రీ కళాశాల పీడీ ఎ. రాజేశ్ ఫిజికల్ డైరెక్టర్‌గా, కోచ్‌గా వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, బొల్లికుంట పీడీ పి .లక్ష్మిపతిలు వ్యవరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.

ప్రమాదాల నివారణకు సత్వర చర్యలు

హసన్‌పర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి పెద్ద చెరువు కట్ట వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ అన్నారు. మంగళవారం హసన్‌పర్తి తహసీల్దారు కార్యాలయం నుంచి పెద్ద చెరువు కట్ట పరిసర ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు మంజూరైన రూ.2 కోట్ల నిధులతో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడారు. ప్రమాదాల నివారణకు రహదారికి డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ కోసం ఎమ్మెల్యే నాగరాజు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించారని తెలిపారు.

కాలనీ వాసులను వేధించొద్దు

హసన్‌పర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ స్వచ్ఛ భారత్ వాహన డ్రైవర్ల వేధింపుల నుంచి ప్రజలను కాపాడాలని కాంగ్రెస్ నాయకుడు వింజమూరి రమణ బల్దియా అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ కాలనీలో చెత్త వేసే సమయంలో సామాన్యుల ఫొటోలు తీస్తూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. పది రోజులకొకసారి చెత్తను తీసుకెళ్తున్నారన్నారు

ఎఫ్‌ఏలకు వేతనాలు చెల్లించాలి

హసన్‌పర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. మండలంలోని జయగిరిలో చెరువులో పనులు చేస్తున్న కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీల హక్కులను కాలరాసే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టంను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆధార్ యాప్ లాంటి కొత్త జీవోలను సృష్టించి చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త కూలీ కుటుంబాలకు జాబ్ కార్డులు అందించాలన్నారు. రోజువారి వేతనం రూ.307 నుంచి రూ.600లకు పెంచాలన్నారు. కూలీల పనిదినాలను 100 రోజుల నుంచి 200ల రోజులకు పెంచాలన్నారు. కూలీలకు పనివద్ద టెంట్, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవిరాథోడ్

మరిపెడ ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మరిపెడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భూక్యా రవి రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేసి ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, సమయపాలన పాటించని సిబ్బందిపై సీసీఏ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి గుగులోతు రవి, డాక్టర్ స్వామి, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ మంగమ్మ, మమత, జ్యోతి పాల్గొన్నారు.

రేపు బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్టు హనుమకొండ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, రడం శ్రీనివాస్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి హనుమకొండ జేఎన్ఎస్‌లో ఈ పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఆసక్తిగల క్రీడాకారులు బుధవారం సాయంత్రం వరకు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 76750 51084, 90000 57005 సెల్ నెంబర్‌లలో సంప్రదించాలని అధ్యక్ష, కార్యదర్శులు సూచించారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): యువత దేశ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. మహబూబాబాద్‌లోని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించే దిశగా జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల యువత భౌతిక, మానసికంగా క్షీణించి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. సమాజానికి ఇదొక తీవ్ర సంకేతమన్నారు. డ్రగ్స్ బానిసత్వం వల్ల నేరాలు పెరిగిపోతున్నాయని, యువత చదువు, ఉద్యోగం లాంటి లక్ష్యాల నుంచి దూరమవుతున్నారని తెలిపారు. డ్రగ్స్ వినియోగం, రవాణా, నిల్వ, సరఫరా వంటి వాటిపై కఠినమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థులు, యువత తమ లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ధారించుకుని డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు బానిస కాకుండా జీవితంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన కల్పించే కార్యక్రమంలో యువత, పౌరులు భాగస్వాములు కావాలన్నారు. జిల్లాను డ్రగ్స్ రహిత ప్రాంతంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యత వహించాలని సూచించారు. ఎక్కడైన మాదకద్రవ్యాలు నిల్వ ఉంటే డయల్ 100కు, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతిరావు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌ప్రతాప్, రూరల్ సీఐ సర్వయ్య, డీసీఆర్బీ సీఐ సత్యనారాయణ, సీసీఎస్ సీఐ హత్తిరాం, ఆర్ఐ భాస్కర్, ఎస్సైలు తహేర్‌బాబా, ఝాన్సీ పాల్గొన్నారు.

వరించిన అదృష్టం

నాలుగు బార్‌షాపులకు 491 మంది పోటీ ● డ్రా ద్వారా ఎంపిక చేసిన కలెక్టర్



లక్కీ డ్రాలో టోకెన్ నెంబర్ చెప్తున్న కలెక్టర్

వరంగల్ క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్‌లోని నాలుగు బార్‌షాపులకు దరఖాస్తు చేసుకున్న వ్యక్తుల్లో గత రెండు రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు ఎక్సైజ్ అధికారులు మంగళవారం లక్కీ డ్రాతో తెర దింపారు. గతంలో రెన్యూవల్ కాకుండా మిగిలిపోయిన నాలుగు బార్‌షాపులకు లైసెన్స్‌లు జారీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానించగా 491 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో లక్కీడ్రాకు ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై స్వయంగా డ్రా తీసి మద్యం షాపులను దక్కించుకున్న వారి నెంబర్లను ప్రకటించింది. డ్రాలో మొదటగా హనుమాన్ మాలలో ఉన్న జీడికల్‌కు చెందిన కొలగాని మనోజ్‌కుమార్ నెంబర్ 464 రావడంతో మంగళవారం రోజున మాలలో ఉన్న వ్యక్తికి రావడంతో హనుమాన్ ఆశీస్సులు ఉన్నాయని హాల్‌లోని ప్రతి ఒక్కరూ చర్చించుకోవడం జరిగింది. ఆ తర్వాత హనుమకొండకు చెందిన మెరుగు రాజుకుమార్, రాయపర్తికి చెందిన పోశాల కౌండిన్య, పాలకుర్తికి చెందిన తాళ్లపల్లి భాగ్యలక్ష్మీ లక్కీ డ్రాలో షాపులను దక్కించుకున్నారు అనంతరం షాపులు దక్కించుకున్నవారికి కలెక్టర్ కన్ఫర్మేషన్ లెటర్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, వరంగల్ అర్బన్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. చంద్రశేఖర్, ఇన్స్‌పెక్టర్స్ చంద్రమోహన్, దుర్గాభవాని, ప్రభాకర్, రాజు, ఆనందరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్స్, ఎస్సైలు పాల్గొన్నారు.


హెచరీస్ కంపెనీకి సైబర్ నేరస్థుడి టోకరా

- యజమానినంటూ గుమస్తాను నమ్మబలికి రూ.1.60కోట్లు లూటీ
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ఫణిందర్

వరంగల్ క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్‌లోని ఓ ప్రముఖ హెచరీస్ కంపెనీలో పనిచేసే గుమస్తాకు సైబర్ నేరస్థుడు టోకరా వేశాడు. సంస్థ యజమానినంటూ నమ్మించి అసలు యాజమాని ఖాతాలోని రూ. 1.60కోట్లను లూటీ చేశాడు. చివరకు సంస్థల అసలు యజమానితో కలిసి గుమస్తా చేసిన సైబర్ విభాగం పోలీసులకు ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం ఆ సైబర్ నేరస్థుడిని అరెస్టు చేయగా.. ఆ వివరాలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైం విభాగం ఇన్‌చార్జ్ ఏసీపీ సీహెచ్‌ఆర్‌వీ ఫణిందర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఉమ్మడి వరంగల్‌లోని ఓ ప్రముఖ హేచరీస్ కంపెనీలో పనిచేసే గుమస్తాకు ఈ నెల 19 న గుర్తుతెలియని వ్యక్తి వాట్సాప్‌లో మెసెజ్ పంపి 'నేను మీ యజమానిని. ఇది నా కొత్త ఫోన్ నెంబర్ సేవ్ చేసుకో' అని చెప్పాడు. దీంతో ఆ ఫోన్ నెంబర్ సేవ్ చేసుకున్న గుమస్తా యజమానితో మాట్లాడుదామని మరుసటి రోజు కాల్ చేయగా మీటింగ్‌లో ఉన్నానని పెట్టేశాడు. ఆ తర్వాత రోజు సదరు నేరస్థుడు గుమస్తాకు ఫోన్‌చేయగా.. యజమాని అనుకుని గుమస్తా ఫోన్‌లిఫ్ట్ చేశాడు. ఈ క్రమంలో తన ఖాతాల్లో ఎంత డబ్బు ఉందో చెక్‌చేయమని చెప్పి, వివిధ ఆర్థిక లావాదేవిల గురించి అడిగి తెలుసుకున్నాడు. ఆ ఖాతాల్లో ఉన్న డబ్బును తాను చెప్పే ఖాతాకు పంపాలని సూచించడంతో తన యజమానే చెప్పాడని నమ్మిన గుమస్తా రెండు దఫాలుగా రూ.కోటి 68 లక్షలను ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తర్వాత మరోసారి ఫోన్ చేసిన సమయంలో మాటలను బట్టి సదరు వ్యక్తిపై అనుమానం వచ్చిన గుమస్తా.. అంతకుముందున్న యజమాని నెంబర్‌కు ఫోన్‌కు కాల్ చేయగా.. ఆయన ఎత్తడం, జరిగిన విషయం చెప్పడంతో గుర్తుతెలియని వ్యక్తి తమను మోసగించాడని గుర్తించారు. వెంటనే వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని సైబర్ విభాగంలో హేచరీస్ సంస్థ యజమాని, గుమస్తా కలిసి ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడు యూపీకి చెందిన ప్రదీప్‌కుమార్ (39)గా గుర్తించి అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో సైబర్ క్రైం ఇన్స్‌పెక్టర్ యాసిన్, ఎస్సైలు చరణ్, శివ, కానిస్టేబుళ్లు శివ, జహార్ పాల్గొన్నారు. అయితే సదరు నిందితుడు ఆడబ్బును పలు ఖాతాలకు మళ్లించాడని, పూర్తి విచారణ తర్వాతే సీజ్ లేదా రికవరీ జరుగుతుందని సమాచారం.



మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామంలో గోపాల్‌రెడ్డి పొలంలోని ఆయిల్‌పామ్ చెట్లు

ఆయిల్‌పామ్ తోట..
లాభాల పంట

- 9నెలల్లోనే 41 మెట్రిక్ టన్నుల రాబడి
- మానుకోట జిల్లాలో అధిక దిగుబడి సాధించిన గోపాల్‌రెడ్డి
- దిగుబడికి పచ్చరొట్ట రహస్యం

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : 'పక్క జిల్లాల రైతులు ఆయిల్ పామ్ తోటలు వేసి, లాభాలు గడిస్తుంటే.. తానెందుకు అదే పంటను సాగుచేసి లాభాలు పొందకూడదని ఛాలెంజ్‌గా తీసుకుని వాణిజ్య పంటలను సాగు చేయడం వదిలేసి ఉద్యానశాఖ ప్రోత్సాహంతో ఆయిల్‌పామ్ మొక్కలను నాటి, మహబూబాబాద్ జిల్లాలోనే అధిక గెలల దిగుబడి సాధిస్తున్న ఓ రైతు విజయగాథ ఇది. ఆ రైతుపేరు.. రూపిరెడ్డి గోపాల్‌రెడ్డి. నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామం. జిల్లా ఉత్తమ రైతుగా రెండుసార్లు జిల్లా పూర్వ కలెక్టర్లు శివలింగయ్య, వీపీ గౌతమ్, ఎస్పీ కోటిరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గోపాల్‌రెడ్డి కృషి, పట్టుదలతో తోట కేవలం 9 నెలల కాలంలోనే ఆరు ఎకరాలలో 41 మెట్రిక్ టన్నుల ఆయి ల్‌పామ్ గెలల దిగుబడి సాధించాడు. రూ.7.30 లక్షల ఆదాయం సాధించారు. ఎరువుల ఖర్చులు, పెట్టుబడి పోనూ.. రూ.3.80 లక్షలు లాభం పొందాడు.

స్టడీ టూర్ ప్రేరణ...

ఉద్యాన శాఖ స్టడీ టూర్ కోసం మహబూబాబాద్ ప్రాంతం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు వెళ్తుండగా.. ఆ రైతులతో పాటు గోపాల్‌రెడ్డి కూడా స్టడీటూర్‌కు వెళ్లారు. ఆ సమావేశానికి రైతులందరూ కారుల్లో రావడం, ఆయిల్‌పామ్ సాగు వివరాలు చెప్పి, అధిక దిగుబడి సాధించి లాభాలు గడిస్తున్నట్టు వారు అవగాహన కల్పించడంతో రైతు ఆ మాటలకు చైతన్యం చెందారు. తానెందుకు ఆయిల్‌పామ్ సాగు చేయకూడదని.. మనస్సులో బీజం నాటుకున్న గోపాల్‌రెడ్డి మహబూబాబాద్‌కు వెళ్లి ఉద్యానశాఖ అధికారులను కలిసి, తోట గురించి తెలుసుకుని ప్రభుత్వ రాయితీ పొందే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ నుంచి ఆ రైతు రాయితీలు పొందారు.

ఆరు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు..

నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామంలో గోపాల్‌రెడ్డికి 10 ఎకరాల భూమి ఉంది. అందులో నాలుగు ఎకరాల్లో వరి పొలం సాగు చేయగా, మరో ఆరు ఎకరాల్లో ఉద్యానవనశాఖ అధికారులు సూచించిన విధంగా ఆయిల్‌పామ్ మొక్కలను గోపాల్‌రెడ్డి సాగు చేశాడు. మొక్కలు నాటిన.. కేవలం రెండున్నర సంవత్సరంలో మొగ్గలు తీసివేసి క్రాప్‌ను వదిలివేయడం జరిగింది. దాంతో 34 నెలలో గెలల దిగుబడి రావడం ప్రారంభమైంది. మొదటి దిగుబడి 2024 జూలై 30న ఆరు టన్నుల దిగుబడి వచ్చింది. ఆ సమయంలో ఆ గెలలకు రూ.82 వేలు వచ్చాయి. ఈనెల 13న.. 13వ దిగుబడిగా 5 మెట్రిక్ టన్నులు వచ్చింది. అవి అమ్మితే రూ.1.10 లక్షలు వచ్చాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆయిల్‌పామ్ తోటల సాగుపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో గెలలకు ధరలు పెరగడంతో ఈ రైతుకు కూడా లాభం చేకూరింది. ఇప్పటి వరకు 9 నెలల కాలంలో 13 క్రాప్‌ల ద్వారా 41 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. దానిపై రూ.7.30 లక్షలు వచ్చాయి. ఎరువులు, క్రిమిసంహారక మందులు, ఇతర పెట్టుబడులకు సుమారు రూ.3.50 లక్షల ఖర్చు పోనూ.. రూ.3.80 లక్షల వరకు ఆదాయం సమకూరింది. వచ్చే మరో మూడునెలల కాలంలో 10 నుంచి 20 టన్నుల దిగుబడి రానుండగా రూ.2 లక్షల వరకు ఆదా యం సమకూరే అవకాశం ఉంది.

పచ్చరొట్టతోనే అధిక దిగుబడి..

ఆయిల్‌పామ్‌తోటల్లో అంతర్‌పంటలుగా పచ్చరొట్ట విత్తనాలైన జనుములు, జీలుగా బొబ్బ ర్ల విత్తనాలను వేసి, అందులోనే గోపాల్‌రెడ్డి కలియదున్నడం జరిగింది. ఇలా పచ్చరొట్ట విత్తనా లు ఏడుసార్లు వేసి కలియదున్నారు. దాంతో పాటు రసాయనిక ఎరువుల వాడకం, నీటిలో కరిగే ఎరువులను డ్రిప్ ద్వారా మొక్కలకు అం దించారు. కోడిపెంట, పశువుల పెంట, గొర్రెల పెంట లాంటి సేంద్రియ



చాలెంజ్‌గా తీసుకుని ఆయిల్ పామ్ సాగుచేశా..

- రూపిరెడ్డి గోపాల్‌రెడ్డి, రైతు, ఆలేరు, నెల్లికుదురు మండలం.

నేను అశ్వారావుపేటలో రైతులు సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటల గురించి, లాభాలు సాధించడం చూసి చాలెంజ్‌గా తీసుకున్నా. నాకున్న పదెకరాల్లో ఆరు ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలను వేశా. కోతుల బెడద, దొంగల బెడద లేదు. నా తోటకు పచ్చరొట్ట వేసి.. కలియదున్నడంతో భూసారం పెరిగింది. అదే అధిక దిగుబడి రావడానికి కారణమైంది. ఆయిల్ గెలలను అమ్మడానికి ఎలాంటి సమస్య రాలేదు. కొనుగోలు కేంద్రం వద్ద నేరుగా వేబ్రిడ్జిపై అన్‌లోడ్ చేయడమే. ఆయిల్‌పామ్ గెలల ధరలు పెంచడానికి కృషి చేసి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు కృతజ్ఞతలు.



లక్నవరంలో కనిష్ఠ స్థాయికి నీటిమట్టం

బోటింగ్ నిలిపివేత

వెలవెలబోతున్న పర్యాటక తీరం

గోవిందరావుపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పర్యాటక స్వర్గధామం లక్నవరం చెరువు వెలవెలబోతోంది. నీటిమట్టం అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దీంతో టూరిస్టులు నిరాశ చెందుతున్నారు. మండలంలోని లక్నవరం చెరువు నీటినిల్వ సామర్థ్యం 35ఫీట్లు. ఈసారి యాసంగిలో 4500 ఎకరాలకు తైబందీ ప్రకటించడంతో వరి సాగుకోసం భారీగా నీటిని వినియోగించుకున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం నీటిమట్టం 11ఫీట్లకు చేరింది. లక్నవరం చెరువు పర్యాటకంగా ప్రాముఖ్యం పొందడానికి కారణం లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్‌లు, ఉయ్యాల వంతెనలు, బోటింగ్. ఇక్కడకు వచ్చే పర్యాటకులు కాటేజీలలో విడిదిచేసి బోటింగ్, తీగల వంతెనల పై విహరిస్తూ ప్రకృతిని ఆస్వాదిస్తారు. అయితే వ్యవసాయ అవసరాలకు మండుటెండలకు నీటి మట్టం అమాంతం పడిపోయింది. దీంతో బోట్లు తిరిగే పరిస్థితి లేకపోవడంతో మంగళవారం నుంచి వాటికి లంగరేసి ఒడ్డుకే నిలిపివేశారు. చెరువులోని రెండవ ఐలాండ్‌తోపాటు మూడవ ఐలాండ్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో సుందరీకరించారు. దీంతో లక్నవరం టూరిస్టులను మరింత ఆకర్షించింది. ఈ ఐలాండ్‌లకు బోట్ల ద్వారానే చేరుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు బోట్లు నడిచే పరిస్థితి లేకపోవడంతో పర్యాటకంపై దెబ్బపడనుంది. పర్యాటకులెవ్వరూ రాకుంటే టూరిజం శాఖకు నష్టమే. వేసవి సెలవుల్లో లక్నవరం వచ్చి ఛిల్ అవుదామనుకున్న వారికి నిరాశ ఎదురవ్వనుంది. మే నెలలో ఉష్ణోగ్రతలు పెరగనుండగా చెరువు మైదానంలా మారనుంది. మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం అటవీప్రాంతంలో కురిసే వర్షాలు, వరదలే లక్నవరానికి ఆధారం. వర్షాకాలం ఆరంభానికి ఇంకో నెలన్నర సమయం ఉండగా అప్పటిదాకా నీరు వచ్చే పరిస్థితి లేదు. గోదావరి జలాలతో 365రోజులు జలకలను సంతరింపజేసే ప్రక్రియలో భాగంగా చేపట్టిన రామప్ప-లక్నవరం గ్రావిటీ కెనాల్‌కు భూసేకరణ గండం వెంటాడుతోంది. ఈపరిణామాల నేపథ్యంలో లక్నవరం అడుగంటిపోవడం పర్యాటకులను నిరాశకు



లక్నవరం చెరువులో నిలిచిన బోట్లు

రారెత్తిస్తున్న ఎండలు

- ఉమ్మడిజిల్లాలో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ములుగు జిల్లాలో అత్యధికంగా 41.4డిగ్రీలు

హనుమకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంగళవారం 40డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా ములుగు జిల్లా కన్నాయిగూడెంలో 41.4డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం ఉప్పరగూడెంలో 41.3డిగ్రీలు, జనగామ జిల్లా వావిలాలలో 40.7డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం పెద్దంపేటలో 40.6డిగ్రీలు, హనుమకొండ జిల్లా కాజీపేటలో 40.5డిగ్రీలు నమోదవగా.. వరంగల్ జిల్లా మంగళవారిపేటలో మాత్రం 38.6డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది.



ఎండ నుంచి రక్షణగా తలకు చిన్న గొడుగును ధరించి ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలు వద్ద డ్యూటీ చేస్తున్న సెక్యూరిటీ గార్డు

'స్లాట్' సొమ్ము మాటేంటి?

(5వ పేజీ తరువాయి)

చెల్లించాలని గతేడాది డిసెంబరు 13న సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం చినప్పటికీ నేటికి ఆ సొమ్మును తిరిగి చెల్లించే ఏర్పాటు జరగలేదు.

అక్షరం తప్పుపడినా!

ధరణి పోర్టల్‌లో ఫీజు చెల్లించిన తర్వాతే స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో ఒక్క అక్షరం తప్పుపోయినా సరిదిద్దే అవకాశం లేకుండా పోయింది. దీంతో కట్టిన ఫీజు ధరణి హుండీలో వేసినట్లయింది. సొమ్ము ఏ ఖాతాల్లోకి వెళ్లింది? ఎవరిని అడగాలి? తిరిగి ఏ అధికారి చెల్లిస్తాడు? రీఫండ్ డబ్బులు చెక్కుల రూపంలో ఇస్తారా? అలా చేస్తే దరఖాస్తుదారుడి నుంచి బ్యాంకు ఖాతా వివరాలు తీసుకునేది ఎవరు? ఎవరికి ఇవ్వాలి? ఇవన్నీ ఎవరూ తీర్చలేని సందేహాలుగా మిగిలిపోయాయి. తహసీల్దార్ నుంచి కలెక్టర్ వరకు మాకు తెలియదు అనే సమాధానమే వస్తోంది.

సొమ్ము మాయం

ధరణి పోర్టల్ రాకకు ముందు వ్యవస్థలో ఏదైనా పొరపాటుగా టైప్ చేస్తే సవరించుకునే అవకాశం ఉండేది. కానీ ధరణి పోర్టల్‌లో ఆ అవకాశం ఇవ్వలేదు. మీ సేవా కేంద్రం నిర్వాహకులు లేదా దరఖాస్తుదారుడు సొంతంగా స్లాట్ బుక్ చేసుకునేటప్పుడు పొరపాట్లు సహజం. ఒక్క చిన్న తప్పు చేసినా స్లాట్ కోసం చెల్లించిన ఫీజు మొత్తం తిరిగి వచ్చే అవకాశం లేకుండా పోయింది. మీ సేవా కేంద్రాల నిర్వాహకులు కూడా నష్టపోయిన ఉదంతాలున్నాయి. పలువురు నిర్వాహకులు తమ దగ్గరకు వచ్చిన రైతుల స్లాట్లను బుక్ చేసి డబ్బులు తర్వాత తీసుకోవచ్చని తానే ముందుగా డబ్బులు చెల్లించారు. ఆ తర్వాత వివిధ కారణాల వల్ల వాటిని రద్దు చేయాల్సి వచ్చింది. అయితే చెల్లించిన సొమ్ము ఇచ్చేందుకు రైతులు నిరాకరించడంతో తన ఖాతా నుంచి చెల్లించిన సొమ్ము ధరణి పోర్టల్‌లో ఇరుక్కు పోయింది. అధికారులేమో తమకు తెలియదంటున్నారు. కలెక్టర్ కార్యాలయంలో విచారించినా ఫలితం లేకుండా పోయింది. అలా ఇరుక్కుపోయిన సొమ్ము ఇప్పటి వరకు రాలేదు.

భూ భారతిలో అయినా మార్పు చేయాలి

సామాన్యులకు అనుకూలంగా రూపొందించిన భూభారతి చట్టం అమలు చేసేప్పుడైనా గతంలో ధరణిలో రద్దయిన స్లాట్ల సొమ్ము తిరిగి చెల్లించే అవకాశం కల్పించాలని బాధితులు వేడుకుంటున్నారు. ఇప్పటిలా కాకుండా ఇక నుంచి స్లాట్ బుకింగ్ రద్దు చేసుకుంటే ఫీజు వాపసు చేసే వెసులుబాటును కల్పించాలని కోరుతున్నారు. తప్పొప్పులను సవరిం చు కునేందుకు అవకాశం కల్పించాలని అభ్యర్థిస్తున్నారు.

పేదల సంక్షేమమే
ప్రభుత్వ లక్ష్యం

కరీమాబాద్, ఏప్రిల్29,(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమని, ఇందిర మ్మ రాజ్యంలో పేదలకు అన్ని రకాల సంక్షేమ పథకాలను అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం వరంగల్ ఉర్సుగుట్ట వద్ద ఓ ఫంక్షన్‌హాల్‌లో వరంగల్, ఖిలావరంగల్ మండలాలకు చెందిన రైతులకు రాష్ట్ర ప్రభు త్వం నూతనంగా అమల్లోకి తెచ్చిన భూ భారతి చట్టం-2025పై అవగాహన సదస్సు నిర్వహించారు. పొంగులేటితో పాటు మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ సత్యశారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమలు చేసిన ధరణి పోర్టల్ రాష్ట్ర రైతాంగాన్ని ఆగం చేసిందని, వేల మంది రైతులు, సామన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. వారి సమస్యలను అధిగమించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. భూ భారతిని అమలు చేసేందుకు తొలుత నాలుగు మండాలలను ఎంపిక చేశామని, ఈ మండలాల్లో అధికారులు పర్యటించి రైతుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని అన్నారు. అనంతరం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2 నుంచి అన్ని జిల్లాల్లో అమలు చేస్తామన్నారు. ప్రతీ గ్రామానికి అధికారులే వస్తారని, ఒక్కరూపాయి ఖర్చులేకుండా భూ సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు.



సిరికొండ ఐలయ్య ఇంట్లో భోజనం చేస్తున్న మంత్రులు, మేయర్, కలెక్టర్

- తెలంగాణపై కేసీఆర్‌ది కపట ప్రేమ
- ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు
- రాష్ట్ర రైతులను ఆగం చేసిన ధరణి
- 'భూ భారతి'తో సమస్యలన్నీ పరిష్కారం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- వరంగల్ ఉర్సుగుట్ట వద్ద అవగాహన సదస్సు

తెలంగాణపై కేసీఆర్ కపట ప్రేమ చూపిస్తున్నారని మంత్రి పొంగులేటి విమర్శించారు. ఇటీవల ఓ సభలో తన మనసుకు బాధ కలుగుతోందని అన్నారని.. బహుశా కేసీఆర్‌తో పాటు అతడి కుటుంబ సభ్యుల పదవి పోయినందుకు బాధ కలుగుతుందేమోనని అని ఎద్దేవా చేశారు. పది సంవత్సరాల కాలంలో మీరు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ఆత్మ విమర్శ చేసుకోవాలని, కేవలం 9నెలల్లోనే తాము 57వేల ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. ఇచ్చిన హామీలను ఆలస్యంగానైనా నెరవేరుస్తామని, మీలాగా ధనిక రాష్ట్రాన్ని దోచుకొని రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చడం లేదని ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యంలో మొదటి విడతలోనే నాలుగున్నర లక్షల ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు.

సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం..

అవగాహన సదస్సు అనంతరం మంత్రులు పొంగులేని శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, కలెక్టర్ సత్యశారద, మేయర్ గుండు సుధారాణి 32వ డివిజన్ బీఆర్‌నగర్ కాలనీలో సిరికొండ ఐలయ్య ఇంట్లో భోజనం చేశారు. అనంతరం వారిని అన్నదాత సుఖీభవ అంటూ శాలువాతో సత్కరించారు.

ఫ్లెక్సీలపై కార్యకర్తలు, నాయకుల్లో చర్చ..

ప్రభుత్వ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, అదే విధంగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఫొటోలు లేకపోవడంతో కాంగ్రెస్ నాయకుల మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఫ్లెక్సీలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, తీన్మార్ మల్లన్న ఫొటోలు ఉన్నపుడు వరంగల్ జిల్లా ప్రామాణికంగా తీసుకుంటే దొంతి మాధవరెడ్డి ఫొటో కూడా ఉండాలని కాంగ్రెస్ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా వరంగల్, ఖిలా వరంగల్ మండలాలతో సంబంధం లేని ఎమ్మెల్యే నాగరాజు, ప్రకాష్‌రెడ్డి ఫొటోలు పెట్టడంపై చర్చ జరుగుతోంది.

ఉదారత చాటుకున్న మంత్రి పొంగులేటి

పేద బాలిక చదువుకు అయ్యే ఖర్చు భరిస్తానని హామీ

కరీమాబాద్, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి): మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. మంగళవారం వరంగల్‌లో భూ భారతి చట్టం అవగాహన సదస్సు నిర్వహిస్తున్న వేదిక వద్ద ఓ వృద్ధురాలు కాగితం చేతిలో పట్టుకొని దీనస్థితిలో తన కోసం వేచి ఉన్నట్లుగా గమనించిన మంత్రి ఆమెను వేదిక మీదకు పిలిచి సమస్య ఏంటని అడిగారు. తన పేరు వేల్పుల ఉర్మిళ అని, శంభునిపేటకు చెందిన తన మనవరాలు వేల్పుల నితిని చదివించేందుకు తనకు స్తోమత లేదని, గొడవల కారణంగా బాలిక తల్లిదండ్రులు వేరువేరుగా ఉంటున్నారని వివరించింది. వెంటనే స్పందించిన మంత్రి ఆ బాలిక చదువుకోడానికి అయ్యే వ్యయాన్ని భరిస్తానని ప్రకటించారు.

ఎయిర్‌పోర్టులో మంత్రికి ఘన స్వాగతం..

మామునూరు: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో మామునూరు విమానాశ్రయానికి చేరుకున్నారు. కలెక్టర్ డాక్టర్ సత్యశారద, మేయర్ గుండు సుధారాణి ఆయనకు స్వాగతం పలికారు. వారితో పాటు మునిసిపల్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు, కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, మీసాల ప్రకాష్, ఇతర అధికారులు, నాయకులు ఉన్నారు.

చేనేత కార్పెట్ బహూకరణ..


వరంగల్ టౌన్: వరంగల్ కొత్తవాడకు చెందిన టీపీసీసీ నేత, రాష్ట్ర చేనేత విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు మంత్రి పొంగేలేటి శ్రీనివాస్‌రెడ్డికి చేనేత కార్పెట్ బహూకరించి నూలు దండ వేసి సత్కరించారు. ఇటీవల చేనేత బకాయిలు రద్దు చేసి త్రిఫ్ట్ పథకాన్ని పునఃప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



వృద్ధురాలిని పక్కన కూర్చోబెట్టుకుని గోడు వింటున్న పొంగులేటి

యాప్‌తో.. సేఫ్..

- 'ఎల్‌సీ'ని అందుబాటులోకి తెచ్చిన విద్యుత్‌శాఖ
- మరమ్మతుల సమయంలో ప్రమాదాలకిక చెక్
- యాప్ వినియోగంపై లైన్‌మెన్, సబ్‌స్టేషన్ ఆపరేటర్లకు శిక్షణ



యాప్‌లో ఎల్సీ తీసుకునే పద్ధతి

రాంనగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకు టీజీ ఎన్పీడీసీఎల్ ఆఫ్‌లైన్‌కు స్వస్తి పలుకుతూ ఆన్‌లైన్‌లోనే కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఇప్పటికే చాలా పనులను ఆన్‌లైన్‌లో కొనసాగిస్తుండగా కొత్తగా ఎల్సీ (లైన్‌క్లియర్) యాప్ తీసుకొచ్చి విద్యుత్ ప్రమాదాలను అరికట్టే ప్రయత్నం చేస్తోంది. ఎల్సీ తీసుకొని విద్యుత్‌పోల్స్‌పై మరమ్మతులు చేస్తున్న క్రమంలో విద్యుత్ సరఫరా జరిగి విద్యుత్ ఉద్యోగాలు మరణించిన ఘటనలు చాలానే ఉన్నాయి అటువంటి తప్పిదాలు జరగకుండా ఉండటంతో పాటు అంతరాయాలను సైతం తగ్గించేందుకు వీలుగా టీజీ ఎన్పీడీసీఎల్ ఎల్సీ యాప్‌లో అందుబాటులో తీసుకొచ్చి క్షేత్రస్థాయిలో అమలు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

సిబ్బందికి శిక్షణ

ఏడీఈ నుంచి లైన్‌మెన్ వరకు ఎల్సీ తీసుకోవడంలో కీలకంగా పని చేయనున్నారు. గంట సమయం దాటితే ఎల్సీ ఇవ్వాల్సిన బాధ్యత ఏడీఈకి అప్పగించారు. కాగా, యాప్ ఆపరేటింగ్ చేయాలంటే స్మార్ట్ ఫోన్ వినియోగించాలి పైగా టెక్నాలజీపై అవగహన ఉండటం తప్పనిసరి కాబట్టి ఆ దిశగా వివిధ సర్కిల్‌లో ఉండే టెక్నికల్ వింగ్ అధికారులు లైన్‌మెన్, సబ్‌స్టేషన్ ఆపరేటర్లకు యాప్ నిర్వహణపై అవగహన కల్పిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ ఉండి టెక్నాలజీపై అవగహన ఉన్న సిబ్బంది ఉన్న చోట ఇప్పటికే ఎల్సీ యాప్ వినియోగించి ఎల్సీ తీసుకుంటున్నారు. కొన్ని చోట్ల సబ్‌స్టేషన్ ఆపరేటర్లుగా రిటైర్డ్ ఉద్యోగులు ఉండటం, సాంకేతికతపై అసలే అవగహనలేని సిబ్బందిని ఎల్సీ అవసరం లేకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా అయ్యే సబ్‌స్టేషన్‌ల వద్ద నియమించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది.



సిబ్బందికి అవగహన కల్పిస్తున్న డీఈలు విజేందర్‌రెడ్డి, సాంబరెడ్డి (ఫైల్)

యాప్ 70 శాతం అమలవుతోంది..

- మధుసూదన్‌రావు, హనుమకొండ ఎస్ఈ

విద్యుత్ ప్రమాదాల నివారణతో పాటు అంతరాయాలను తగ్గించేందుకు ఎల్సీ యాప్‌ను ప్రవేశపెట్టారు. గతంలో ఆఫీస్‌కు వచ్చి కాగితంపై రాసిచ్చి అనుమతి తీసుకునేది. ఆ క్రమంలో మానవ తప్పిదాలతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. కానీ ఈ యాప్‌తో అధికారులకు తెలియకుం డా ఎల్సీ తీసుకునే అవకాశం ఉండదు. ప్రస్తుతం ఇది 70శాతం అమల్లో ఉండగా.. త్వరలోనే పూర్తిస్థాయిలో అమలుచేస్తాం.

యాప్ పనిచేస్తుందిలా..

- ఎల్సీ తీసుకోదల్చుకున్న లైన్‌మెన్ ఎల్సీ (లైన్‌క్లియర్) యాప్ ఓపెన్ చేసి ఏఫీడర్‌లో ఎల్సీ కావాలో సంబంధిత ఏ.ఈ కి విన్నవించుకుంటారు.
- లైన్‌మెన్ విన్నపాన్ని పరిశీలించిన ఏఈ ఎల్సీ ఇవ్వచ్చా లేదా ఆ ఫీడర్‌లో అత్యవసరాలు ఉన్నాయా? లేదా? అని పరిశీలించి ఒక నిర్ణయానికి వచ్చి ఎల్సీకి అనమతిస్తారు. ఇవ్వగానే లైన్‌మెన్‌తో పాటు సబ్‌స్టేషన్ ఆపరేటర్‌లో ఏ ఫీడర్‌లో ఎల్సీ ఇవ్వాలో సమాచారం వెళ్తుంది. ఆ ఫీడర్‌లో అత్యసవరాలుంటే నిరాకరించవచ్చు.
- ఎల్సీ ఇవ్వాల్సిన సమయంలో ఆపరేటర్ అజాగ్రత్తగా లేకుండా ఉండేందుకు తన పొరపాట్లను తెలిపేందుకు యాప్ సూచనలు చేస్తోంది. హెల్మెట్ పెట్టుకోవాలి, హ్యాండ్‌గ్లౌజ్ వేసుకోవాలని, ఎర్త్‌రాడ్ వేయాలని, ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా? లేదా అని యాప్ గుర్తు చేస్తుంది.
- వీటన్నింటిని సబ్‌స్టేషన్ ఆపరేట్ ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తే.. ఆ ఫొటోను లైన్‌మెన్ చూసుకొని ఫొటోలో కనిపిస్తున్న ఫీడర్, ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా లేదా అని ధ్రువీకరించుకొని పనులకు ఉపక్ర విస్తాడు.
- పనిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను లైన్‌మెన్‌కు ఎప్పటికప్పుడు యాప్ గుర్తు చేస్తూ హెచ్చరిస్తుంటుంది. ఎక్కడైనా డబుల్ ఫీడింగ్ ఉందా, ఈ ఫీడర్‌కు వేరే ఫీడర్‌తో అనుసంధానం ఉందా.. అని తెలియజేస్తుంటుంది. పని చేస్తున్న క్రమంలో ఎంత మంది సిబ్బంది పనిలో ఉన్నారా అనేది పేర్లతో సైతం యాప్‌లో లైన్‌మెన్ పొందుపర్చాల్సి ఉంటుంది.
- లైన్‌మెన్ పని పూర్తికాగానే ఆ పనికి సంబంధించిన ఫొటో తీసి యాప్‌లో పొందుపరిచి ఎల్సీ రిటర్న్ చేయాలి. తద్వారా సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఎల్సీ రిటర్న్ చేయాలని ఆదేశాలు వెళ్తాయి. ఆపరేటర్ ఎల్సీ రిటర్న్ చేసే క్రమంలో ఎర్త్‌రాడ్ తీశారా? లేదా? ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా? లేదా? అని యాప్ అడుగుతుంది. అందుకు అంగీకారం తెలిపిన అనంతరం విద్యుత్ యథావిధిగా సరఫరా అవుతుంది.

రేపు ఎల్లాపూర్‌లో లింగారెడ్డి విగ్రహావిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

హసన్‌పర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్‌లో మేడే రోజున సీపీఐ సీనియర్ నాయకుడు గంగిళ్ల లింగారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఆవిష్కరించనున్నట్లు బీకేఎంయూ జాతీయ నాయకుడు మోతె లింగారెడ్డి, మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి, ఆల్ ఇండియా ప్రోగ్రెస్ ఫోరం నాయకుడు నేదునూరి రాజమౌళి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు అనంతసాగర్, మడిపల్లి, సుబ్బయ్యపల్లి, జయగిరి, మునిపల్లి, చింతగట్టు, ఎల్లాపూర్ గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు డీ రాము, వెంకటేష్, సాంబరాజు, సమ్మయ్య, చంద్రమౌళి, సుధాకర్, ఓదెలు, రాజు, బన్నీ, అశోక్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

'నాతో నేను.. నీతో నేను' పుస్తకావిష్కరణ

కవయిత్రి రాధికా నరేన్‌ను అభినందించిన వక్తలు


కవయిత్రి రాధికా నరేన్‌ను సత్కరిస్తున్న ముఖ్య అతిథులు

హనుమకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవయిత్రి కొత్తపల్లి రాధికా నరేన్ రచించిన ఎనాతోనేను.. నీతో నేను' తొలి కవితా సంపుటి ఆవిష్కరణ ఘనంగా జరిగింది. మంగళవారం హైదరాబాద్ రవీంద్ర భారతి వేదికగా ముక్కెర సంపత్ అధ్యక్షన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ, సినీ గేయరచయిత మౌనశ్రీ మల్లిక్, శ్యాం ప్రసాద్‌లాల్, రచయిత పొన్నం రవి చంద్ర పాల్గొన్నారు. రాధికా నరేన్ తన పుస్తకాన్ని తల్లిదండ్రులకు అంకితమిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు రాధికను అభినందించారు. ముున్ముందు ఇలాంటి పుస్తకాలు మరెన్నో తీసుకురావాలని, సమకాలిన సమాజంలో అందరి మన్ననలను పొందాలని ఆశీర్వదించారు. హనుమకొండ రాంనగర్ నివాసి అయిన రాధిక ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. గత ఆరు సంవత్సరాలుగా ఆమె రచించిన ఎన్నో కవితలు, కథలు వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి. వాట్సాప్ గ్రూప్‌లు, సామాజిక మాధ్యమాల్లో సైతం రాస్తున్నారు.

పరశురాముడి గుణగణాలు సమాజానికి ఆదర్శం

వైభవంగా పరశురాం జయంతి


పరశురాముడి చిత్రపటానికి పూలమాలలు వేసిన నేతలు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బ్రహ్మణవాడలోని బ్రహ్మణభవన్‌లో మంగళవారం పరశురాముడి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. బ్రాహ్మణ సేవ సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మతో పాటు పలువురు ప్రముఖులు వారి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సం దర్భం గా ఉపేంద్రశర్మ మాట్లాడుతూ. చరిత్రలో బ్రహ్మణవంశంలో పుట్టిన క్షత్రియుడిగా విరోచితంగా పోరాడి ధర్మ పరిరక్షణకు పరశురాముడి చేసిన పోరాటం ఈ నాటి సమాజానికి ఎంతో ఆదర్శనీమని పేర్కొన్నారు. పరశురాముడి ధైర్యంతో దూకుడు యుద్ధంతో పాటు ప్రశాంతత, ఓర్పు ,వివేకం వంటి సలక్షణాలతో చరిత్రలో నిలిచారని కొనియాడారు. బ్రహ్మణ సేవ సమితి రాష్ట్ర నాయకులు పోచంపల్లి రమణరావు, ప్రధాన కార్యదర్శి గంగు నవీన్, మణికంఠ శర్మ, మరింగంటి వెంకటరమణచార్యులు, కలకుంట్ల మేఘశ్యామ్, శ్రీమన్నారాయణచార్య నితిన్, తోట పవన్, శ్రీను పాల్గొన్నారు.

కందగట్ల రాజశేఖర్‌కు డాక్టరేట్



మడికొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న మడికొండకు చెందిన కందగట్ల రాజశేఖర్‌కు డాక్టరేట్ లభించింది. కిట్స్ వరంగల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంటెక్ చేసి చెన్నైలోని భారత్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ వర్సిటీ (భారత్ వర్సిటీ)లో సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో రిసెర్చ్ స్కాలర్‌గా పరిశోధనను పూర్తి చేశారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజకుమారి మార్గదర్శకత్వంలో 'మాల్వేర్ అనాలిసిస్ అండ్ నెట్ వర్క్ ఇంట్రూడర్ డిటెక్షన్ సిస్టమ్ యూసింగ్ మెషిన్ లర్నింగ్ శీర్షిక తో పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. రాజశేఖర్‌ను వాగ్దేవి కళాశాల యాజమాన్యం, సెక్రటరీ సీహెచ్. దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె. ప్రకాష్, వీపీ కె. తిరుపతి, తన్వీర్ జహాన్, అధ్యాపకులు అభినందించారు.

ఇంగ్లీష్‌లో గద్దల ప్రేమ్‌కుమార్‌కు..



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం పరిశోధకుడు గద్దల ప్రేమ్‌కుమార్ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ గద్దల ప్రేమ్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రకటించారు. ' మల్టీ కల్చరలిజం ఇన్ నీల్ బిసుందత్ ఫిక్షన్' అనే అంశంపై చేసిన పరిశోధన గ్రంథానికి గాను ప్రేమ్‌కుమార్ కు డాక్టరేట్ లభించింది. కేయూ ఇంగ్లీష్ విభాగం ప్రొఫెసర్ ఎం. ప్రభాకర్ పర్యవేక్షణలో ప్రేమ్‌కుమార్ డాక్టరేట్ పూర్తి చేశారు. ఖిలా వరంగల్ ప్రాంతానికి చెందిన గద్దల ప్రేమ్‌కుమార్ దేశాయిపేటలోని సీకేఎం డిగ్రీ కళాశాలలో గెస్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. ప్రముఖ జర్నల్స్‌లో పరిశోధన పత్రాలను ప్రచురించారు.

ఫ్రీజర్ బాక్సులు ఏర్పాటు చేయండి

ఎంజీఎం సూపరింటెండెంట్‌కు వినతి


ఎంజీఎం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎంలోని మార్చ్యూరీలో ఫ్రీజర్ బాక్స్ లు పనిచేయడం లేదని, పదే పదే బాగు చేసినా వెంటనే చెడిపోయి పని చేయక పోవ డం వల్ల పార్థివదేహాలు నాణ్య త లేక వైద్య విద్యకు పని చేయ డం లేదని వెంటనే కొత్త ఫ్రీజ్ బాక్సులు ఏర్పాటు చేయా లని తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ప్రతినిధులు ఎంజీఎం సూపరింటెండెంట్, ఆర్ఎంవోలకు వినతిపత్రం అందజేశారు. వృద్ధు లు హాస్పిటల్‌లోని సిబ్బంది అందరికి వృద్ధుల సంరక్షణ చట్టంపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మల్లా రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, ఆడెపు రాజేంద్ర ప్రసాద్, యుగంధర్ పాల్గొన్నారు.

నేడు పదో తరగతి ఫలితాల విడుదల

హనుమకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్యాహ్నం 1 గంటకు ఫలితాలను విడుదల చేస్తారని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను http-s://results.bsetelangana.org, http-s://results.bse.telangana.gov.in https://bse.telangana. gov.in వెబ్‌సైట్లలో చూసుకోవచ్చునని తెలిపారు. పదో తరగతి పరీక్షలు మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగాయి. హనుమకొండ జిల్లాలో 318 ఉన్నత పాఠశాలల నుంచి మొత్తం 12061 మంది విద్యార్థులు, వరంగల్ జిల్లాలో 287 ఉన్నత పాఠశాలల నుంచి 9,392 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇప్పటి వరకు పదో తరగతిలో సబ్జెక్టుల వారీగా గ్రేడ్లతో సీజీపీఏ ఇచ్చేవారు. కానీ ఇకపై సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్లు ఇవ్వనున్నారని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. అంతర్గత మార్కులతో పాటు మొత్తం మార్కులు, గ్రేడ్లను పొందుపరచనున్నారు.

'ప్రొసీడింగ్స్' ఇంకెప్పుడిస్తరు సారూ?

బల్దియా చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్న ప్రజలు

నేటితో ముగియనున్న ఎల్ఆర్ఎస్ రాయితీ చెల్లింపులు

బల్దియాను వేధిస్తున్న సీజీజీ సాంకేతిక సమస్య

సమస్యతో బల్దియాకు రూ.100కోట్ల నష్టం

ఇప్పటికే సమకూరిన రూ.116కోట్ల ఆదాయం



వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నాన్ లేఅవుట్ స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియ అటు బల్దియా అధికారులు.. ఇటు వరంగల్ నగర ప్రజలకు తలనొప్పిగా మారింది. ల్యాండ్ రెగ్యులేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) ఫీజులు చెల్లించిన భూ యజమానులకు నెలలు గడుస్తున్నా ప్రొసిడింగ్ కాపీలు జారీ చేయకపోవడంతో ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. నేటితో 25 శాతం ఫీజు రిబెట్ చెల్లింపులకు అవకాశం ముగుస్తుండగా.. ఆ తర్వాత రాయితీ లేకుండా పూర్తి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కాగా 2020 ఆగస్టు 30 లోపు 25శాతం ఫీజు రిబేట్ ఉందని ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో ప్రచారం చేయడంతో ప్రజలు ఎగబడి మరీ డబ్బులు చెల్లించారు. అప్పు సప్పు చేసి భూములు కొనుగోలు చేసి లక్షలు జమ చేసి ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లిస్తే అధికారులు, సాంకేతిక సమస్య వల్ల అనుమతి పత్రాలు జారీ చేయక పోవడంతో ఫీజులు చెల్లించిన ప్రజలు బల్దియా కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. ఎల్ఆర్ఎస్ చెల్లింపులకు అవకాశం బుధవారంతో ముగుస్తుండడంతో డబ్బులు చెల్లించిన వారు ప్రొసీడింగ్ కాపీలు ఎప్పుడిస్తారని అధికారులను ప్రశ్నిస్తున్నారు. కొందరు కార్యాలయాల వద్ద సిబ్బందితో గొడవకు దిగుతున్నారు. తాము ఇళ్ల అనుమతులు పొంది నిర్మాణాలు జరుపుకోవాలంటే ప్రొసీడింగ్ కావాలని డబ్బులు చెల్లించి నెలలు గడుస్తున్నా ఎందుకు ప్రొసీడింగ్ కాపీలు జారీ చేయడం లేదని మండి పడుతున్నారు. 1,01,252 అప్లికేషన్లకు కొందరికి మాత్రమే ప్రొసీడింగ్ కాపీలు జారీ చేసి తమకు ఎందుకు ఇవ్వడం లేదని సిబ్బందిని నిలదీస్తున్నారు. ఇదంతా తమకు తెలియదని సీజీజీ (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్) ద్వారా వస్తుందని అధికారులు సమాధానమిచ్చి చేతులెత్తేస్తున్నారు. గడువు ముగుస్తున్నా అనుమతులు రాకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఆన్‌లైన్‌లో చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని లేదంటే లీగల్‌గా చూసుకుంటామని కొందరు సవాల్ చేస్తున్నారు.

14,265వేల దరఖాస్తులకు డబ్బు చెల్లింపు..

వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో విలీన గ్రామాలను కలుపుకుని 66 డివిజన్లలో 1,01,252 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 65,568 దరఖాస్తులు ఫీజు చెల్లంపులు జరిపేందుకు పరిశీలన పూర్తయింది. 14,265వేలకు పైగా దరఖాస్తుల యజమానులు ఫీజులో 25 శాతం రాయితీతో కూడిన డబ్బులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో చెల్లించారు. కాగా ఇప్పటి వరకు 5,105దరఖాస్తులు మాత్రమే ప్రొసీడింగ్ పొందాయని, 1598 దరఖాస్తులు మంగళవారం వరకు ప్రాసెస్‌లో ఉన్నాయని బల్దియా అధికారులు తెలిపారు. మంగళవారం వరకు బల్దియాకు ఎల్ఆర్ఎస్ ఫీజుల రూపంలో రూ.116కోట్ల ఆదాయం వచ్చినట్టు తెలిపారు. ఇంకా 28,590దరఖాస్తుదారులు ప్రొహిబిటెడ్ అని కంప్యూటర్‌లో చూపించడంతో గందరగోళం నెలకొంది. ఆన్‌లైన్‌లో సవరణ (ఎడిటింగ్ ఆప్షన్) లేకపోవడంతో అధికారులు, సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. ఇంకా డబ్బులు చెల్లిస్తామని ప్రజలు ముందుకు వస్తున్నా పెద్ద మొత్తంలో ప్రొహిబిటెడ్, ఎఫ్‌టీఎల్, కోర్టు కేసులు, అసైన్డ్ ల్యాండ్ పేరుతో సాఫ్ట్‌వేర్ ఫీజు చెల్లింపులను నిరాకస్తోంది. సాంకేతిక లోపంతో హనుమకొండ చౌరస్తాలో ఓ వ్యక్తి స్థలం కూడా ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లేవల్) అని చూపించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇలా తప్పులు జరగడానికి సాఫ్ట్‌వేర్ లోపమా లేక ఫీల్డ్ వెరిఫికేషన్‌కు వెళ్లిన అధికారుల లోపమా లేక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్న సమయంలో ప్రజలు చేసిన తప్పిదమా ఎవరికీ అంతుబట్టకుండా పోతోంది. అయితే ఆన్‌లైన్‌లో అన్నీ సవ్యంగా జరిగితే బల్దియాకు మరో రూ.100కోట్లు వచ్చి ఉండేవని అధికారులు చెప్పుకొస్తున్నారు.

వెయ్యి చెల్లించిన వారి ఆశలు అడియాశలు..

2020లో ఎల్ఆర్ఎస్ కోసం రూ. 1000 చెల్లించిన వారి ఆశలు అడియాశలయ్యాయి. ఎంతైనా ఫీజు భూ యజమానులు సిద్ధంగా ఉన్నా కొందరు అధికారుల అసమర్థత వల్ల ఎల్ఆర్ఎస్ ముందుకు సాగడం లేదనే విమర్శలున్నాయి. తొలి విడత ఫీజు రూ.1000 చెల్లించిన వారి స్థలం వద్దకు అధికారులు వెళ్లి పూర్తి రిపోర్టు కార్యాలయంలో ఇవ్వక పోవడం వల్ల ఎల్-1 (లెవల్-1) వద్దనే రెండు నెలలుగా దరఖాస్తులు ఆగి ఉండడంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ కుంటుపడినట్టు తెలుస్తోంది. అంతే కాకుండా నిత్యం సీజీజీ సైట్ ప్రాబ్లం అని ప్రజలకు సాంకేతిక కారణాలు చెప్పి సిబ్బంది తాత్కాలిక సమాధానం చెప్పి తప్పించుకున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిన బల్దియా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల చెల్లింపులతో పాటు ప్రొసీడింగ్ పత్రాల జారీ ప్రక్రియ వెనకబడిందనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే కొన్ని భూములు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్), ప్రభుత్వ భూములు, కోర్టు కేసులు, ప్రొహిబిటెడ్ జాబితాలో భూములు కలిగి ఉన్న వారు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపులపై నమ్మకం లేకపోవడంతో చెల్లించిన డబ్బులు వెనక్కి తీసుకోవడం కష్టం అని ఊహించి వెనకడుగు వేస్తున్నారు. ఇంటి నిర్మాణ అనుమతుల కోసం ప్రొసీడింగ్స్ రాకపోవడంతో ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన డబ్బులు 10 శాతం కట్ చేసుకుని మిగతా డబ్బులు తిరిగివ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రొసీడింగ్ కాపీ అందని ప్రజలు బల్దియా అధికారులను కోర్టుకీడుస్తామని హెచ్చరిస్తున్నారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారులను వివరణ కోరగా ఇప్పటికే మూడు శాఖల నుంచి మూడు సార్లు ప్రభుత్వానికి విన్నవించామని, ఎల్ఆర్ఎఫ్ ఫీజు చెల్లించిన వారికి కొంచెం ఆలస్యంగానైనా ప్రొసీడింగ్ కాపీ వస్తుందని తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై పోలీసులు దృష్టి సారించాలి

నెలవారీ నేర సమీక్షలో సీపీ సన్‌ప్రీత్ సింగ్


సమీక్షలో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణలో కీలకంగా పనిచేసే సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు ఇప్పటికే ఉన్న సీసీ కెమెరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనరేట్ కార్యాలయం ఆవరణలో నెల వారీ నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరా తీశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లలో పనిచేసే మహిళా సిబ్బంది అన్ని రకాల విధుల్లో రాణించేలా స్టేషన్ అధికారులు ప్రోత్సహించాలన్నారు. పోలీస్ శాఖ కోసం పనిచేసే పోలీసు అధికారులకు అవార్డులు, రివార్డులు ఉంటాయన్నారు. దొంగతనాల కట్టడి కోసం చోరీకేసుల్లో జైలుశిక్ష అనుభవించి బయటకు వచ్చే దొం గలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని సూచించారు. జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చే విధంగా పోలీస్‌స్టేషన్‌ల నిర్వహణ ఉండాలని సూచిం చారు. ఈ సమావేశంలో డీసీపీలు రాజమ హేంద్రనాయక్, అంకిత్ కుమార్, జనార్ధన్, జన గాం ఏఎస్పీ చైతన్యకుమార్, ఏఎస్పీ మనాన్ భట్, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్స్ ఎస్సైలు పాల్గొన్నారు.

అన్ని మతాల వారిని గౌరవించడం స్ఫూర్తిదాయకం

శాంతి పండుగ వేడుకల్లో నవల రచయిత అంపశయ్య నవీన్


వేడుకల్లో మాట్లాడుతున్న అంపశయ్య నవీన్

వరంగల్ కల్చరల్ ఏప్రిల్ 29, (ఆంధ్ర జ్యోతి) : మన పండుగల పేరుతో అన్ని మతాలను గౌరవించుకోవడం, అందరిని ఆహ్వానించడం చక్కని మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని ఈ వేడుక అందరికి ఆదర్శప్రాయమని ప్రముఖ నవల రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. మంగళవారం రాత్రి హనుమకొండలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో వరల్డ్ పీస్ ఫెస్టివల్ అధ్యక్షుడు, కేయూ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నవీన్ మాట్లాడుతూ.. ఇలాంటి వేడుకలు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. శాంతి స్థాపనే లక్ష్యంగా అన్ని మతాలను గౌరవించుకుంటూ సమ్మేళనం నిర్వహించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని అన్నారు. సమాజంలో ఎవ్వరికీవారుగా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా వరల్డ్ పీస్ బాధ్యులు మాత్రం బిన్న సంస్కృతులను ఒకే వేదికపైకి చేర్చి నిర్వహించడం శుభపరిణామం అని అన్నారు. చైర్మన్ ప్రొఫెసర్ సురేశ్‌లాల్ అధ్యక్షోపాన్యసం చేస్తూ..వరల్డ్ పీస్ ఫెస్టివల్ వ్యవస్థాపకులు మహ్మద్ సిరాజుద్దీన్ ఆలోచనలకు ప్రతిరూపంగా ఆవిర్భవించిన తమ సంస్థ గత దశాబ్దికాలంగా ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తూ మత సామరస్యంతో పాటు సమాజంలో శాంతి స్థాపనే ధ్యయంగా తమవంతుగా కృషి చేస్తోందని అన్నారు. ముందుగా అతిథులు శాంతి పతకాన్ని ఆవిష్కరించి శాంతిగీతం ఆలపించారు. అనంతరం ఇటీవల ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భిన్నమతాలకు చెందిన ఐదు గురు ప్రముఖులకు శాంతిమిత్ర పేరిట అవార్డులను ప్రదానం చేశారు. చిత్రలేఖన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీపాద సుధాకర్‌రావు, ప్రొఫెసర్ వి జయబాబు, కాజీపేట పురుషోత్తం, రవి కుమార్, పొన్నాలసంయుక్త రామ్మోహన్, రామిరెడ్డి, డాక్టర్ కె.అనితా రెడ్డి, వల్లపు రెడ్డి దయాకర్‌రెడ్డి, డాక్టర్ టీవీ రమణకార్, నిమ్మల శ్రీనివాస్, డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్, ఎమ్డీ రహెమాన్, శనిగరపు రాజమోహన్, సగంటి మంజుల తదితర అనేక మ ంది భిన్న రంగాలకు చెందిన వారు పాల్గొన్నారు. ఈ సం దర్భంగా ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పేదల ఇంటి స్థలాలకు పట్టాలివ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి


సమ్మయ్యనగర్‌లో దీక్షల వద్ద మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

వడ్డెపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 57వ డివిజన్ పరిధిలోని సమ్మయ్యనగర్, ఇంజనీరింగ్ కాలనీలకు చెందిన పేదలకు ఇంటి స్థలాల పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్‌రెడ్డి, కేయూ ప్రొఫెసర్ శ్రీనివాస్, సీపీఎం నేతలు ఎం. చుక్కయ్య, గొడుగు వెంకట్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై మంగళవారం సమ్మయ్య నగర్‌లోని స్మారక కేంద్రం వద్ద తవటం వెంకన్న, కుక్కముడి రవీందర్ అధ్యక్షతన చేపట్టిన రిలే నిరాహార దీక్షలను వారు ప్రారంభించి మాట్లాడారు. '30 సంవత్సరాలుగా పోరాటాలు చేసిన నేపథ్యంలో కొంత మందికి ఇళ్ల స్థలాల పట్టాలివ్వగా మరికొంత మందికి ఇవ్వకుండా పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. సమ్మయ్య నగర్ మెయిన్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని, డ్రైనేజీలను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వాంకుడోత్ వీరన్న, ప్రసాద్, రాజు, అరుణ, లత, అనిత, కందుకూరి విరాట్, రాధిక, సుజాత తదితరులు పాల్గొన్నారు.

జయంత్యుత్సవాలను జయప్రదం చేయాలి

నిర్వహణ కమిటీ జిల్లా కన్వీనర్ సుధాకర్

వడ్డెపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మహనీయుల జయంత్యుత్సవాల్లో భాగంగా బుధవారం హనుమకొండ సమ్మయ్యనగర్‌లో నేడు (బుధవారం) సాయంత్రం నిర్వహించే జయంతిని జయప్రదం చేయాలని మహనీయుల జయంతి నిర్వహణ కమిటీ జిల్లా కన్వీనర్ జిల్లపెల్లి సుధాకర్, ప్రజా సంఘాల జేఏసీ నేత డాక్టర్ జిలుకర శ్రీనివాస్ కోరారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జ్యోతిబా ఫూలే, అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, కాన్షీరాం, తదితర మహనీయులను స్మరించుకోవడం కోసం నిర్వహించే జయంత్యుత్సవాల్లో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ప్రజా వాగ్గేయకారుడు జయరాజ్ తదితరులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. సమావేశంలో నిర్వహణ కమిటీ ప్రతినిధులు డీ దామోదర్, రావుల నర్సింహ, జిలుకర స్వామి, రావుల వెంకన్న, బాబు పాల్గొన్నారు.

పహల్గాం ఘటన దుర్మార్గమైన చర్య

ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ వెంకట్ నారాయణ


అంబేద్కర్ విగ్రహం వద్ద పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

వడ్డెపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై ముష్కరులు జరిపిన ఘటన దుర్మార్గమైన చర్య అని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ కూరపాటి వెంకట్ నారాయణ అన్నారు. అమరుల ఆత్మకు శాంతి చేకూరాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండ రాంనగర్‌లోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా కార్యాలయం నుంచి కొవ్వొత్తులతో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ తీశారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పెన్షనర్ల సంఘం నాయకులు గుండా వీరస్వామి, కుందూరు గోపాల్‌రెడ్డి, ఎం వెంకట్‌రెడ్డి, పల్లా సుకుమార్‌రెడ్డి, కందుల సంజీవ రెడ్డి, మదర్ సాహెబ్, ఎండీ అలీ, మాదిరెడ్డి మల్లారెడ్డి, జ్యోతి రమణి, పీ సుమ, రాంచంద్రంతో పాటు సుమారు 200 మంది పెన్షనర్లు పాల్గొన్నారు.

జల సిద్ధాంత కర్త విద్యాసాగర్ వర్ధంతి

నివాళులర్పించిన మాజీ మంత్రి పొన్నాల, వినయ్ భాస్కర్


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ జల సిద్ధాంత కర్త సాగునీటి రంగంలో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు మార్గదర్శకాలను రూపొందించిన ఆర్. విద్యాసాగర్ వర్ధంతిని హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో విద్యాసాగర్ వర్ధంతి వేడుకలకు మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య హాజరై విద్యాసాగర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ.. కేంద్ర జల కమిషన్‌లోని జల వనరుల మంత్రిత్వ శాఖకు చీఫ్ ఇంజనీర్‌గా పని చేసిన సేవలు మరువలేనివిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజక వర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్ చెన్నం మధు, డివిజన్ ప్రెసిడెంట్ అనిల్, మైనార్టీ సెల్ నాయకుడు నయీమొద్దీన్, వెంకన్న, వినిల్‌రావు, జోరిక రమేష్, రాకేష్ యాదవ్, శ్రీకాంతాచారి, రఘు పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ జట్టు కోచ్‌గా శ్యాంసన్



వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడ రేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి అండర్ -19 బాలికల బాక్సింగ్ పోటీలకు వెళ్లే జట్టు కోచ్‌గా వరంగల్ నగరానికి చెందిన సందెల శ్యాంసన్‌ను నియమిస్తూ ఎస్‌జీఎఫ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 30 నుంచి మే 6 వరకు త్యాగరాజ్ స్పోర్ట్స్ స్టేడియంలో 68వ ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ పోటీలు జరుగుతాయి. అండర్ -19 విభాగం తెలంగాణ బాక్సింగ్ జట్టుకు శ్యాంసన్ కోచ్‌గా వ్యవహరిస్తాడు. జాతీయ కోచ్‌గా ఎంపికైన శ్యాంసన్‌ను సీనియర్ క్రీడాకారులు స్వామి చరణ్, నర్సింహరాములు, పార్థు అభినందించారు.

పొంగులేటిని కలిసిన బల్దియా కమిషనర్


పొంగులేటికి పూలమొక్కను అందిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆయనను కలిసి పూల మొక్కను అందించారు. మామునూరు హెలీప్యాడ్ వద్ద పొంగు లేటిని కలిసి జిల్లాకు స్వాగతం పలి కారు. నగర అభివృద్ధిపై కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

కేయూ క్యాంపస్ ఏప్రిల్ 29, (ఆంధ్రజ్యోతి) : కేయూ పరిధిలో డిగ్రీ ఇయర్‌వైజ్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి అన్నారు. మంగళవారం కేయూ పరిపాలన భవనంలో రిజి స్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను తన చాంబర్‌లో కలిసి డిగ్రీ ఇయర్ వైజ్ పాత విద్యార్థులకు సప్లిమెంటరీ పరీ క్షలు నిర్వహించాలని వినతి పత్రాన్ని అందచేసి కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నేతలు బొక్క ప్రవర్ధన్, విజయ్‌వర్మ తదితరులు పా ల్గొన్నారు.

గీతం విద్యార్థికి రూ.1.4 కోట్ల వార్షిక వేతనం

» అమెజాన్‌కు ఎంపికైన ప్రియాంక రెడ్డి

» అత్యధికంగా యాక్సెంచర్‌కు 91 మంది విద్యార్థులు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఏడాదికి రూ. 1.4 కోట్ల వేతనంతో గీతం విద్యార్థిని కారుమూరు ప్రియాంక రెడ్డి ప్రతిష్ఠాత్మక అమెజాన్ సంస్థలో ఉద్యోగం సాధించింది. ప్రియాంక గీతం యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్‌లో సీఎస్ఈ విద్యార్థిని. 2024-25 విద్యా సంవత్సరంలో దాదాపు 270కి పైగా బహుళ జాతి కంపెనీలు హైదరాబాదు గీతంలో ప్రాంగణ నియామకాలను నిర్వహించాయని గీతం వర్గాలు తెలిపాయి. అత్యధికంగా యాక్సెంచర్ కంపెనీకి 91 మంది విద్యార్థులు ఎంపికవగా, టెక్ మహీంద్రా సంస్థకు 87 మంది, రినెక్స్ టెక్నాలజీస్‌కు 70 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రకటించింది. అట్లాసియన్, మైక్రోసాఫ్ట్, ఒరాకిల్, డెలాయిట్, హెచ్ఎస్‌బీసీ వంటి సంస్థలు ఆకర్షణీయమైన వేతనాలతో వివిధ విభాగాలకు చెందిన గీతం విద్యార్థులను ఎంపిక చేసినట్టు పేర్కొన్నాయి. సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని గీతం క్యాంపస్‌లో మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న ప్రియాంకరెడ్డి

బొలెరో ఢీకొని ఇద్దరు నర్సింగ్ విద్యార్థినుల మృతి

» మరో విద్యార్థినితోపాటు ఓ బాలుడికి తీవ్ర గాయాలు

» త్రుటిలో తప్పించుకున్న గర్భిణి.. మద్యం మత్తులో డ్రైవర్

హైదరాబాద్/ గద్వాల క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కళాశాల నుంచి హాస్టల్‌కు వెళ్తున్న ఇద్దరు నర్సింగ్ విద్యార్థినులు వేగంగా వచ్చిన ఓ బొలెరో వాహనం ఢీకొట్టడంతో మృతి చెందారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన ఈ ప్రమాదంలో మరో విద్యార్థినితో పాటు ఓ బాలుడు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం లింగంపల్లికి చెందిన జి. మహేశ్వరి (20), వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం రాయన్‌పల్లికి చెందిన కొంకల మనీష (20) హాస్టల్‌లో ఉంటూ గద్వాల కళాశాలలో నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతున్నారు. మంగళవారం కళాశాల నుంచి హాస్టల్‌కు వెళ్తుండగా వేగంగా వచ్చిన ఓ బొలెరో వాహనం వీరిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన మహేశ్వరి, మనీష అక్కడికక్కడే మృతి చెందారు. వారితో పాటే ఉన్న యాదాద్రి జిల్లాకు చెందిన మరో విద్యార్థిని బండారి ప్రణతి కాలు విరిగింది. వీరిని ఢీకొట్టిన తర్వాత వాహనం పక్కన ఉన్న పానీపూరి బండిపైకి దూసుకెళ్లడంతో అక్కడ నిల్చుని ఉన్న చరణ్‌భూపాల్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ప్రణతిని, చరణ్‌భూపాల్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వేగంగా వస్తున్న వాహనాన్ని చూసి ఆగడంతో ఓ గర్భిణీ ఈ ప్రమాదం నుంచి త్రుటి లో బయటపడింది. అయితే మద్యం తాగి వాహనం నడిపిన డ్రైవర్‌ను కఠినంగా శిక్షించడంతో పాటు, మృతి చెందిన తమ స్నేహితుల కుటుంబాలకు న్యాయం చేయాలని నర్సింగ్ విద్యార్థినులు రోడ్డుపై బైఠాయించారు. కళాశాల యాజమాన్యం నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

నర్సింగ్ విద్యార్థినుల మృతి బాధాకరం: దామోదర

గద్వాల రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నర్సింగ్ విద్యార్థినులు మృతి చెందడం పట్ల మంత్రి దామోదర రాజనర్సింహ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి.. గాయపడి చికిత్స పొందుతున్న ఇద్దరి వైద్యానికి సాయం అందించాలని ఆదేశించారు.

జూన్ 2 నుంచి రాష్ట్రమంతా
రెవెన్యూ సదస్సులు

» 10,956 మంది గ్రామ రెవెన్యూ అధికారులు, వెయ్యి మంది సర్వేయర్లను నియమిస్తాం

» రెవెన్యూ సదస్సుల్లో మంత్రి పొంగులేటి



కామారెడ్డి/కరీమాబాద్/నేలకొండపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రైతుల భూముల సమస్యలను పరిష్కరించేందుకు జూన్ 2 నుంచి ఆగస్టు 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం షెట్పల్లి, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సుర్దేపల్లి గ్రామాలతో పాటు వరంగల్‌లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మంత్రి పొంగులేటి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి, ఆగస్టు వరకు భూ సమస్యలు లేకుండా చేస్తామన్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ సమయంలో పట్టా పాసుబుక్‌లలో భూముల లొకేషన్ మ్యాప్‌ను పొందుపరుస్తామన్నారు. ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు త్వరలోనే పట్టాలు ఇస్తామని వెల్లడించారు. అవగాహన సదస్సుల్లో 23,080 దరఖాస్తులు వచ్చాయని, అందులో 40 శాతం సాదా బైనామాలకు సంబంధించినవేనని అన్నారు. ధరణిలో అవకాశం లేకపోవటం వల్ల 9.26లక్షల సాదా బైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. మరో 10రోజుల్లో 10,956 మందిని గ్రామ రెవెన్యూ అధికారులుగా నియమిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం 380 మంది ప్రభుత్వ సర్వేయర్లుఉన్నారని, మరో 1,000 మందిని నియమిస్తామని చెప్పారు. 10-15 రోజుల్లో 3-4వేల మంది ప్రైవేటు సర్వేయర్లకు శిక్షణ, లైసెన్సులు ఇచ్చి, ప్రతి మండలానికి నలుగురైదుగురిని పంపిస్తామని తెలిపారు. రెండో దశలో మరో 3 వేల మందికి శిక్షణ ఇస్తామన్నారు. వచ్చే నెలలో 6-7వేల మంది రెవెన్యూ సిబ్బందిని నియమిస్తామని చెప్పారు.

మళ్లీ మార్కులు

పదో తరగతి మెమోల్లో గ్రేడుల స్థానంలో మార్కులు

» పాఠశాల విద్యా శాఖ నిర్ణయం.. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం

» ఈసారి జారీ చేయనున్న మెమోల్లోనే అమలుకు నిర్ణయం

» సర్కారు నిర్ణయంపై విద్యావేత్తలు, సంఘాల అభ్యంతరం

» సంప్రదింపుల్లేకుండా విద్యార్థులపై ఒత్తిడి పెంచే నిర్ణయమని మండిపాటు



హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి మెమోల్లో గ్రేడుల స్థానంలో మళ్లీ మార్కులు కనిపించనున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ తీసుకున్న నిర్ణయానికి ప్రభుత్వం తాజాగా అనుమతి ఇచ్చింది. మార్చిలో జరిగిన పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేయనున్న విషయం తెలిసిందే. వీటికి సంబంధించిన మెమోల్లో మార్కులనే పేర్కొననున్నారు. అలాగే, 20 ఇంటర్నల్ మార్కులకూ ఇంతవరకూ గ్రేడింగ్ విధానమే ఉండగా.. దీని స్థానంలో మార్కులు ప్రకటించనున్నారు. కొత్త మెమో నమూనాను పాఠశాల విద్యా శాఖ మంగళవారం విడుదల చేసింది. ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులు ఇస్తామని అందులో అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థి ఫలితాలను పాస్, ఫెయిల్ అని స్పష్టంగా పేర్కొననున్నారు. అయితే, విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యా సంఘాలు ఎవరితోనూ సంప్రదించకుండా విద్యా శాఖ ఏకపక్షంగా, అనూహ్యంగా ఈ నిర్ణయం తీసుకుందనే విమర్శలు తీవ్ర స్థాయిలో వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులపై మార్కుల ఒత్తిడిని తగ్గించాలని విద్యావేత్తలు, మానసిక నిపుణులు కోరుతుంటే.. వారిపై మరింత ఒత్తిడిని పెంచే నిర్ణయాన్ని విద్యా శాఖ తీసుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. నిజానికి, విద్యార్థులపై మార్కుల ఒత్తిడిని తగ్గించాలన్న ఉద్దేశంతోనే దశాబ్దంన్నర కిందట ఉమ్మడి రాష్ట్రంలో మార్కుల విధానాన్ని తొలగించి గ్రేడింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. 2009-10 విద్యా సంవత్సరం నుంచి దీనిని అమల్లోకి తెచ్చారు. ఉదాహరణకు.. 91-100 మధ్యలో ఎన్ని మార్కులు వచ్చినా ఏ-1 గ్రేడ్ ఇచ్చేవారు. 81-90 మార్కులకు ఏ-2; 71-80కి బి-1, 61-70కి బి-2, 51-60 సి-1, 41-50 సి-2, 35-40 డి, 35 మార్కులు తగ్గితే గ్రేడ్-ఈ ఇచ్చేవారు. మొత్తం మార్కుల స్థానంలో సీజీపీఏ (క్యుములేటివ్ గ్రేడింగ్ పాయింట్ యావరేజ్) సైతం గ్రేడింగ్‌లోనే ప్రకటించేవారు. విద్యార్థులపై మానసిక ఒత్తిడి లేకుండా చేయడమే దీని ప్రధాన ఉద్దేశం. అప్పటి ప్రభుత్వం విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రులు, విద్యార్థులతో చర్చించి గ్రేడింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. అయితే, అకస్మాత్తుగా దీనిని తొలగిస్తూ విద్యా శాఖ నిర్ణయం తీసుకోవడం, ప్రభుత్వం అనుమతి ఇవ్వడం విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలను ఆశ్చర్యానికి గురిచేసింది. అసలు కొత్త విధానం ప్రారంభించడం వెనక ప్రభుత్వ ఉద్దేశం ఏమిటని నిలదీస్తున్నారు.

విద్యార్థులపై మరింత ఒత్తిడి

\- శ్రీపాల్ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

పదో తరగతిలో మార్కుల విధానం విద్యార్థులపై ఒత్తిడి మరింత పెంచనుంది. గ్రేడింగ్ విధానం విద్యార్థులకు ఎంతో మేలు కలిగించింది. కొత్త విధానంతో సమస్యలు పెరుగుతాయి. ప్రస్తుతం పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌తోపాటు అనేక రాష్ట్రాల్లో గ్రేడింగ్ విధానమే అమల్లో ఉంది. మార్కులు ప్రకటించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలి.

సంఘాలన్నీ వ్యతిరేకించాయి

\- చావ రవి, అధ్యక్షుడు, టీఎస్‌యూటీఎఫ్

పదో తరగతి మెమోలో మార్కుల విధానం తెచ్చే ఆలోచన ఉందని విద్యా శాఖ కార్యదర్శిగా ఉన్నప్పుడు బుర్రా వెంకటేశం ఓసారి సంఘాలతో ప్రస్తావించారు. దానిని అప్పుడే అందరం ముక్తకంఠంతో వ్యతిరేకించాం. అలా చేస్తే విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుందని స్పష్టం చేశాం. కానీ, సంఘాలు, విద్యావేత్తలతో ఎలాంటి సంప్రదింపులు లేకుండానే విద్యా శాఖ అకస్మాత్తుగా నిర్ణయం తీసుకోవడం సరికాదు. ఇది కార్పొరేట్ కాలేజీలకు లబ్ధి కలిగించేందుకు అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ప్రభుత్వం పాత విధానాన్నే కొనసాగించాలి.

ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు
ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు

» హైకోర్టులో ప్రభుత్వం వాదన

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు ఎట్టి పరిస్థితుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వరాదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది. ప్రభాకర్‌రావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ జె. శ్రీనివాసరావు ధర్మాసనం మంగళవారం విచారణ కొనసాగించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. 'పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్న నిందితుడు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరడం సరికాదు. గత ప్రభుత్వంలో ఎస్ఐబీ చీఫ్‌గా ప్రభాకర్‌రావు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ప్రభుత్వ వ్యవస్థలను, యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ ఏకంగా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ చేయడానికి వినియోగించారు. ఈ కేసులో వాస్తవాలను బయటకు తేవాలంటే ప్రభాకర్‌రావు కస్టడీ కీలకం.. ఆయన నిర్బంధ విచారణ వల్లే అన్ని నిజాలు బయటకు వస్తాయి. ఇదే కేసులో ఏ-6గా ఉన్న శ్రవణ్‌రావును అరెస్ట్ చేయకుండా సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది కాబట్టి తనకూ అదే వర్తిస్తుందని ప్రభాకర్‌రావు చెప్పడం చెల్లదు. శ్రవణ్‌రావు ప్రభుత్వ ఉద్యోగి కాదు. కానీ మొత్తం ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రభాకర్‌రావు ఆధారంగానే జరిగింది. శ్రవణ్‌రావుకు ఇచ్చింది మధ్యంతర రక్షణ మాత్రమే. అది ఎప్పుడైనా ఎత్తేయవచ్చు. అంతేగాక అసలు ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే తాను వివిధ రాజకీయ నాయకుల వివరాలు అందజేశానని స్వయంగా శ్రవణ్‌రావు స్టేట్‌మెంట్ ఇచ్చారు. ప్రభాకర్‌రావును భారత్ తీసుకురావడానికి ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. పాస్‌పోర్ట్ పునరుద్ధరణకు ఎలాంటి ప్రయత్నం చేయని నిందితుడు.. అమెరికాలో కూర్చుని హైకోర్టు ఆదేశాలు పొందాలని చూస్తున్నాడు. అరెస్ట్ చేయొద్దన్న ఆదేశాలు పొందిన తర్వాతే భారత్ వస్తాననే ఉద్దేశంతో వ్యవహరిస్తున్నాడు. క్యాన్సర్ ఉందని పేర్కొంటూ 2004, 2005, 2008 నాటి వైద్య నివేదికలు చూపిస్తున్నాడు. ఫోన్ ట్యాపింగ్ కేసు బయటకు పొక్కిన తర్వాత క్యాన్సర్ ఉందని తప్పుడు స్టేట్‌మెంట్లు ఇస్తున్నాడు' అని ఆరోపించారు. తదుపరి విచారణ బుధవారానికి వాయిదా పడింది.


గదులకు తాళం వేయడంతో బయటే నిల్చున్న మెడికల్ విద్యార్థులు

అద్దె కట్టలేదని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి తాళం

» గంటన్నర పాటు ఆరుబయటే ఉన్న విద్యార్థులు, ఫ్యాకల్టీ

» కలెక్టర్, ఆర్డీవో జోక్యంతో తాళాలు తీసిన భవన యజమాని

ఆదిబట్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అద్దె కట్టలేదని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు భవన యాజమాన్యం తాళం వేసింది. దీనితో వైద్య విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందిపడ్డారు. కలెక్టర్, ఆర్డీవో జోక్యంతో తాళాలు తీశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లిలో మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద ఈ సన్నివేశం చోటు చేసుకుంది. మంగల్‌పల్లి సమీపంలోని భారత్ ఇంజనీరింగ్ కాలేజీలోని ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్వహిస్తున్నారు. దీనికి గతేడాది ఆగస్టు నుంచి నెలకు రూ.16 లక్షల చొప్పున అద్దె చెల్లించాలి. 8 నెలల అద్దె రావాల్సి ఉందంటూ ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యం.. వైద్య కళాశాల తరగతి గదులకు తాళాలు వేశారు. వైద్య కళాశాల బోర్డునూ తొలగించారు. దీనితో మంగళవారం ఉదయం కళాశాలకు వచ్చిన వైద్య విద్యార్థులు, ఫ్యాకల్టీ బయటే ఉండిపోయారు. ఈ విషయం కలెక్టర్ నారాయణరెడ్డి దృష్టికి వెళ్లడంతో.. సమస్యను పరిష్కరించాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి సూచించారు. ఆర్డీవో భవన యాజమాన్యంతో మాట్లాడారు. వారంలో అద్దె సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీనితో యాజమాన్యం తాళాలు తీయగా.. వైద్య కళాశాల తరగతులు కొనసాగాయి.

బడిపిల్లల్లో పెరుగుతున్న కిడ్నీ స్టోన్ కేసులు

» శీతాకాలంతో పోలిస్తే వేసవిలో రెండున్నర రెట్లు అధికం

» ఏఐఎన్‌యూ వైద్యుల పరిశీలనలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కిడ్నీలో రాళ్లు ఏర్పడుతున్న కేసులు ఇటీవలి కాలంలో 10-17 ఏళ్ల పిల్లల్లో ఎక్కువగా నమోదు అవుతున్నాయని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ(ఏఐఎన్‌యూ) వైద్యుల పరిశీలనలో వెల్లడైంది. పాఠశాలలో ఉన్నప్పుడు నీళ్లు తాగకపోవడం, జంక్ ఫుడ్, ఎక్కువగా కూల్ డ్రింక్స్ తాగడం దీనికి కారణాలుగా వైద్యులు చెప్పారు. రాష్ట్రంలో కిడ్నీ స్టోన్ కేసులు శీతాకాలంతో పోలిస్తే ఈ వేసవి కాలం ప్రారంభమైనప్పటి నుంచి రెండున్నర రెట్లు పెరిగాయన్నారు. ఎండాకాలంలో తగినన్ని నీళ్లు తాగకపోవడంతో కిడ్నీల్లో ఇబ్బందులు పెరుగుతున్నట్లు గుర్తించామని వారు వివరించారు. రోజుకు సుమారు 300-400 మంది రోగులు కిడ్నీలో రాళ్ల సమస్యతో ఏఐఎన్‌యూ ఆస్పత్రికి వస్తున్నట్లు చెప్పారు. ఉప్పు ఎక్కువగా తినడం, తగినన్ని నీళ్లు తాగకపోవడం, శరీరంలో నీరు ఆవిరి అయిపోవడం వంటి కారణాల వల్ల వేసవిలో కిడ్నీల్లో రాళ్ల సమస్య పెరుగుతుందన్నారు.

భూదాన్ భూముల కేసులో ఈడీ సోదాలు

» 45 వింటేజ్ కార్లు, 23 లక్షల నగదు, 12వేల దిర్హాంలు స్వాధీనం

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): భూదాన్ భూముల్లో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను ఈడీ సేకరించింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని ఐదుగురు నిందితుల ఇళ్లు, ఫార్మ్‌హౌస్‌ల్లో సోమవారం జరిపిన సోదాల్లో కీలకమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు హైదరాబాద్ రీజియన్ ఈడీ అధికారులు మంగళవారం తెలిపారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మహ్మద్ మునావర్ ఖాన్, ఖదీరున్నీసా, మహ్మద్ లతీఫ్ షర్ఫాన్, మహ్మద్ షకూర్, మహ్మద్ అక్తర్ షర్ఫాన్ ఇళ్లు, ఫార్మ్‌హౌస్‌ల్లో సోదాలు జరిపారు. ఫోర్జరీ ల్యాండ్ డాక్యుమెంట్లు, రూ.23 లక్షల నగదు, 45వింటేజ్‌కార్లు, యూఏఈకి చెందిన 12వేల దిర్హాంలు స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు.

లాటరీ పద్ధతిన
బార్ల కేటాయింపు

» బెల్లంపల్లి మినహా 24 చోట్ల డ్రా తీసిన కలెక్టర్లు

» మిర్యాలగూడలో అత్యధికంగా 226 దరఖాస్తులు

» జీహెచ్ఎంసీ పరిధిలోని 15 బార్లకు మే మొదటి వారంలో ప్రకటన



హైదరాబాద్/ మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 25 బార్ల ఏర్పాటు కోసం మంగళవారం ఆయా జిల్లాల్లో కలెక్టర్లు లాటరీ తీసి కేటాయింపులు చేశారు. బెల్లంపల్లి మినహా 24 చోట్ల కలెక్టర్లు డ్రా తీశారు. రాష్ట్రంలో 25 కొత్త బార్ల ఏర్పాటు కోసం 1,346 మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తుల నుంచి లాటరీ తీసి కేటాయింపులు జరిపారు. బెల్లంపల్లిలో సింగిల్ అప్లికేషన్ రావడంతో అక్కడ దరఖాస్తుల స్వీకరణ గడువును మే 5 వరకు పొడిగించారు. బెల్లంపల్లి మినహా మిగిలిన ప్రాంతాల్లో బార్ల ఏర్పాటు కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఒక బార్ ఏర్పాటు కోసం 226 మంది దరఖాస్తు చేసుకున్నారంటే పోటీ ఏ మేరకు ఉందో ఊహించుకోవచ్చు. ఈ నేపథ్యంలో అన్ని చోట్లా లాటరీ తీసి వ్యాపారులను ఎంపిక చేశారు. వీళ్లంతా ఎక్సైజ్ శాఖకు చెల్లించాల్సిన ఫీజు చెల్లించి, మిగిలిన ప్రక్రియలను పూర్తిచేసి కొత్త బార్లను ఏర్పాటు చేసుకోనున్నారు. వచ్చే నెలలో కొత్త బార్లు అందుబాటులోకి రానున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియడంతో మే నెల మొదటి వారంలో ప్రకటన జారీ చేయనున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 1,176 బార్లు ఉండగా, కొత్తగా మరో 25 ఏర్పాటు కాబోతున్నాయి. దరఖాస్తుల విక్రయం ద్వారానే ప్రభుత్వానికి రూ.13.46 కోట్ల ఆదాయం సమకూరింది. జీహెచ్ఎంసీ పరిధిలో బార్ల ఏర్పాటుకు మరింత పోటీ నెలకొనే అవకాశం ఉంది. దరఖాస్తుల విక్రయం ద్వారానే రూ.50 కోట్లపైనే ఆదాయం రావొచ్చని ఎక్సైజ్‌శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

బీరు సీసాలపైనా లేబుల్స్!

» రాష్ట్ర ఎక్సైజ్ శాఖ నిర్ణయం

» లేబుల్స్‌లో ఎలాంటి మార్పులు చేయవచ్చు?


» ఏజెన్సీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ కోరిన ఆబ్కారీశాఖ

హైదరాబాద్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను నియంత్రించడానికి అమలు చేస్తున్న లేబుల్స్‌ను.. బీరు సీసాలకు కూడా అతికించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది. 'ఎక్సైజ్ అడ్‌హెసివ్ లేబుల్స్ (ఈఏఎల్)'గా పిలిచే ఈ స్టిక్కర్ల ను ప్రతి మద్యంసీసాపై అతికిస్తారు. అయితే ప్రస్తుతం అతికిస్తున్న ఈలేబుళ్ల కంటే అధునాతనంగా ఎలాంటి విధానాన్ని అమలు చేయవచ్చనే దానిపై ఆబ్కారీ అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు వివిధ రాష్ట్రాల్లో మద్యం సీసాలపై ఎలాంటి లేబుళ్లు వేస్తున్నారు? వాటి ప్రత్యేకతలు, ఆ మద్యం ఉత్పత్తి నుంచి సరఫరా దాకా ఎలా ట్రాకింగ్ చేస్తున్నారనేది పరిశీలిస్తున్నారు. దీనికి సంబంధించి కొత్త లేబుళ్లు, ట్రాక్ అండ్ ట్రేస్ సాఫ్ట్‌వేర్ కోసం ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ ఈ నెల 9న టెండర్ ప్రకటన కూడా జారీ చేశారు.

లేబుల్‌పై బార్ కోడ్‌తో..

రాష్ట్రంలో 2,620 మద్యం దుకాణాలు, 1,176 బార్లు ఉన్నాయి. వీటిలో ఏటా 3.6 కోట్ల కాటన్ల లిక్కర్, 5 కోట్ల కాటన్ల బీర్లను విక్రయిస్తున్నారు. కల్తీ మద్యం, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్) వంటివాటిని అరికట్టడం కోసం ప్రతి మద్యం సీసాపై లేబుల్ వేస్తారు. టెండర్ పొందిన ఏజెన్సీలు ఆ లేబుళ్లను మద్యం కంపెనీలకు సరఫరా చేస్తాయి. ఈ లేబుళ్లపై ప్రత్యేక బార్ కోడ్ ఉంటుంది. దాన్ని స్కాన్ చేస్తే ఆ మద్యం ఉత్పత్తి చేసిన కంపెనీ నుంచి దుకాణానికి సరఫరా వరకు (ట్రాక్ అండ్ ట్రేస్) వివరాలన్నీ తెలుస్తాయి. ఈ లేబుళ్ల సరఫరా కోసం 2010లో టెండర్లు పిలిచి ఓ ఏజెన్సీకి బాధ్యత అప్పగించారు. 2022లో టెండర్ పిలిచినా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. మద్యం సీసాలపై వేసే లేబుల్స్ కోసం కంపెనీలు ప్రతి నెలా రూ.18 కోట్ల వరకు భరిస్తున్నాయి. ప్రస్తుతం ఒక్కో లేబుల్ కోసం మద్యం కంపెనీలు 30పైసలు ఆబ్కారీ శాఖకు చెల్లిస్తుండగా.. ఆబ్కారీ శాఖ సంబంధిత ఏజెన్సీకి 22పైసల చొప్పున ఇస్తోంది. ఇన్నేళ్ల తర్వాత లేబుళ్ల సరఫరా కోసం టెండర్లు నిర్వహించడానికి ఆబ్కారీశాఖ చర్యలు చేపట్టింది. బీరు సీసాలకూ లేబుల్స్ వేయాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో వాటి ఖర్చు రెట్టింపయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

గర్భిణికి హైకోర్టు అండ



» అల్లుడి వేధింపులపై బాధితురాలి తల్లిదండ్రుల పిటిషన్

» చిక్కిశల్యమైన బాధితురాలు

» వాస్తవాలను గుర్తించాలని లీగల్ సర్వీసెస్ కమిటీకి హైకోర్టు సూచన

» కమిటీ నివేదికతో తల్లీబిడ్డలను ఆస్పత్రికి తరలించాలని ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): "తల్లి కడుపులో పిండానికి కూడా జీవించే హక్కును మన రాజ్యాంగం కల్పించింది" అంటూ హైకోర్టు ఓ గర్భిణికి అండగా నిలిచింది. ప్రేమపెళ్లి చేసుకుని, హైదరాబాద్ లో ఉంటున్న తమ కుమార్తెను ఆమె భర్త వేధిస్తున్నాడంటూ ఏపీలోని గుంటూరుకు చెందిన దంపతులు దాఖలు చేసిన పిటిషన్‌పై వెంటనే స్పందించింది. గుంటూరులోని చంద్రమౌళినగర్‌కు చెందిన సూరే శ్రీనివాసరావు, వాసవి దంపతుల కుమార్తె ప్రవళిక(27) పెద్దలను ఎదిరించి హైదరాబాద్‌లోని మియాపూర్ మాతృశ్రీనగర్‌లో నివసించే ఎల్.వెంకటాచలపతిని పెళ్లి చేసుకుంది. ప్రస్తుతం ప్రవళిక 8 నెలల గర్భవతి. ఈ దంపతులకు రెండేళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. అయితే.. అల్లుడు సైకోలా వ్యవహరిస్తూ తమ కుమార్తెను వేధింపులు, చిత్ర హింసలకు గురిచేస్తున్నాడని పేర్కొంటూ శ్రీనివాసరావు, వాసవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసులు తమ ఫిర్యాదును స్వీకరించడం లేదని వాపోయారు. ఈ పిటిషన్‌ను విచారిస్తున్న జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం వెంటనే స్పందించి.. నిజానిజాలను నిగ్గుతేల్చాలంటూ హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీని ఆదేశించారు. దాంతో.. కమిటీ కార్యదర్శి శాంతివర్ధిని స్వయంగా ప్రవళిక ఇంటికి వెళ్లి, పరిశీలించారు. వెంటనే హైకోర్టుకు నివేదిక ఇచ్చారు. గర్భవతి అయిన ప్రవళిక చాలా బలహీనంగా ఉందని, నరాల సమస్య, రక్తహీనతతో బాధపడుతోందని, ఆమె రెండేళ్ల కుమారుడిలోనూ వయసుకు తగ్గ ఎదుగుదల లేదని ఆ నివేదికలో వెల్లడించారు. దీంతో ధర్మాసనం.. వెంటనే ప్రవళిక, ఆమె కుమారుడిని గాంధీ ఆస్పత్రికి తరలించి, తగిన వైద్యం అందజేయాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖను ఆదేశించింది. తల్లీబిడ్డల ఆరోగ్య పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని పేర్కొంది. వారికి రక్షణ కల్పించాలంటూ పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది.



మహేశ్ లుక్ లీక్

ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా గురించి ఏ చిన్న విషయం బయటకి రాకుండా మేకర్స్ జాగ్రత్తపడుతున్నారు. హైదరాబాద్, ఒడిసా షెడ్యూల్స్ పూర్తిచేసిన చిత్రబృందం మరో షెడ్యూల్ కోసం త్వరలో విదేశాలకు వెళ్లనుంది. ఈ సినిమా కోసం మహేశ్ లుక్ పరంగా పూర్తిగా మేకోవర్ అయ్యిన సంగతి తెలిసిందే. ఎప్పుడూ లేనంతగా గడ్డం పెంచేశారు. గుబురు గడ్డంలో ఉన్న మహేశ్ బాబు ఫొటోలు లీక్ అయ్యాయి. ఇవి ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ లుక్ చూసిన అభిమానులు సూపర్ అంటూ మురిసిపోతున్నారు. కాగా, దాదాపు రూ.వెయ్యి కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా మొదటి భాగాన్ని 2027లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఎన్టీఆర్.. నీల్ విడుదల తేదీ వచ్చేసింది



ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. 'ఎన్టీఆర్ నీల్' ఈ సినిమా వర్కింగ్ టైటిల్. ఇటీవలె, ఈ సినిమా షూట్‌లోకి ఎన్టీఆర్ అడుగుపెట్టారు. మొదట ఈ సినిమాను వచ్చే ఏడాది జనవరి 9న సంక్రాంతి సందర్భంగా విడుదల చేయాలనుకున్నారు. అయితే ఇప్పుడు విడుదల తేదీ మారింది. కొత్త తేదీని మేకర్స్ మంగళవారం ప్రకటించారు. వచ్చే ఏడాది జూన్ 25న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ కథానాయిక. మైత్రీ మూవీమేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇందులో ఎన్టీఆర్ పోషించే పాత్ర మునుపెన్నడూ చూడనంత శక్తిమంతంగా ఉంటుందని మేకర్స్ పేర్కొన్నారు. మే20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్ విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అద్భుతమైన విజువల్స్‌తో...



బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కథానాయకుడిగా కౌశిక్ పెగళ్లపాటి తెరకెక్కిస్తున్న చిత్రం 'కిష్కింధపురి'. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదల చేసిన మోషన్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేసింది. తాజాగా, ఈ చిత్రం నుంచి గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. సాయిశ్రీనివాస్ చెప్పిన 'అహం మృత్యువు' అనే డైలాగ్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు మేకర్స్ తెలిపారు.

ఆలయాన్ని రక్షించిన యోధుల కథ



సునీల్‌శెట్టి, సూరజ్ పంచోలి, వివేక్ ఒబెరాయ్, ఆకాంక్ష శర్మ ప్రధాన పాత్రల్లో ప్రిన్స్ ధిమాన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'కేసరివీర్'. చౌహాన్ స్టూడియోస్, పనోరమ స్టూడియోస్ బ్యానర్లపై కను చౌహాన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మే 16న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తుగ్లక్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు హమీర్జీ గోహిల్ కథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. హమీర్జీ గోహిల్ పాత్రలో సూరజ్ పంచోలి అద్భుతంగా నటించారు. 14వ శతాబ్దంలో ఆక్రమణదారుల నుంచి సోమనాథ్ ఆలయాన్ని రక్షించిన యోధుల కథను ప్రధాన ఇతివృత్తంగా తెరకెక్కించారు. మరో యోధుడు వేగ్దాజీ పాత్రలో సునీల్‌శెట్టి నటించగా, జాఫర్ ఖాన్‌గా వివేక్ ఒబెరాయ్ కనిపించనున్నారు.

దీక్ష, పట్టుదలతో..




కిరణ్, అలేఖ్యరెడ్డి జంటగా రూపొందుతోన్న చిత్రం 'దీక్ష'. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వం వహించడంతో పాటు పి.అశోక్ కుమార్‌తో కలిసి నిర్మిస్తున్నారు. ప్రేమ, వినోదం నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ మంగళవారం హైదరాబాద్‌లో పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా దర్శకనిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చు అనే పాయింట్‌ను ఇతివృత్తంగా తీసుకొని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాము. హీరో కిరణ్ భీముని పాత్రలో అద్భుతంగా నటించాడు. ఆర్ ఆర్ ఈ చిత్రానికి హైలెట్‌గా నిలుస్తుంది. పాటలు అద్భుతంగా వచ్చాయి' అని అన్నారు. అక్సఖాన్, తులసి, అనూష, కీర్తన తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటించారు.



పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ.. తెలుగు చిత్ర పరిశ్రమలోని ప్రముఖులు కొవ్వొత్తులతో నిరసన చేశారు. ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నటుడు మురళీ మోహన్, 'మా' అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి, ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్‌భూషణ్, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితం...



నవీన్ చంద్ర హీరోగా లోకేష్ అజ్లీస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'లెవెన్'. ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌ను అజ్మల్ హరి, రేయా ఖాన్ నిర్మించారు. మే 16న సినిమా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను కమల్‌హాసన్ విడుదల చేశారు. సీరియల్ కిల్లింగ్స్ నేపథ్యంలో సాగే ఈ ట్రైలర్ క్షణక్షణం ఉత్కంఠభరితంగా ఉంది. నవీన్ చంద్ర శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రను పోషించారు. రవివర్మ, కిరీటి దామరాజు, అభిరామి కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకాంత్.ఎన్.బి, సినిమాటోగ్రఫీ: కార్తీక్ అశోకన్, సంగీతం: డి.ఇమ్మాన్.





శ్రీతేజ.. ఎవరినీ గుర్తుపట్టడం లేదు!

- న్యూరో రిహాబిలిటేషన్ కేంద్రానికి బాలుడు
- అక్కడ చికిత్సతో మెదడు స్పందించే అవకాశం
- నోటి ద్వారా ఆహారం.. వెంటిలేటర్ అవసరం లేదు
- కిమ్స్ వైద్యుల వెల్లడి.. ఆ ఆస్పత్రిలో 5నెలల చికిత్స
- 10శాతమే కోలుకున్నాడు.. చెల్లినీ గుర్తుపట్టడం లేదు: తండ్రి భాస్కర్



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి.. అప్పటి నుంచి కిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎనిమిదేళ్ల బాలుడు శ్రీతేజను మంగళవారం రాత్రి వైద్యులు డిశ్చార్జి చేశారు. బాబుకు ఆస్పత్రిలో అవసరమైన అన్ని చికిత్సలూ పూర్తయ్యాయని.. నోటి ద్వారా ఆహారం తీసుకుంటున్నాడని.. కృత్రిమ ఆక్సిజన్, వెంటిలేటర్ అవసరం లేదని వైద్యులు చేతన్, విష్ణు పేర్కొన్నారు. శ్రీతేజను ఫిజియోథెరపీ కోసం ప్యారడైజ్ సమీపంలోని న్యూరో రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించారు. డిసెంబరు 4న పుష్ప-2 ప్రిమియర్ షో చూసేందుకు తల్లిదండ్రులు, చెల్లితో కలిసి శ్రీతేజ సంధ్య థియేటర్‌కు వచ్చాడు. అక్కడ జరిగిన తొక్కిసలాటలో తల్లి రోహిణి అక్కడిక్కడే మృతిచెందింది. తీవ్రంగా గాయపడి, అపస్మారక స్థితికి చేరుకున్న శ్రీతేజను కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆ ఆస్పత్రిలో బాబు 4 నెలలు 25 రోజుల పాటు చికిత్స పొందాడు. శ్రీతేజ ప్రాణాపాయం నుంచి బయటపడినా పూర్తిగా కోలుకోలేదని కుటుంబసభ్యులు చెప్పారు. బాలుడి ఆరోగ్యం కేవలం 10శాతమే మెరుగుపడిందని తండ్రి భాస్కర్, బాబాయి మల్లికార్జున్ మంగళవారం మీడియా ఎదుట వివరించారు. బాలుడు కళ్లు తెరిచి చూస్తున్నా.. ఎవరినీ గుర్తుపట్టడం లేదని చెప్పారు. ఐసీయూలో ఉన్నప్పుడు శ్రీజ వద్దకు చెల్లి వెళ్లి పలకరించినా, బాబులో స్పందన లేదని తండ్రి భాస్కర్ వాపోయాడు. ఇరవై రోజుల నుంచి శ్రీతేజ ఆరోగ్యం నిలకడగా ఉందని.. రెండు వారాల క్రితం ఐసీయూ నుంచి ప్రత్యేక గదికి తరలించారని చెప్పాడు. ఆస్పత్రిలోనే ఉంటే ఇన్‌ఫెక్షన్లు వస్తాయని, రిహాబిలిటేషన్ సెంటర్‌కు తీసుకుపోతే మంచిదని.. అక్కడ చికిత్సతో మెదడు స్పందించే అవకాశం ఉంటుందని వైద్యులు సూచించారని వెల్లడించారు. బాలుడికి రెండు నెలల పాటు ముక్కు ద్వారా ద్రవాహారం అందించారని, తర్వాత పొట్టకు సర్జరీ చేసి పైపు, ఇతర పరికరాలు అమర్చి ఆహారం అందిస్తున్నారని చెప్పాడు. బాబును ఎలా సంరక్షించుకోవాలి? అనే విషయమ్మీద వైద్యులు, సిబ్బంది తమకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారని చెప్పాడు. శ్రీతేజకు మెరుగైన చికిత్స కోసం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, పుష్ప సినిమా బృందం సహకరించారని చెబుతూ కృతజ్ఞతలు తెలిపాడు.

నాగారం భూదాన్ భూముల అంశంపై.. హైకోర్టులో పలువురు ఐపీఎస్‌ల పిటిషన్లు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): భూదాన్ భూములుగా పేర్కొంటున్న వాటిని నిషేధిత జాబితాలో పెట్టాలన్న ఉత్తర్వులను కొట్టేయాలని మంగళవారం పలువురు ఐపీఎస్‌లు, వారి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషనర్లలో మహేశ్ మురళీధర్ భగవత్, సౌమ్యా మిశ్రా, స్వాతి లక్రా, రవిగుప్తా, తరుణ్‌జోషి, రేణుగోయెల్, బీకే రాహుల్ హెగ్డే, రాహుల్ బుసిరెడ్డి, వీరన్నగారి గౌతమ్‌రెడ్డి, రేఖా షరాఫ్ తదితరులు ఉన్నారు. ఏపీ, తెలంగాణకు చెందిన సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని భూముల రెవెన్యూ రికార్డులను తారుమారు చేయడంతో పాటు ఫోర్జరీ డాక్యుమెంట్లు పెట్టి అక్రమంగా బదిలీ చేసుకున్నారంటూ బిర్ల మల్లేశ్ గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయంలో వారితో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. దీంతో నాగారంలోని 180, 182, 194, 195 తదితర సర్వే నెంబర్లలోని 26 ఎకరాల ప్రభుత్వ భూదాన్ భూముల లావాదేవీలపై స్టే విధించడంతో పాటు నిషేధిత జాబితాలో చేర్చాలని జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం ఈ నెల 24న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ ఉత్తర్వులను కొట్టేయాలని పలువురు ఐపీఎస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు ప్రస్తుతం డివిజన్ బెంచ్‌లో రిట్ అప్పీళ్లు దాఖలు చేశారు. బిర్ల మల్లేశ్ తన వ్యక్తిగత ప్రైవేటు భూవివాదంపై రిట్ పిటిషన్ దాఖలు చేయడం అక్రమమని అధికారులు అప్పీళ్లలో పేర్కొన్నారు. తాము సేల్‌డీడ్ ద్వారా చట్టబద్ధంగా కొనుగోలు చేశామని పిటిషనరే అంగీకరిస్తున్నారని, అలాంటప్పుడు అక్రమమని చెప్పడానికి అవకాశంలేదని తెలిపారు. పిటిషనర్ దురుద్దేశంతో హైకోర్టుకు వచ్చారని, తమ భూములకు, భూదాన్ భూములకు సంబంధం లేదని పేర్కొన్నారు. పిటిషనర్ చేసిన విజ్ఞప్తుల పరిధికి మించి సింగిల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారని, నిషేధిత జాబితాలో పెట్టాలని పిటిషనర్ కోరలేదని తెలిపారు. ఈ రిట్ అప్పీళ్లు బుధవారం విచారణను రానున్నాయి.

రివ్యూ పిటిషన్ తేలేవరకు పదోన్నతులు ఇవ్వొద్దు

- విద్యుత్ సంస్థలకు హైకోర్టు ఆదేశాలు

డివిజన్ బెంచ్‌లో పెండింగ్‌లో ఉన్న రివ్యూ పిటిషన్ తేలే వరకు ఎలాంటి పదోన్నతులు కల్పించరాదని ట్రాన్స్‌స్కో, జెన్కో, ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ విద్యుత్ సంస్థలకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ ఆవిర్భవించిన 2014 జూన్ 2 నుంచి సీనియారిటీని లెక్కించి, ఇప్పటి వరకు ఇచ్చిన పదోన్నతులను సమీక్షించి, తగిన విధంగా పదోన్నతులు కల్పించాలంటూ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, బీసీ, ఓసీ ఉద్యోగుల ఐకాస నాయకులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదిస్తూ సీనియారిటీతో సంబంధం లేకుండా తాత్కాలిక పద్ధతిలో షరతులతో కూడిన పదోన్నతులు ఇస్తున్నారని, ఫలితంగా పలువురు బీసీ, ఓసీ ఉద్యోగులు పదోన్నతులు రాక నష్టపోతున్నారని పేర్కొన్నారు. పదోన్నతులపై ఇప్పటికే రివ్యూ పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున అది తేలేవరకు విద్యుత్ సంస్థల్లో ఎలాంటి ప్రమోషన్లు ఇవ్వరాదని ఉత్తర్వులు జారీ చేసింది.

అజారుద్దీన్ పేరు తొలగింపులో.. తొందరపాటు చర్యలు వద్దు: హైకోర్టు

ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలోని ఉత్తర స్టాండ్‌కు తన పేరును తొలగించడం చెల్లదని పేర్కొంటూ మాజీ క్రికెటర్, హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు అజారుద్దీన్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నార్త్ స్టాండ్‌కు తన పేరు తొలగించాలని ఎథిక్స్ ఆఫీసర్ కం అంబుడ్స్‌మన్(అడిషనల్ ఛార్జి) జస్టిస్ వి. ఈశ్వరయ్య ఇచ్చిన ఆదేశాలను కొట్టేయాలని కోరారు. జస్టిస్ ఈశ్వరయ్యకు అంబుడ్స్‌మన్ అడిషనల్ ఛార్జి ఇవ్వడం చెల్లదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం.. అంబుడ్స్‌మన్, హెచ్‌సీఏ తదితరులకు నోటీసులు జారీ చేస్తూ.. అజారుద్దీన్ పేరు తొలగింపు విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

ఫోన్ ట్యాపింగ్ కేసు.. నెల రోజుల్లో చార్జ్‌షీట్!

బంజారాహిల్స్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో వచ్చే నెలాఖరులోగా కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు దర్యాప్తు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు సేకరించిన సాక్ష్యాధారాలను క్రోడీకరిస్తున్నట్లు తెలిసింది. గతంలో కోర్టు చేసిన ఆక్షేపణలను పరిగణనలోకి తీసుకుని, న్యాయనిపుణుల సలహాలు, సూచనలతో పకడ్బందీగా చార్జ్‌షీట్‌ను రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలోని సిట్‌ను డీసీపీ కార్యాలయానికి తరలించారు. విచారణాధికారి అయిన ఏసీపీ వెంకటగిరిని తాత్కాలికంగా డీసీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

మెట్రో స్టేషన్లు, రైళ్లలో.. బెట్టింగ్ యాప్స్ ప్రచారంపై కట్టడి

హైకోర్టుకు వెల్లడించిన అడ్వొకేట్ జనరల్

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైల్ స్టేషన్లు, రైళ్లపై బెట్టింగ్స్ యాప్స్ ప్రచారం, యాడ్స్ లేకుండా చూసుకుంటున్నామని, వాటిని పూర్తిస్థాయిలో కట్టడిచేస్తామని అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి హైకోర్టుకు వెల్లడించారు. మెట్రోరైళ్లలో బెట్టింగ్ యాప్స్ ప్రచారంపై ఈడీ విచారణకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం(పిల్) విచారణ సందర్భంగా ప్రభుత్వం, మెట్రోరైల్ తరఫున ఏజీ వాదనలను వినిపించారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. ఇకపై ఎలాంటి బెట్టింగ్ యాప్స్ ప్రచారం, ప్రకటనలను స్టేషన్లలో, రైళ్లలో, రైళ్లపై లేకుండా చర్యలు తీసుకుంటామని.. ఈ మేరకు మెమో దాఖలు చేశామని ఏజీ వివరించారు. మెట్రోరైల్‌లో బెట్టింగ్ యాప్స్ ప్రచారం, యాడ్స్ ఉన్నట్లు జీహెచ్‌ఎంసీ నుంచి సమాచారం అందిన వెంటనే.. వాటిని తొలగించాలని ఎల్ అండ్‌టీకి లేఖరాసినట్లు వివరించారు. తాము లేఖ రాసిన వెంటనే ఎల్‌అండ్‌టీ సానుకూలంగా స్పందించిందని.. యాడ్స్‌ను తొలగించిందని పేర్కొన్నారు. ఏజీ వాదనలను విన్న ధర్మాసనం.. తదుపరి విచారణను జూన్‌లో చేపడతామని తెలిపింది.

శాస్త్రవేత్త శైలజకు అరుదైన గుర్తింపు

- తొలి మహిళా డీఎస్‌గా నియమించిన సీఎస్ఐఆర్



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సీఎస్ఐఆర్-ఐఐసీటీ పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ దోనెంపూడికి అరుదైన గుర్తింపు లభించింది. ఆమెను విశిష్ట శాస్త్రవేత్త (డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్-డీ ఎస్) హోదాలో నియమించినట్లు సీఎస్ఐఆర్ మంగళవారం తెలిపింది. ఢిల్లీలోని సీఎస్ఐఆర్ ప్రధాన కార్యాలయంలో ఆమె బిజినెస్ డెవలప్‌మెంట్ గ్రూప్ చీఫ్‌గా వ్యవహరించనున్నారు. ఆమె సోమవారం బాధ్యతలు చేపట్టారు. సీఎస్ఐఆర్ (శాస్త్ర, పారిశ్రామిక పరిశోధనా మండలి) చరిత్రలో ఒక మహిళ డీఎస్‌గా ఎంపిక కావడం ఇదే తొలిసారి కావడం విశేషం. సీఎస్ఐఆర్-ఐఐసీటీ (భారతీయ రసాయన విజ్ఞాన సంస్థ)తో ఆమె అనుబంధం 1993లో మొదలైంది. ఉస్మానియా యూనివర్సిటీలో పాలిమర్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేసిన ఆమె, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి ఎంఎస్సీ, ఎంఫిల్ చేశారు. తన 28 ఏళ్ల కెరీర్‌లో పాలిమర్ సింథసిస్, సాంకేతికత, పరిశోధనలకు తోడ్పాటునందించారు. దీనికి గుర్తింపుగా 1996లో ఆమెకు సీఎస్ఐర్- దాద్ ఫెలోషిష్ లభించింది. జర్మనీలోని కీల్ యూనివర్సిటీలో పరిశోధనలు చేసేందుకు ఈ ఫెలోషిప్ తోడ్పడింది. పాలిమర్ కెమిస్ట్రీలో ఆమె పరిశోధనా ఫలాలు అనే పరిశ్రమలకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఆమె 2017 నుంచి సీఎస్ఐఆర్-ఐఐసీటీలో బిజినెస్ డెవలప్‌మెంట్, రీసెర్చ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతిగా కూడా పనిచేశారు.

ఐపీఎల్‌లో 'బేబీ' తుఫాన్



ఐపీఎల్ ఆరంభమైన మూడేళ్లకు జన్మించిన ఈ పిల్లాడు... ఇప్పుడు లీగ్‌కే ప్రత్యేక ఆకర్షణ అయ్యాడు. పిన్నవయసులోనే మెగా లీగ్ చాన్స్ దక్కడమే అదృష్టం అనుకొంటే.. 14 ఏళ్ల 32 రోజుల వయసులో ఏకంగా రికార్డు సెంచరీతో 'ఐపీఎల్ బేబీ' వైభవ్ సూర్యవంశీ ప్రకంపనలు సృష్టించాడు. అండర్-19, దేశవాళీ క్రికెట్‌లో తనదైన ముద్రవేసిన వైభవ్‌ను మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ రూ. కోటీ 10 లక్షలకు కొనుగోలు చేసింది. రాజస్థాన్ కెప్టెన్ సంజూ శాంసన్ గాయపడడంతో వైభవ్‌కు అరంగేట్రం చేసే అవకాశం దక్కింది. దీన్ని అతడు రెండు చేతులా ఒడిసిపట్టుకొన్నాడు. లీగ్‌లో తాను ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్‌కు తరలించి తన ప్రత్యేకతను చాటుకొన్నాడు. ఇక, గుజరాత్‌తో మ్యాచ్‌లో అయితే ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 35 బంతుల్లోనే సెంచరీ చేయగా.. అందులో 11 సిక్స్‌లు ఉండడం విశేషం. ఈ క్రమంలో ఐపీఎల్‌లో రెండో వేగవంతమైన శతకాన్ని నమోదు చేశాడు. ఎలాంటి బౌలర్ అయినా.. ఏమాత్రం తొణకకుండా పాలబుగ్గల చిన్నోడు సిక్స్‌లు బాదుతుంటే ప్రేక్షకులు మైమరచి చూశారు. చిన్నోడి ఆటకు ముగ్ధుడైన కోచ్ ద్రవిడ్.. వీల్‌చెయిర్‌లోంచి లేచి మరీ అభినందించాడు..

వంద కిలోమీటర్లు ప్రయాణించి..: బిహార్‌లోని సమస్తిపూర్‌కు చెందిన వైభవ్.. క్రికెట్ కోసం ఎంతో శ్రమించాడు. తొమ్మిదేళ్ల వయసులోనే 100 కి.మీ దూరంలోని పట్నాకు వెళ్లి మరీ ప్రాక్టీస్ చేసేవాడు. రోజూ దాదాపు ఆరు వందల బంతులు ఎదుర్కొనేవాడు. దాదాపు నాలుగేళ్లపాటు ఇదే తరహాలో కఠినంగా సాధన చేసినట్టు వైభవ్ చిన్ననాటి కోచ్ మనీశ్ ఓజా చెప్పాడు. సిక్స్‌లు కొట్టగలిగిన సత్తా ఉన్నప్పుడు.. సింగిల్స్ ఎందుకు అని అనేవాడన్నాడు. కొడుకు సక్సెస్ వెనుక వైభవ్ తండ్రి సంజీవ్ పాత్ర ఎంతో ఉంది. వైభవ్‌కు మెరుగైన శిక్షణ ఇప్పించడం కోసం తన పొలాన్ని అమ్మేయడమే కాకుండా నిత్యం కొడుకు వెంటే ఉండేవాడు. ఎక్కడ మ్యాచ్ జరిగినా స్వయంగా తనే తీసుకువెళ్లేవాడు. అయితే, వైభవ్‌లోని ప్రతిభను తొలుత గుర్తించింది వీవీఎస్ లక్ష్మణ్. అండర్-19 కోచ్‌గా అతడి ఆటను విశ్లేషించిన లక్ష్మణ్.. ద్రవిడ్‌కు సిఫార్సు చేశాడు. దీంతో రాజస్థాన్ మరో ఆలోచన లేకుండానే సూర్యవంశీని అతడి కనీస ధర రూ. 30 లక్షలకు నాలుగు రెట్లు అదనంగా చెల్లించి మరీ సొంతం చేసుకొంది. చిన్నవయసులోనే మితిమీరిన పాపులారిటీ రావడంతో.. సరైన మార్గదర్శనం లేక పృథ్వీ షా లాంటి ఆటగాళ్లు పక్కదారి పట్టారు. వైభవ్ అలా కాకూడదనే ఉద్దేశంతో అతడి భవిష్యత్‌ను తీర్చిదిద్దే బాధ్యతను ద్రవిడ్ తీసుకొన్నాడు.

వయసు తప్పు అంటూ..: ఐపీఎల్‌లో వేలంలో వైభవ్ ను రాజస్థాన్ కొనుగోలు చేయగానే అతడి వయసుపై చర్చ రేగింది. సూర్యవంశీ జనన ధ్రువీకరణకు సంబంధించిన అవకతవకలకు పాల్పడ్డాడంటూ నెట్‌లో పుకార్లు హల్‌చల్ చేశాయి. కొందరైతే వైభవ్‌కు 15 ఏళ్లు అని కూడా ఆరోపించారు. '13 ఏళ్ల బాలుడు ఎక్కడైనా ఇలా సిక్స్ కొట్టగలడా?' అని వీడియోను పోస్టు చేసిన పాకిస్థాన్ మాజీ పేసర్ జునైద్ ఖాన్ సందేహం వ్యక్తం చేశాడు. అయితే, వీటిని అతడి తండ్రి సంజీవ్ తిప్పికొట్టాడు. 'ఎనిమిదిన్నర ఏళ్ల వయసులో బీసీసీఐ నిర్వహించిన బోన్ టెస్ట్‌కు హాజరయ్యాడు. ఆ తర్వాత అండర్-19, దేశవాళీ క్రికెట్ ఆడాడు. మాకెలాంటి భయమూ లేదు. ఎలాంటి పరీక్షకైనా సిద్ధమేనని అన్నాడు. (ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

అమ్మ మూడు గంటలే నిద్రపోయేది



'నేను సాధించిన ప్రతి విజయం వెనుక నా తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉంది. నా కోసం అమ్మ తెల్లవారు జామున 2 గంటలకే లేచి వంట చేసేది. మళ్లీ రాత్రి 11 గంటలకు నిద్రపోయేది. కేవలం మూడు గంటలే ఆమెకు నిద్ర. నా కోసం నాన్న ఉద్యోగాన్ని వదిలేయడంతో.. అన్నయ్య పనిచేయాల్సిన పరిస్థితి. ఆర్థికంగా చాలా కష్టాలు పడ్డాం. అయితే, నాన్న మాత్రం ఎప్పుడూ ధైర్యం చెబుతూ నన్ను నడిపించేవారు.'

- వైభవ్ సూర్యవంశీ

ఆరేళ్లప్పుడు ఐపీఎల్ చూస్తూ..



14 ఏళ్ల వైభవ్ ఆరేళ్ల వయస్సులో అప్పటి ఐపీఎల్ జట్టు రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న ఫొటో ఒకటి నెట్‌లో వైరల్ అయ్యింది. ఈ ఫొటోను లఖ్‌నవూ జట్టు యజమాని సంజీవ్ గోయెంకా ఎక్స్‌లో షేర్ చేశాడు. 'గత రాత్రి అతడి ఇన్నింగ్స్‌ను ఆశ్చర్యంతో వీక్షించా. ఈ ఉదయం 6 ఏళ్ల వైభవ్ 2017లో మా జట్టే అయిన రైజింగ్ పుణెకు మద్దతుగా మ్యాచ్‌ను వీక్షించిన ఫొటో చూశా. థ్యాంక్యూ వైభవ్. నీకు నా శుభాకాంక్షలు' అని తెలిపాడు.

నరైన్ తిప్పేశాడు

- ఆల్‌రౌండ్‌షోతో అదుర్స్
- ఢిల్లీపై కోల్‌కతా విజయం
- రేసులోనే నైట్‌రైడర్స్
- పోరాడిన డుప్లెసి, అక్షర్



సునీల్ నరైన్ (3/29)

న్యూఢిల్లీ: వరుస విజయాలతో జోరు చూపించిన ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్స్ ముంగిట తడబడుతోంది. గత నాలుగు మ్యాచ్‌ల్లో మూడింటిని కోల్పోగా.. అటు చావో రేవో తేల్చుకోవాల్సిన స్థితిలో కోల్‌కతా నైట్‌రైడర్స్ అద్భుత ప్రదర్శన కనబర్చింది. డుప్లెసి (62), అక్షర్ (43)ల పోరాటంతో గెలుపు దిశగా సాగుతున్న ఢిల్లీని స్పిన్నర్ సునీల్ నరైన్ (3/29) తన మ్యాజిక్ బంతులతో వెనక్కిలాగాడు. దీంతో 14 పరుగుల తేడాతో నైట్‌రైడర్స్ నెగ్గింది. 9 పాయింట్లతో ప్లేఆఫ్ ఆశలను సజీవంగానే ఉంచుకుంది. ముందుగా కోల్‌కతా 20 ఓవర్లలో 9 వికెట్లకు 204 పరుగులు చేసింది. రఘువంశీ (44), రింకూ సింగ్ (36), నరైన్ (27) రాణించారు. స్టార్క్‌కు 3.. అక్షర్, విప్రజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్లకు 190 పరుగులు చేసి ఓడింది. చివర్లో విప్రజ్ నిగమ్ (38) ఆకట్టుకున్నాడు. వరుణ్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నరైన్ నిలిచాడు.

స్పిన్నర్ల హవా: భారీ ఛేదనలో ఢిల్లీకి తొలి ఓవర్‌లోనే ఝలక్ తగిలింది. ఫామ్‌లో ఉన్న అభిషేక్ పోరెల్ (4)ను స్పిన్నర్ అనుకూల్ అవుట్ చేయగా, కాసేపటికే కరుణ్ నాయర్ (15), కేఎల్ రాహుల్ (7) వెనుదిరగడంతో ఢిల్లీ 60 పరుగులకు 3 వికెట్లు కోల్పోయింది. అయితే డుప్లెసి ఒంటరి పోరాటానికి కెప్టెన్ అక్షర్ సహకారం తోడవ్వడంతో రన్‌రేట్ పదికి తగ్గకుండా సాగింది. తొమ్మిదో ఓవర్‌లో డుప్లెసి 4,4,6తో 16 రన్స్ అందించాడు. 13వ ఓవర్‌లో స్కోరు 130కి చేరింది. ఈ దశలో జట్టు గెలుపు ఖాయమనిపించినా నరైన్ గట్టి దెబ్బతీశాడు. 14వ ఓవర్‌లో అతడు అక్షర్‌ను అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. దీనికి తోడు ఆరో బంతికి హిట్టర్ స్టబ్స్ (1)ను బౌల్డ్ చేయడంతో ఢిల్లీ షాక్‌కు గురైంది. ఇక 31 బంతుల్లో ఫిఫ్టీతో జోరు మీదున్న డుప్లెసిని తన తర్వాతి ఓవర్‌లోనే నరైన్ అవుట్ చేయడంతో మ్యాచ్ కోల్‌కతా వైపు తిరిగింది. పైగా 18వ ఓవర్‌లో అశుతోష్ (7), స్టార్క్ (0)లను స్పిన్నర్ వరుణ్ అవుట్ చేయడంతో ఫలితం తేలిపోయింది. చివర్లో విప్రజ్ వేగంగా ఆడడం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగింది.

చివర్లో తడబడ్డారు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా ఇన్నింగ్స్ టాప్‌గేర్‌లో సాగినా.. చివర్లో అదుపు తప్పింది. ఆఖరి ఐదు ఓవర్లలో 45 పరుగులే చేసి 5 వికెట్లు కోల్పోయిన జట్టు కష్టంగా 200 దాటింది. రఘువంశీ, రింకూ సింగ్ మాత్రం ఎదురుదాడికి ప్రయత్నించి ఐదో వికెట్‌కు 61 పరుగులు జోడించారు. అంతకుముందు ఓపెనర్లు నరైన్, గుర్బాజ్ (26) అదిరే ఆరంభాన్ని అందించారు. తొలి ఓవర్‌లో గుర్బాజ్ రెండు ఫోర్లు సాధించగా.. రెండో ఓవర్‌లో నరైన్ 6,4,6,4తో 25 పరుగులు రాబట్టాడు. ఇక తర్వాతి ఓవర్‌లోనే గుర్బాజ్ 4,4,6తో ధాటిని చూపి ఆరో బంతికి వెనుదిరిగాడు. అయినా తొలి వికెట్‌కు 18 బంతుల్లోనే 48 పరుగులు సమకూరాయి. ఆ వెంటనే కెప్టెన్ రహానె (26) బౌండరీల జోరుతో పవర్‌ప్లేలో జట్టు 79/1 స్కోరుతో పటిష్టంగా కనిపించింది. కానీ ఆ తర్వాత వరుస ఓవర్లలో నరైన్, రహానె వికెట్లు కోల్పోవడంతో స్కోరు 91/4కి చేరింది. కానీ రఘువంశీ రెండు సిక్సర్లతో తొమ్మిదో ఓవర్‌లో స్కోరు వందకి చేరుకుంది. వెంకటేశ్ అయ్యర్ (7) విఫలం కాగా స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్ పరుగులను నియంత్రించారు. ఈ దశలో 15వ ఓవర్‌లో రింకూ 4,6,4తో 17 రన్స్ రాబట్టడంతో కాస్త కోలుకుంది. వీరి ధాటికి స్కోరు 220కి చేరుతుందనిపించింది. అయితే ఢిల్లీ బౌలర్లు ఈ ఇద్దరినీ వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చడంతో తడబాటు ఆరంభమైంది. ఆఖరి ఓవర్‌లో తొమ్మిది పరుగులకే కేకేఆర్ మూడు వికెట్లు కోల్పోయింది. తొలి బంతికి రస్సెల్ సిక్సర్‌తో స్కోరు 200 దాటినా.. ఆ తర్వాత స్టార్క్ వరుస బంతుల్లో రెండు వికెట్లు తీయగా రస్సెల్ (17) రనౌటయ్యాడు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	10	7	3	0	14	0.521
ముంబై	10	6	4	0	12	0.889
గుజరాత్	9	6	3	0	12	0.748
ఢిల్లీ	10	6	4	0	12	0.362
పంజాబ్	9	5	3	1	11	0.177
లఖ్‌నవూ	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	10	4	5	1	9	0.271
రాజస్థాన్	10	3	7	0	6	-0.349
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
చెన్నై	9	2	7	0	4	-1.302

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

కోల్‌కతా: గుర్బాజ్ (సి) పోరెల్ (బి) స్టార్క్ 26, నరైన్ (ఎల్బీ) విప్రజ్ 27, రహానె (ఎల్బీ) అక్షర్ 26, రఘువంశీ (సి) నాయర్ (బి) చమీర 44, వెంకటేశ్ (సి) విప్రజ్ (బి) అక్షర్ 7, రింకూ (సి) స్టార్క్ (బి) విప్రజ్ 36, రస్సెల్ (రనౌట్) 17, పావెల్ (ఎల్బీ) స్టార్క్ 5, అనుకూల్ (సి) చమీర (బి) స్టార్క్ 0, హర్షిత్ (నాటౌట్) 0, వరుణ్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 204/9; వికెట్ల పతనం:** 1-48, 2-85, 3-91, 4-113, 5-174, 6-177, 7-203, 8-203, 9-203; **బౌలింగ్:** స్టార్క్ 4-0-43-3, చమీర 3-0-46-1, ముకేశ్ 2-0-17-0, విప్రజ్ 4-0-41-2, అక్షర్ 4-0-27-2, కుల్దీప్ 3-0-27-0.

ఢిల్లీ: అభిషేక్ పోరెల్ (సి) రస్సెల్ (బి) అనుకూల్ 4, డుప్లెసి (సి) రింకూ (బి) నరైన్ 62, కరుణ్ నాయర్ (ఎల్బీ) వైభవ్ అరోరా 15, కేఎల్ రాహుల్ (రనౌట్) 7, అక్షర్ (సి) హర్షిత్ (బి) నరైన్ 43, స్టబ్స్ (బి) నరైన్ 1, విప్రజ్ (బి) రస్సెల్ 38, అశుతోష్ (సి) నరైన్ (బి) వరుణ్ 7, స్టార్క్ (సి) గుర్బాజ్ (బి) వరుణ్ 0, చమీర (నాటౌట్) 2, కుల్దీప్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 190/9; వికెట్ల పతనం:** 1-4, 2-43, 3-60, 4-136, 5-138, 6-146, 7-160, 8-160, 9-189; **బౌలింగ్:** అనుకూల్ 4-0-27-1, వైభవ్ 2-0-19-1, హర్షిత్ రాణా 4-0-49-0, వరుణ్ 4-0-39-2, నరైన్ 4-0-29-3, రస్సెల్ 2-0-22-1.

నేటి మ్యాచ్

వేదిక	చెన్నై
చెన్నై x పంజాబ్	రా.7.30 నుంచి

భారత్‌దే రెండో వన్డే

దక్షిణాఫ్రికా ఓటమి ● మహిళల ముక్కోణపు సిరీస్



స్నేహ్ రాణా (5/43)

కొలంబో: మహిళల ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత జట్టుకు రెండో విజయం దక్కింది. మంగళవారం దక్షిణాఫ్రికాతో జరిగిన ఈ మ్యాచ్‌లోనూ ఓపెనర్ ప్రతికా రావల్ (78) తన జోరును కొనసాగించడంతో పాటు, మహిళల వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 500 రన్స్ (8 ఇన్నింగ్స్) పూర్తి చేసిన బ్యాటర్‌గానూ నిలిచింది. ఇక బౌలింగ్‌లో స్నేహ్ రాణా (5/43) సఫారీల వెన్నువిరవడంతో భారత్ 15 పరుగులతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 276/6 స్కోరు సాధించింది. హర్మన్ (41), జెమీమా (41), మంధాన (36) రాణించారు. ఛేదనలో దక్షిణాఫ్రికా పోరాడినా చివర్లో తడబడింది. దీంతో 49.2 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌటైంది. తజ్మిన్ బ్రిట్స్ (109) శతకం వృథా అయ్యింది. వోల్వార్ట్ (43), డెరెక్సెన్ (30) ఫర్వాలేదనిపించారు.

నాకౌట్ ఆశలు ఆవిరి

- ఇండోనేసియా చేతిలో భారత్ ఓటమి
- సుదీర్మన్ కప్ ఫైనల్స్

గ్జియామెన్ (చైనా): సుదీర్మన్ కప్ ఫైనల్స్‌లో నాకౌట్ ఆశలు సజీవంగా ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన పోరులో భారత బ్యాడ్మింటన్ జట్టు నిరాశపరిచింది. గ్రూప్-డిలో భాగంగా మంగళవారం జరిగిన తమ రెండో పోరులో భారత్ 1-4తో పటిష్ట ఇండోనేసియా చేతిలో ఓటమిపాలైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల/తనీషా జోడీ మాత్రమే గెలవగా.. సింగిల్స్‌లో స్టార్లు పీవీ సింధు, ప్రణయ్, మహిళల డబుల్స్‌లో ప్రియ/శ్రుతి, పురుషుల డబుల్స్‌లో హరిహరన్/రూబన్ జంటలు ఓటవిపాలయ్యారు. దీంతో క్వార్టర్స్ చేరకుండానే భారత జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆదివారం జరిగిన తమ తొలి పోరులో డెన్మార్క్ చేతిలో భారత్ ఓడిన సంగతి తెలిసిందే. దీంతో గ్రూప్‌లో తమకు ఆఖరిదైన ఇంగ్లండ్‌తో పోరు భారత్‌కు నామమాత్రం కానుంది.

ఇంగ్లండ్ మహిళల కెప్టెన్‌గా బ్రంట్



లండన్: ఇంగ్లండ్ మహిళల క్రికెట్ కెప్టెన్‌గా ఆల్‌రౌండర్ నాట్ సివర్ బ్రంట్ ఎంపికైంది. హీథర్‌నైట్ స్థానంలో వచ్చిన బ్రంట్ అన్ని ఫార్మాట్లలో సారథ్యం వహిస్తుంది. బ్రంట్ గత మూడేళ్లుగా ఇంగ్లండ్‌కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తోంది.

బిజినెస్

మార్కెట్లోకి బజాజ్ చేతక్ 3503

ధర రూ.1.10 లక్షలు



పుణె: బజాజ్ ఆటో.. తన చేతక్ ఈ-స్కూటర్స్ సిరీస్‌లో మరో కొత్త వేరియంట్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. 'చేతక్ 3503' పేరుతో తీసుకువచ్చిన ఈ స్కూటర్ ధర రూ.1.10 లక్షలు (ఎక్స్‌షోరూమ్). 3.5 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో కూడిన ఈ వాహనం ఒకసారి చార్జింగ్‌తో 151 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది.

దీర్ఘకాలిక పెట్టుబడులకు మన మార్కెట్ భేష్

సెబీ చీఫ్ తుహిన్ కాంత పాండే



ముంబై: అంతర్జాతీయంగా కొన్ని ఆటుపోట్లు ఉన్నా భారత స్టాక్ మార్కెట్ బాగానే ఉందని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఛైర్మన్ తుహిన్ కాంత పాండే అన్నారు. ట్రంప్ సుంకాలతో భారీగా నష్టపోయిన దేశీయ స్టాక్ మార్కెట్ ఇప్పటికే ఆ నష్టాల నుంచి పూర్తిగా బయట పడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మన ఆర్థిక పునాదులు బలంగా ఉండడమే ఇందుకు కారణమన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రిటైల్ మదుపరులు దీర్ఘకాలిక లాభాల కోసం దేశీయ స్టాక్ మార్కెట్లో పూర్తి భరోసాతో పెట్టుబడులు పెట్టవచ్చన్నారు. అయితే నష్టభయం ఎక్కువగా ఉండే ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్‌కు మాత్రం రిటైల్ మదుపరులు దూరంగా ఉండాలని కోరారు. తీవ్ర స్పెక్యులేషన్‌తో కూడిన ఎఫ్ అండ్ ఓలో మదుపు చేయడం అంటే జూదం ఆడడం తప్ప మరోటి కాదన్నారు. అలాగే చెప్పుడు మాటలు విని కూడా మార్కెట్లో పెట్టుబడులు పెట్టవద్దన్నారు. పూర్తి అవగాహన, సమాచారం, తెలివితోనే రిటైల్ మదుపరులు షేర్ల అమ్మకాలు, కొనుగోళ్లు జరపాలని పాండే సూచించారు.

ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఎండీ, సీఈఓ సుమంత్ రాజీనామా

డిప్యూటీ సీఈఓ అరుణ్ కూడా

అకౌంటింగ్ వైఫల్యాల నేపథ్యంలోనే..

న్యూఢిల్లీ: ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో అకౌంటింగ్ వైఫల్యాలు బయటపడిన నేపథ్యంలో ఆ బ్యాంక్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సుమంత్ కత్పాలియా రాజీనామా చేశారు. సుమంత్ పాటు డిప్యూటీ సీఈఓ అరుణ్ ఖురానా కూడా తన పదవికి రాజీనామా సమర్పించారు. ఖురానా సోమవారమే తన రాజీనామాను బ్యాంక్ బోర్డుకు పంపించారు. ఈ ఇద్దరు అధికారుల రాజీనామాలు తక్షణమే అమల్లోకి వస్తాయని రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సందేశంలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ వెల్లడించింది. అకౌంటింగ్‌లో జరిగిన లోపాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వాటికి బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నానని, మంగళవారం పని గంటలు పూర్తయిన సమయం నుంచి తన రాజీనామాను పరిగణనలోకి తీసుకోవాలని బ్యాంకు బోర్డుకు రాసిన లేఖలో సుమంత్ తెలిపారు. మరోవైపు బ్యాంకులోని అంతర్గత డెరివేటివ్స్ విభాగంలో చోటు చేసుకున్న దురదృష్టకర పరిణామాల నేపథ్యంలో ట్రెజరీ ఫ్రంట్ ఆఫీస్ కార్యకలాపాలకు బాధ్యుడైన తాను రాజీనామా చేస్తున్నట్టు అరుణ్ తెలిపారు.

డెరివేటివ్ పోర్టుఫోలియోలో అకౌంటింగ్ లోపాల కారణంగా బ్యాంక్ రూ.1,979 కోట్ల మేర నష్టపోయిన సంగతి తెలిసిందే. బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాజీనామా చేసిన నేపథ్యంలో కొత్త ఎండీ, సీఈఓ నియామకం జరిగే వరకు ఆయన బాధ్యతల నిర్వహణ కోసం "ఎగ్జిక్యూటివ్‌ల కమిటీ" ఏర్పాటుకు అనుమతించాలని కోరుతూ బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి లేఖ రాసింది.

బీపీసీఎల్ లాభంలో 24% క్షీణత

న్యూఢిల్లీ: భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్).. 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జనవరి-మార్చి త్రైమాసికానికి గాను స్టాండ్‌ఎలోన్ నికర లాభం 24 శాతం క్షీణించి రూ.3,214.06 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం లాభం రూ.4,224.18 కోట్లుగా ఉంది. రిఫైనింగ్ మార్జిన్లు తగ్గటం. సబ్సిడీ వంటగ్యాస్ (ఎల్‌పీజీ) విక్రయాలపై నష్టాలు కంపెనీ పనితీరును దెబ్బతీశాయి. మరోవైపు మార్చి త్రైమాసికంలో ఆదాయం కూడా 4 శాతం తగ్గి రూ. 1.26 లక్షల కోట్లకు పడిపోయింది. ఆర్థిక సంవత్సరం మొత్తానికి నికర లాభం సగానికి పైగా తగ్గి రూ.13,275.26 కోట్లుగా ఉండగా మొత్తం ఆదాయం రూ.5 లక్షల కోట్లుగా నమోదైంది. కాగా ఒక్కో షేరుకు రూ. 5 తుది డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. గతంలో చెల్లించిన రూ. 5 మధ్యంతర డివిడెండ్‌కు ఇది అదనం.

బజాజ్ ఫైనాన్స్ 4:1 బోనస్ షేర్ల జారీ

క్యూ4 లాభం రూ.3,940 కోట్లు.. ఒక్కో షేరుపై రూ.44 డివిడెండ్

న్యూఢిల్లీ: గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికానికి (క్యూ4) బజాజ్ ఫైనాన్స్ రూ.3,940 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది 16 శాతం ఎక్కువ. ఇదే సమయంలో ఆదాయం రూ.12,764 కోట్ల నుంచి రూ.15,808 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ.11,201 కోట్ల నుంచి రూ.13,824 కోట్లకు చేరింది.

వాటాదారులకు బొనాంజా: ఆర్థిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో కంపెనీ వాటాదారులకూ తీపికబురు చెప్పింది. ఒక్కోటి రూ.2 ముఖ విలువ ఉన్న కంపెనీ షేర్లపై రూ.44 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. దీంతో పాటు రూ.12 ప్రత్యేక డివిడెండ్‌ను కంపెనీ అందించనుంది. అలాగే ఒక్కోటి రూ.2 ముఖ విలువతో కూడిన షేరును రూ.1 ముఖ విలువతో కూడిన రెండు షేర్లుగా విభజించేందుకు ఆమోదం తెలిపింది. మళ్లీ ఈ రూ.1 ముఖ విలువ ఉండే ఒక్కో షేరుకు నాలుగు చొప్పున (4:1) బోనస్ షేర్లు జారీ చేసేందుకూ బజాజ్ ఫైనాన్స్ బోర్డు ఆమోదం తెలిపింది.

స్వల్ప లాభంతో సరి

సెన్సెక్స్ 70 పాయింట్లు అప్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా రెండో రోజు లాభపడ్డాయి. మంగళవారం ఆరంభ ట్రేడింగ్‌లో 442 పాయింట్లకు పైగా పుంజుకున్న సెన్సెక్స్.. చివరి వరకు అదే జోరును కొనసాగించలేకపోయింది. రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనైనప్పటికీ, 70.01 పాయింట్ల స్వల్ప లాభంతో 80,288.38 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 7.45 పాయింట్ల పెరుగుదలతో 24,335.95 వద్ద ముగిసింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. అయితే, రిలయన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్లతో పాటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 13 మాత్రమే రాణించాయి. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) షేరు 2.32 శాతం లాభంతో 4 నెలల గరిష్ఠానికి చేరడంతో పాటు వరుసగా రెండో రోజు సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. కాగా, బీఎస్ఈలోని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.23 శాతం వరకు పెరిగాయి. రంగాల వారీ సూచీల్లో ఐటీ, ఫోకస్డ్ ఐటీ సూచీలు మాత్రం ఒక శాతానికి పైగా పెరిగాయి.

- ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర రూ.1,050 పెరిగి రూ.99,450కి చేరగా.. సిల్వర్ రూ.3,500 పెరుగుదలతో రూ.1.02 లక్షలకు ఎగబాకింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 3,311 డాలర్లు, సిల్వర్ 33.28 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

ఐపీఓకు కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్

కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కూడా తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు(డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు కలిసి 23.75 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. అందులో కెనరా బ్యాంక్ 13.77 కోట్ల షేర్లు, హెచ్ఎస్‌బీసీ ఇన్సూరెన్స్ (ఏషియా పసిఫిక్) హోల్డింగ్స్ 47.5 లక్షల షేర్లు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 9.5 కోట్ల షేర్లను అమ్మకానికి పెట్టనున్నాయి. కొద్ది రోజుల క్రితమే కెనరా రొబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కూడా ఐపీఓకు వచ్చేందుకు సెబీకి పత్రాలు సమర్పించింది.

- ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్ రూ.2,000 కోట్ల ఐపీఓ ప్రతిపాదనకు సెబీ ఆమోదం లభించింది. కాగా, ఏథర్ ఎనర్జీ ఇష్యూకు రెండో రోజు నాటికి 28 శాతం బిడ్లు లభించాయి.

అజాద్ ఇంజనీరింగ్ కొత్త యూనిట్ షురూ

అజాద్ ఇంజనీరింగ్ హైదరాబాద్ సమీపంలోని తునికి బొల్లారంలో అధునాతన ఉత్పత్తి యూనిట్‌ను ప్రారంభించింది. వైమానిక, రక్షణ, ఇంధన, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలకు అవసరమైన ప్రెసిషన్ ఇంజనీరింగ్ పరికరాలను కంపెనీ ఈ యూనిట్‌లో తయారు చేయనుంది. ఏటా లక్ష బ్లేడ్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ యూనిట్ ఏర్పాటు చేసినట్టు ఛైర్మన్, సీఈఓ రాకేశ్ చోప్దార్ తెలిపారు.



విశాక ఇండస్ట్రీస్ లిమిటెడ్.. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో 2 మెగావాట్ల సమీకృత వీవీ ఆటమ్ సోలార్ రూఫ్, ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. రాయ్‌బరేలీ ఎంపీ రాహుల్ గాంధీ వీటిని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎంఎల్ఏ వివేక్, బీఆర్ అంబేడ్కర్ ఇనిస్టిట్యూషన్స్ కరస్పాండెంట్ సరోజ గడ్డం, పెద్దపల్లి ఎంపీ వంశీ గడ్డం పాల్గొన్నారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	125	విజయవాడ	127
వరంగల్	125	గుంటూరు	125
కరీంనగర్	125	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	85
కర్నూలు	125	నెల్లూరు	90
విశాఖపట్నం	121	అనంతపురం	90
గోదావరి	127		


బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,970 ▲	89,800 ▲	1,11,000 ▲
విజయవాడ	99,000 ▲	93,000 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	98,860 ▲	89,800 ▲	1,11,000 ▲
రాజమండ్రి	97,960 ▲	89,800 ▲	99,300 ▲
ప్రొద్దుటూరు	97,500 ▲	89,700 ▼	99,000 ▼
ముంబై	96,011 ▲	87,946 ▲	97,390 ▲

టాటా ఏఐజీ 'మెడికేర్ సెలెక్ట్' పాలసీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్.. కొత్త రిటైల్ ఆరోగ్య బీమా పాలసీ 'మెడికేర్ సెలెక్ట్'ను విడుదల చేసింది. రిటైల్ హెల్త్ పోర్టుఫోలియోతో పాటు బీమా వ్యాపారాన్ని మరింత పటిష్ఠం చేసుకునే లక్ష్యంతో ఈ పాలసీని తీసుకువచ్చినట్లు టాటా ఏఐజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ప్రతీక్ గుప్తా తెలిపారు. ఎలాంటి ఎంట్రీ వయసు లేకుండా, అందుబాటు ధరల్లో ఉండే ప్రీమియంతో ఈ సమగ్ర ఆరోగ్య బీమా పాలసీని రూపొందించినట్లు ఆయన చెప్పారు. ఎలాంటి వయోపరిమితులు లేకుండా ఈ పాలసీని అందరికీ ఆఫర్ చేస్తున్నట్లు గుప్తా పేర్కొన్నారు. టాటా ఏఐజీకి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కీలక మార్కెట్లుగా ఉన్నాయని, గత ఏడాది కాలంలో కంపెనీ రిటైల్ హెల్త్ విభాగం ఇక్కడ మూడింతల వృద్ధిని నమోదు చేసిందని ఆయన చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో 1,600కు పైగా హాస్పిటల్స్ నెట్‌వర్క్‌తో పాటు 14,000 మంది అడ్వైజర్లను టాటా ఏఐజీ కలిగి ఉందన్నారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరుల్లో టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కార్యాలయాలను కలిగి ఉంది. గడిచిన రెండేళ్లలో టాటా ఏఐజీ.. తెలుగు రాష్ట్రాల్లో తన మార్కెట్ వాటాను 2.1 శాతం నుంచి 3.6 శాతానికి పెంచుకుందని కంపెనీ హెడ్ (యాక్సిడెంట్, హెల్త్ క్లెయిమ్స్) రుద్రరాజు రాజగోపాల్ తెలిపారు. సమీప భవిష్యత్‌లో దీన్ని 5 శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు.


ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	425	విజయవాడ	440
వరంగల్	427	గోదావరి	425
చిత్తూరు	493	విశాఖపట్నం	435
		దజను గుడ్లు రూ. 60	

జోస్ అలుక్కాస్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు

హైదరాబాద్: అక్షయ తృతీయను పురస్కరించుకుని జోస్ అలుక్కాస్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని కస్టమర్లకు ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా రూ.75,000 లేదా అంతకు పైబడిన బంగారు ఆభరణాలు కొనుగోలు చేసిన వినియోగదారులకు ఉచితంగా బంగారు నాణేన్ని అందిస్తున్నట్లు జోస్ అలుక్కాస్ ప్రకటించింది. అంతేకాకుండా వజ్రాభరణాలను కొనుగోలు చేసే వారికి ప్రతి క్యారట్‌పై రూ.15,000 ఫ్లాట్ డిస్కౌంట్‌ను అందిస్తోంది. దీంతో పాటుగా ప్రతి క్యారట్‌కు ఉచితంగా 500 మిల్లీగ్రాముల బంగారు నాణేన్ని కాంప్లిమెంటరీగా ఇస్తోంది. అలాగే ప్లాటినం ఆభరణాలపై 15 శాతం వరకు తరుగు చార్జీలను తగ్గిస్తున్నట్లు జోస్ అలుక్కాస్ వెల్లడించింది. బంగారు ఆభరణాల మేకింగ్ చార్జీల్లో 30 శాతం వరకు రాయితీని అందిస్తోంది. వెండి ఆభరణాలు తరుగు చార్జీలు లేకుండా లభిస్తాయని తెలిపింది. దీంతో పాటు తమ పాత బంగారాన్ని హెచ్‌యూఐడీ ధృవీకరణ కలిగిన ఆభరణాలతో మార్పిడి చేసుకోవాలనుకునే వినియోగదారులకు ప్రత్యేక ఎక్స్ఛేంజ్ లాభాలను ఆఫర్ చేస్తున్నట్లు జోస్ అలుక్కాస్ వెల్లడించింది.



కాంగ్రెస్ మంగళవారం తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేసిన పోస్టర్



బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్పీ సింగ్ పోస్టు చేసిన ఫొటో

కాంగ్రెస్, బీజేపీ 'పోస్టర్' వార్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్ర దాడిపై కాంగ్రెస్, బీజేపీ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు పతాకస్థాయికి చేరాయి. మంగళవారం పోస్టర్ యుద్ధానికి దిగాయి. పసుపు రంగు కుర్తా పైజామా, నల్లటి బూట్లు ధరించిన ప్రధాని చిత్రాన్ని తల లేకుండా కాంగ్రెస్ సోమవారం రాత్రి 'ఎక్స్'లో పోస్టుచేసింది. దాని కింద 'బాధ్యత వహించాల్సిన సమయంలో మాయమయ్యారు' అనే సందేశం పెట్టింది. దీనిని పాకిస్థాన్ మాజీ మంత్రి ఫవాద్ చౌదరి రీట్వీట్ చేయడంతో బీజేపీ మంగళవారం.. కాంగ్రెస్‌పై విరుచుకుపడింది. రాహుల్‌గాంధీ పాకిస్థాన్ మిత్రుడంటూ బీజేపీ అధికార ప్రతినిధి ఆర్పీ సింగ్ ట్వీట్ చేయడమేగాక.. వీపు వెనుక కత్తి దాచుకుని ఉన్న రాహుల్ చిత్రాన్ని పోస్టు చేశారు. పహల్గాం ఉగ్ర ఘటన తర్వాత కేంద్రం ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశంలో ప్రధాని పాల్గొనకపోవడంపై కాంగ్రెస్ తరచూ విమర్శలు చేస్తోంది. ఆ క్రమంలోనే తాజా పోస్టర్‌ను పోస్టు చేసింది. దీనిపై బీజేపీ తీవ్రస్థాయిలో స్పందించింది. కాంగ్రెస్ సంపూర్ణంగా పాకిస్థాన్‌కు మద్దతిస్తోందని.. ఆ పార్టీని 'లష్కరే పాకిస్థాన్ కాంగ్రెస్'గా అభివర్ణించింది. అఖిల పక్ష సమావేశంలో ఐక్యత గురించి ఆ పార్టీ నొక్కిచెప్పిందని.. కానీ ఆ పార్టీ నేతలు పాక్‌తో చర్చలు జరపాలంటున్నారని ఆక్షేపించింది. 'తలలేని మొండెం'.. ఆ పార్టీ ఉగ్ర సిద్ధాంతంగా మారిందని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మీడియా సమావేశంలో ధ్వజమెత్తారు. 'తలలేని ప్రధాని చిత్రాన్ని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా పోస్టు చేసింది. తద్వారా భారత్‌లో మీర్ జాఫర్ మద్దతుదారులున్నారని పాకిస్థాన్‌కు గట్టి సందేశం పంపింది. రాహుల్‌గాంధీ ఆదేశాలతోనే ఆ పోస్టు పెట్టారు. దీనిని చూసి దేశం సిగ్గుపడుతోంది. క్లిష్ట సమయంలో భారత్‌ను బలహీనపరిచేందుకు లష్కరే పాకిస్థాన్ కాంగ్రెస్ చేసిన ప్రయత్నమిది' అని విమర్శించారు. తలలేని మొండెం ఉగ్రవాద నినాదమని.. ఆ పార్టీ పోస్టర్ దానినే ప్రతిబింబిస్తోందన్నారు. ముస్లిం ఓటు బ్యాంకును సంతృప్తిపరచడానికే కాంగ్రెస్ తలలేని మొండెం చిత్రాన్ని పోస్టుచేసిందని బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి అమిత్ మాలవీయ 'ఎక్స్'లో ఆరోపించారు. ఈ వివాదంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందించారు. "పార్లమెంటు చర్చల్లో ప్రధాని పాల్గొని పహల్గాం ఘటన తదనంతర పరిణామాలపై వివరణ ఇవ్వాలని కోరాం. ఇందులో రాజకీయ ఎజెండా ఏమీ లేదు. ఐక్యతే కాంగ్రెస్ ఫార్ములా' అని స్పష్టం చేశారు.

పోస్టరు తొలగింపు..

తీవ్ర రాజకీయ దుమారం దరిమిలా 'తలలేని ప్రధాని' పోస్టర్‌ను 'ఎక్స్'నుంచి కాంగ్రెస్ పార్టీ తొలగించింది. ఈ పోస్టర్‌పై కాంగ్రెస్ నాయకుల్లోనే విభేదాలు తలెత్తినట్లు సమాచారం. పార్టీ వైఖరికి భిన్నమైన పోస్టరుకు అనుమతించినందుకు పార్టీ సోషల్ మీడియా విభాగం సారథి సుప్రియ శ్రీనతేను కాంగ్రెస్ అధిష్ఠానం మందలించిందని, తక్షణం పోస్టరు తొలగించాలని ఆదేశించిందని అభిజ్ఞ వర్గాలు తెలిపాయి.

ఊదరగొట్టిన పాక్ చానళ్లు..
తుస్సుమనిపించిన ఐఎస్‌పీఆర్ డీజీ!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో.. మంగళవారం ఉదయం నుంచి ఆ దేశ మీడియా సంస్థలు సాయంత్రం 6.30కు కీలక నిర్ణయం వెలువడనుందని ఊదరగొట్టాయి. "సాయంత్రం 6.30కు ఇంటర్ సర్వీస్ పబ్లిక్ రిలేషన్స్(ఐఎస్‌పీఆర్) డీజీ అహ్మద్ షరీఫ్ చౌదరి విలేకరుల సమావేశంలో మాట్లాడుతారు. మిలటరీ సన్నద్ధత నేపథ్యంలో కీలక అంశాలను వెల్లడిస్తారు" అంటూ కథనాలను ప్రసారం చేశాయి. చౌదరి మీడియా సమావేశంలో మాట్లాడే దృశ్యాలను ప్రత్యక్ష ప్రసారం చేశాయి. ఐఎస్‌పీఆర్ అధికారిక యూట్యూబ్ చానల్‌లో లైవ్ మొదలవ్వగానే 10 లక్షల మంది వీక్షకులు ఉండగా.. క్రమంగా వారి సంఖ్య తగ్గుతూ.. సమావేశం ముగియడానికి ఒక నిమిషం ముందు వరకు 20 వేలకు చేరుకోవడం గమనార్హం..! షరామామూలుగా పాకిస్థాన్‌లో ఉగ్రవాదాన్ని భారత్ ఉసిగొల్పుతోందని చౌదరి ఆరోపించారు. ఇటీవల జీలం బస్టేషన్ వద్ద అరెస్టయిన మాజిద్ అనే వ్యక్తి ఇంట్లో జరిపిన తనిఖీల్లో భారత్‌కు చెందిన డ్రోన్, 10 లక్షల పాకిస్థానీ రూపాయలు లభ్యమయ్యాయని.. భారత సైన్యానికి చెందిన ఓ సుబేదార్‌తో అతను మాట్లాడినట్లుగా ఆధారాలున్నాయని చెప్పారు. బలూచిస్థాన్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులను అంతమొందిచామని పేర్కొంటూ.. సమావేశాన్ని ముగించారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండానే అహ్మద్ షరీఫ్ చౌదరి అక్కడి నుంచి నిష్క్రమించడం గమనార్హం..!

ప్రధాని మోదీతో మోహన్ భాగవత్ భేటీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: ప్రధాని నరేంద్ర మోదీతో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ మంగళవారం భేటీ అయ్యారు. పహల్గాం దుర్ఘటన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఆ దుర్ఘటనపైనే ఇరువురు నేతలు చర్చించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రక్షణ మంత్రి, జాతీయ భద్రతా సలహాదారు, త్రి దళాల అధిపతులతో సమావేశమయిన అనంతరం భాగవత్..ప్రధానితో చర్చలు జరిపారు. హోం మంత్రి అమిత్ షాతోనూ మోదీ సమావేశమయ్యారు. కాగా, పహల్గాం దాడిని ఆరెస్సెస్ ఖండించింది. ఇది దేశ సమగ్రతపై జరిగిన దాడి అని వ్యాఖ్యానించింది.

ఈపీఎస్ కనీస పెన్షన్ రూ.3,000కు పెంపు!

» పరిశీలిస్తున్న కేంద్రం.. ఓ ఉన్నతాధికారి వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: పెన్షన్‌దార్లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పనుందా? కనీస పెన్షన్‌ను పెంచే అవకాశాలు ఉన్నట్టు సూచనలు అందుతున్నాయి. ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం (ఈపీఎస్) కింద రానున్న నెలల్లో కనీస పెన్షన్‌ను రూ.1,000 నుంచి రూ.3,000కు పెంచే అవకాశం ఉన్నట్టు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ప్రస్తుతం ఉద్యోగి జీతంలో 12 శాతాన్ని యజమానులు భవిష్య నిధికి చెల్లిస్తున్నారు. ఇందులో 8.33 శాతం ఉద్యోగుల పెన్షన్ స్కీం (ఈపీఎస్)కు జమ అవుతుంది. మిగిలిన 3.67 శాతం ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్)లో చేరుతుంది. దీని ఆధారంగా ప్రస్తుతం రూ.1,000 కనీస పెన్షన్‌గా చెల్లిస్తుండగా, దాన్ని నెలకు రూ.3,000కు పెంచే అవకాశం ఉందని ఆ అధికారి తెలిపారు. ఈపీఎస్ కార్పస్ నిధిలో మొత్తం రూ.8లక్షల కోట్లు నిల్వ ఉన్నాయి. మొత్తం 78.50 లక్షల మంది రిటైర్డు ఉద్యోగులు ఉండగా, వారిలో 36.60 లక్షల మంది రూ.1,000 కనీస పెన్షన్‌గా పొందుతున్నారు. అందువల్ల కనీస పెన్షన్ కింద రూ.3,000 చెల్లిస్తే ఎంత అదనపు భారం పడుతుందనేదానిపై కార్మిక శాఖ అధ్యయనం చేస్తోందని ఆ ఉన్నతాధికారి తెలిపారు.

కెనడాలో భారత విద్యార్థిని అనుమానాస్పద మృతి

ఒట్టావా, ఏప్రిల్ 29: కెనడాలోని ఒట్టావాలో భారతీయ విద్యార్థిని వన్షిక (21) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ విషయాన్ని ఆ దేశంలోని భారత హైకమిషన్ ధ్రువీకరించింది. పంజాబ్‌కు చెందిన ఆమ్ ఆద్మీ పార్టీ నేత దేవిందర్ సైనీ కుమార్తె వన్షిక రెండేళ్ల క్రితం డిప్లొమా కోర్సు చేయడానికి కెనడా వెళ్లింది. గత శుక్రవారం రాత్రి అద్దె ఇంటిని వెతికేందుకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఆదేరోజు రాత్రి 11 గంటల ప్రాంతంలో ఆమె ఫోను స్విచ్ ఆఫ్ అయింది. దీంతో ఆందోళన చెందిన సన్నిహితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ ప్రారంభించిన పోలీసులు మూడు రోజులుగా వన్షిక కోసం తీవ్రంగా గాలించారు. ఈ క్రమంలోనే ఒంటారియో ప్రావిన్స్ వద్ద ఆమె మృతదేహం లభ్యమైంది.

పాక్ దిగ్బంధం!?

దాయాది దేశాన్ని అన్ని అంశాల్లో ఇరుకున పెట్టేందుకు కేంద్రం ప్రయత్నాలు

» ఇప్పటికే దౌత్య, వాణిజ్యపరంగా ఆంక్షలు

» తాజాగా పాక్ ఎయిర్‌లైన్స్‌కు భారత గగనతలాన్ని మూసేసే యోచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దాయాది దేశం పాకిస్థాన్‌ను అన్ని అంశాల్లోనూ ఇరుకున పెట్టేందుకు భారత్ సిద్ధమైంది. ఇప్పటికే పాక్‌కు దౌత్యపరంగా స్థాయిని తగ్గించడం, వాణిజ్యాన్ని నిషేధించడం, సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం వంటి చర్యలు చేపట్టిన కేంద్ర ప్రభుత్వం... ఇకపై వాయు, జల మార్గాలనూ మూసేయాలని నిర్ణయించినట్టు సమాచారం. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ తీవ్రస్థాయిలో స్పందించడంతో.. భారత విమానాలకు పాక్ తన గగనతలాన్ని నిషేధించిన విషయం తెలిసిందే. అదే తరహాలో పాక్ విమానాలకు భారత గగనతలాన్ని నిషేధించేందుకు కేంద్రం సిద్ధమైనట్టు తెలిసింది. దీనివల్ల పాకిస్థాన్ నుంచి తూర్పు వైపునకు.. అంటే మయన్మార్, థాయిలాండ్, మలేసియా వంటి దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాలకు వెళ్లాలంటే.. చైనా మీదుగా, లేదా శ్రీలంక మీదుగా తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. అంత ఎక్కువ దూరం తిరగడం వల్ల పాక్ విమానయాన సంస్థలకు పెద్ద దెబ్బే తగలనుంది. మరోవైపు భారత పోర్టుల్లో పాకిస్థాన్ నౌకలు ఆగకుండా నిషేధం విధించాలని కూడా కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలిసింది.

జమ్మూలో భద్రతపై ఎన్ఎస్‌జీ డ్రిల్...


భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు, మరిన్ని ఉగ్రదాడులు జరగవచ్చనే వార్తల నేపథ్యంలో.. జమ్మూలో భద్రతపై జాతీయ భద్రతాదళం (ఎన్ఎస్‌జీ), స్థానిక పోలీసులు కలసి భారీ స్థాయిలో డ్రిల్ నిర్వహించారు. అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు ఎలా వ్యవహరించాలన్న దానిపై.. నిఘా డ్రోన్లు, అత్యాధునిక ఆయుధాలతో ఆప్ శంభు ఆలయం, రైల్వే స్టేషన్, జీఎంసీ ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఈ డ్రిల్ నిర్వహించినట్టు అధికారులు వెల్లడించారు. మరోవైపు ఇప్పటికే భారత్‌లో పాక్ ప్రభుత్వ అధికారిక 'ఎక్స్' ఖాతాను నిలిపివేసిన కేంద్రం..తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఖాతాను కూడా నిలిపివేసింది.

భారత సరిహద్దుల్లోకి పాక్ నిఘా రాడార్లు..

భారత్ ఏ క్షణమైనా దాడికి దిగవచ్చన్న ఆందోళనతో ఉన్న పాకిస్థాన్.. తమ నిఘా రాడార్లను సరిహద్దులకు సమీపంలో తరలిస్తోంది. ఇప్పటికే సియాల్‌కోట్, ఫిరోజ్‌పూర్ సెక్టార్లలోకి రాడార్లను తరలించినట్టుగా భారత నిఘా వర్గాలు గుర్తించాయి. ఇటీవల అంతర్జాతీయ సరిహద్దుకు 58 కిలోమీటర్ల లోపల ఉన్న ఖోర్ కంటోన్మెంట్ ప్రాంతంలో అధునాతన టీపీఎస్-77 మల్టీరోల్ రాడార్‌ను సైతం పాక్ ఏర్పాటు చేసుకున్నట్టు సమాచారం. ఇక నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంట పాక్ కాల్పుల విరమణ ఉల్లంఘన కొనసాగుతోంది. సోమవారం రాత్రి కుప్వారా, బారాముల్లా, అఖ్నూర్ సెక్టార్లలో పాక్ దళాలు కాల్పులు జరపగా.. భారత దళాలు దీటుగా బదులిచ్చినట్టు రక్షణ వర్గాలు వెల్లడించాయి.

ఆర్మీపై సైబర్‌దాడులకు పాక్ విఫల యత్నం

భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ హ్యాకర్లు భారత ఆర్మీపై సైబర్‌దాడుల కోసం తీవ్రంగా ప్రయత్నించారు. 'ఐఓకే (ఇంటర్నెట్ ఆఫ్ ఖిలాఫా) హ్యాకర్'గా పిలిచే పాక్ హ్యాకర్ల బృందం మంగళవారం.. వైమానిక దళ ప్లేస్‌మెంట్ పోర్టల్, శ్రీనగర్, రాణిఖేత్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూళ్లు, ఆర్మీ వెల్ఫేర్ హౌసింగ్ ఆర్గనైజేషన్ (ఏడబ్ల్యూహెచ్ఓ) వెబ్‌సైట్లను హ్యాక్ చేసేందుకు ప్రయత్నించింది. అయితే నిరంతర పర్యవేక్షణ ఉండే భారత ఆర్మీ సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్ ఆ ప్రయత్నాలను నిలువరించినట్టు రక్షణ వర్గాలు తెలిపాయి.



మంగళవారం త్రివిధ దళాల అధిపతులతో సమావేశంలో ప్రధాని మోదీ. చిత్రంలో జాతీయ భద్రతా సలహాదారు డోభాల్, నౌకాదళం చీఫ్ దినేశ్ త్రిపాఠి, ఎయిర్‌ఫోర్స్ చీఫ్ అమర్‌ప్రీత్ సింగ్

'పహల్గాం'పై చర్చకు పార్లమెంట్ నిర్వహించండి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 : పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ఘటనపై చర్చించేందుకు వీలైనంత తర్వాత పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని ప్రధాన మంత్రిని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే.. ప్రధాని మోదీకి మంగళవారం వేర్వేరుగా లేఖలు రాశారు. "పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ప్రతీ భారతీయుడిలో ఆవేశాన్ని రగిల్చింది. ఇలాంటి కఠిన సమయంలో.. ఉగ్రవాదంపై పోరులో దేశమంతా ఏకతాటిపై ఉంటుందని ప్రపంచానికి చాటాల్సిన అవసరం ఉంది. అందువల్ల పార్లమెంట్ ఉభయసభలు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తారని ప్రతిపక్షం ఆశిస్తోంది. వీలైనంత త్వరగా ఆ సమావేశాలు నిర్వహించాలని కోరుతున్నా" అని రాహుల్ గాంధీ తన లేఖలో పేర్కొన్నారు.

'పహల్గాం' పాపం పాకిస్థాన్‌దే!

» దాడిలో పాల్గొన్న పాక్ మాజీ పారా కమాండో హాషీమ్ మూసా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 : పహల్గాం నరమేధం పాకిస్థాన్ పాపమేనని భారత్ తొలినుంచీ గట్టిగా నమ్ముతోంది. ఇప్పుడు అందుకు గట్టి ఆధారం కూడా దొరికింది. ఇటీవల భద్రతాబలగాల కాల్పుల్లో మరణించిన ఓ ఉగ్రవాది వద్ద హాషీమ్ మూసా అలియాస్ సులేమాన్ ఫొటో బయటపడింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత బాగా వినిపిస్తున్న పేరు మూసా. అయితే, ఇతడు గతంలో పాకిస్థాన్ ఆర్మీలో ప్రత్యేక బలగాల (ఎస్ఎస్‌జీ) పారా కమాండోగా పనిచేశాడని ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. దీంతో పహల్గాం దాడిలో పాక్ ఆర్మీ, ఐఎస్ఐకి ఉన్న ప్రత్యక్ష పాత్ర స్పష్టమయిందని ఎన్ఐఏ అధికారులను ఉటంకిస్తూ ఓ జాతీయ ఆంగ్ల పత్రిక కథనం ప్రచురించింది. అతడు ప్రస్తుతం ఉగ్ర సంస్థ లష్కరే తాయిబాలో కీలక వ్యక్తిగా ఉన్నాడని మీడియా నివేదికలు పేర్కొంటున్నాయి. పారా కమాండోగా ఆయన తీసుకున్న శిక్షణే పహల్గాం దాడి తర్వాత భద్రతా బలగాల నుంచి తప్పించుకోవడంలో సహకరించిందని పోలీసులు అంచనా వేస్తున్నారు. గతేడాది అక్టోబరులో మధ్య కశ్మీరులోని గగన్‌గీర్‌లో ఏడుగురు కార్మికులను ఉగ్రవాదులు కాల్చిచంపారు. అదే నెలలో బారాముల్లాలో ఆర్మీ వాహనంపై దాడిచేసి జవాను సహా ఇద్దరిని చంపేశారు. తాజాగా పహల్గాం ఉగ్రదాడి. ఈ మూడు దాడుల్లోనూ ఉమ్మడిగా వినిపించిన పేరు మూసా. ఈ నేపథ్యంలో, ఈ 3దాడులకు సంబంధం ఉందని ఎన్ఐఏ భావిస్తోంది. గతేడాది రెండు ఘటనలకు ఉన్న పోలికలను అప్పుడే నిఘా వర్గాలు గుర్తించి ఉంటే మూడో దాడిని నిలువరించడానికి వీలయ్యేదని ఎన్ఐఏ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడిన మూసాతో పాటు అలీ భాయ్ ఏడాది క్రితమే భారత్‌లోకి చొరబడినట్టు ఒక నివేదిక పేర్కొంది. ఇదిలా ఉండగా, కశ్మీర్‌లో మరిన్ని ప్రాంతాల్లో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఇక్కడున్న 87 పర్యాటక ప్రదేశాల్లో 48 ప్రాంతాలను మూసివేసింది. పహల్గాం దాడి తర్వాత కొందరు స్లీపర్ సెల్స్ కశ్మీర్ లోయలో యాక్టివేట్ అయినట్టు ఈ వర్గాలు గుర్తించాయి.

సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

(మొదటి పేజీ తరువాయి)

ఉక్కుపాదంతో అణచివేస్తామని.. వారి ఊహలకు కూడా అందనంత అత్యంత కఠినమైన శిక్ష విధిస్తామని హెచ్చరించినట్టు సమాచారం. కాగా.. జూలైలో జరిగే అమర్‌నాథ్ యాత్రకు రక్షణ ఏర్పాట్లు ఏలా చేయాలి, దేశంలో కీలకమైన ప్రాంతాల్లో ఉగ్రవాద దాడులు జరగకుండా ఎలా నిరోధించాలి, పాక్ కవ్వింపు చర్యలకు ఏ విధంగా బదులునివ్వాలి, అంతర్జాతీయంగా పాక్‌ను ఏకాకి ఎలా చేయాలనే అంశాలపై కూడా ఈ భేటీలో విస్తృతంగా చర్చించినట్లు తెలిసింది. అలాగే.. జమ్మ జిల్లాలోని అఖ్నూర్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వద్ద కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి పాక్ సైన్యాలు వరుసగా ఐదోసారి కాల్పులు జరిపిన వైనంపైనా చర్చించారు. రక్షణ శాఖకు చెందిన విభాగాలపై పాకిస్తాన్ సైబర్ దాడుల గురించి కూడా ఈ సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించారు. శ్రీనగర్, రాణిఖేడ్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూళ్లు, ఆర్మీ గృహ సంక్షేమ సంస్థ, తదితర సంస్థల వెబ్‌సైట్లను ఐవోకే హ్యాకర్ పేరిట పాక్ హ్యాక్ చేసింది. ఆ వెబ్‌సైట్ల హోం పేజీలో సైట్ హ్యాక్‌డ్ అన్న వాక్యాలతో పాటు పాకిస్థాన్ జెండా, ముసుగుతో ఒక ఆగంతకుడి చిత్రం కనపడుతున్నాయి. ఈ భేటీకి ముందు.. కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలో ఒక అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. ఆ భేటీకి మూడు పారామిలటరీ దళాల అధిపతులు, రెండు భద్రత సంస్థల సీనియర్ అధికారులు హాజరయ్యారు. అయితే, ఆ సమావేశం అజెండా ఏమిటో అధికారికంగా వెల్లడించలేదు. కాగా.. బుధవారం ప్రధాని అధ్యక్షతన జరగనున్న జాతీయ భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) భేటీలో.. పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. వారంరోజుల వ్యవధిలో సీసీఎస్ భేటీ జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఈ కమిటీలో ప్రధానితో పాటు హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ మంత్రి జయశంకర్ సభ్యులుగా ఉన్నారు. ఈ సమావేశం తర్వాత కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశం కూడా జరగనుంది.

ప్రజల విశ్వాసం కోల్పోతున్న సీబీఐ!

ఆ సంస్థపై పెరుగుతున్న అవినీతి ఫిర్యాదులు

మద్రాస్ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

చెన్నై, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సీబీఐ ప్రజల విశ్వాసం కోల్పోతోందని మద్రాస్ హైకోర్టు తూర్పారబట్టింది. సీబీఐపైనే అవినీతి ఫిర్యాదులు పెరుగుతున్నాయని వ్యాఖ్యానించింది. తిరునల్వేలి జిల్లా పాళయంకోటలోని ఓ జాతీయ బ్యాంకులో రుణాల పేరుతో రూ.2 కోట్ల మోసం జరిగిన వ్యవహారంలో ఆ బ్యాంక్ చీఫ్ మేనేజర్ సహా 13 మందిపై సీబీఐ అధికారులు కేసు నమోదుచేశారు. విచారణ జరిపిన సీబీఐ కోర్టు బ్యాంక్ చీఫ్ మేనేజర్ బాలసుబ్రమణియన్‌తోపాటు 8 మందికి మాత్రమే శిక్ష విధిస్తూ 2019లో తీర్పు ఇచ్చింది. దీంతో ఆ కోర్టు ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఆ 8మంది హైకోర్టు మదురై ధర్మాసనంలో అప్పీలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. కింది కోర్టు విధించిన శిక్షను రద్దు చేస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా సీబీఐ దర్యాప్తు తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 'సీబీఐపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉండేది. కానీ, ఇక్కడ సీబీఐ విచారణలో లోపం ఉన్నట్లు స్పష్టమవుతోంది. కొన్ని కేసుల్లో ప్రధాన నిందితులను నిర్దోషులుగా విడుదల చేసి, కొంత మంది వ్యక్తులపై కేసులు నమోదు చేస్తోందని బాధితుల తరఫు న్యాయవాదులు చెబుతున్నారు. సీబీఐపై అవినీతి ఫిర్యాదులు పెరుగుతున్నాయి. ఈ కారణంగా సీబీఐ ప్రజల విశ్వాసం కోల్పోతోంది. ఈ నేపథ్యంలో కేసులో నిందితులను చేర్చడం, వారిపై కేసులు నమోదుచేయడం, చార్జిషీటు దాఖలు చేయడం వరకు ప్రతి విషయాన్నీ సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షించాలి' అని ధర్మాసనం సూచించింది.

ఉగ్రవాదులపై స్పైవేర్ వాడితే తప్పేంటి?

దేశ భద్రత విషయంలో రాజీపడనక్కర్లేదు

» ప్రైవేటు వ్యక్తులపై వాడితే దర్యాప్తు చేయిస్తాం

» నిపుణుల నివేదికను బహిర్గతపర్చలేం: సుప్రీం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: పెగాసస్ స్పైవేర్‌ను ఉగ్రవాదులకు వ్యతిరేకంగా వాడితే తప్పేంటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలాగే దేశ భద్రత, సార్వభౌమత్వానికి సంబంధించిన అంశాలను స్పృశించిన ఏ నివేదికనైనా బహిర్గతం చేయడం కుదరదని తెలిపింది. ఇజ్రాయెల్‌కు చెందిన పెగాసస్ స్పైవేర్‌ను వినియోగించి దేశంలోని పాత్రికేయులు, రాజకీయ నాయకులు, పలువురు ప్రముఖులపై నిఘా పెట్టారన్న ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలంటూ అత్యున్నత న్యాయస్థానంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్‌సింగ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. జాతీయ భద్రతా ప్రయోజనాల కోసం దేశం స్పైవేర్‌ను కలిగి ఉండడం తప్పులేదని కోర్టు స్పష్టంచేసింది. అయితే, అది ఎలా? ఎవరిపై ఉపయోగించారన్న దాని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఓ పిటిషనర్ తరఫు న్యాయవాది మాట్లాడుతూ.. పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగిస్తున్నారా? లేదా అన్న విషయాన్ని కేంద్రం స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేగాక, ఈ ఆరోపణలపై దర్యాప్తు జరిపిన సాంకేతిక నిపుణుల బృందం నివేదికను ఇప్పటివరకూ బహిర్గతపర్చలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దాన్ని వెంటనే బహిర్గతం చేయాలని కోరారు. స్పందించిన ధర్మాసనం.. "ఉగ్రవాదులపై దేశం స్పైవేర్‌ను వినియోగిస్తే తప్పేముంది? స్పైవేర్‌ను కలిగి ఉండడం తప్పేమీ కాదు. అయితే, దాన్ని ఎవరి మీద వాడుతున్నారన్నదే ప్రశ్న. దేశ భద్రత విషయంలో రాజీపడాల్సిన అవసరం లేదు. అదేసమయంలో ప్రైవేటు వ్యక్తులు, పౌరసమాజానికి రాజ్యాంగం కల్పించిన గోప్యత హక్కును కూడా పరిరక్షించాల్సి ఉంటుంది" అని వ్యాఖ్యానించింది. జర్నలిస్ట్ పరంజయ్ గుహ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదిస్తూ.. ఫోన్ల హ్యాకింగ్ విషయాన్ని వాట్సాప్ సంస్థే వెల్లడించిందని గుర్తుచేశారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. ఉగ్రవాదులపై స్పైవేర్‌ను వినియోగించడంలో ఎలాంటి తప్పు లేదన్నారు. వారికి గోప్యత హక్కులేమీ ఉండవని చెప్పారు. ధర్మాసనం స్పందిస్తూ.. స్పైవేర్‌ను ఉగ్రవాదులకు వ్యతిరేకంగా వాడుకుంటే తప్పేమీ లేదంది. సామాన్యులపై ఉపయోగిస్తే, దానిపై తాము దర్యాప్తు జరిపిస్తామని తెలిపింది. ఇక, సాంకేతిక బృందం నివేదిక గురించి మాట్లాడుతూ.. "దేశ భద్రత, సార్వభౌమత్వానికి సంబంధించిన నివేదికను బహిర్గతం చేయడం సరికాదు. ఒకవేళ ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు దాని గురించి తెలుసుకోవాలనుకుంటే.. వారికి సమాచారం అందిస్తాం. అంతేగానీ వీధుల్లో చర్చించుకునే పత్రంగా ఈ నివేదిక మారకూడదు" అని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా పహల్గాం ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. "ప్రస్తుతం మన దేశం ఎలాంటి పరిస్థితిలో ఉందో అందరికీ తెలుసు. మనం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది" అని పేర్కొంది.

52వ సీజేఐగా జస్టిస్ గవాయ్

» 14న ప్రమాణ స్వీకారం

» కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ నియమితులయ్యారు. వచ్చే నెల 14న ఆయన సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జస్టిస్ గవాయ్‌ను 52వ సీజేఐగా ఎంపిక చేసినట్లు కేంద్ర న్యాయశాఖ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ బీఆర్ గవాయ్‌ని తదుపరి సీజేఐగా నియమించినట్లు తెలిపింది. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా వచ్చే నెల 13న పదవీ విరమణ చేయనున్నారు. ఆ మరుసటి రోజు (14న) జస్టిస్ గవాయ్ సీజేఐగా బాధ్యతలు స్వీకరిస్తారు.

కెనడా ప్రధానిగా మార్క్ కార్నీ!

» విజయం దిశగా లిబరల్ పార్టీ

» ఓటమిని అంగీకరించిన ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ



టొరంటో, ఏప్రిల్ 29: కెనడా సార్వత్రిక ఎన్నికల్లో మార్క్ కార్నీ నేతృత్వంలోని అధికార లిబరల్ పార్టీ విజయం దిశగా దూసుకెళ్తోంది. దీంతో నూతన ప్రధానిగా మార్క్ కార్నీ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. మొత్తం 343 స్థానాలున్న కెనడా హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 172 స్థానాలు అవసరం. అయితే ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల ప్రకారం, లిబరల్ పార్టీ 168 చోట్ల విజయం సాధించింది. ఇంకా ప్రత్యేక బ్యాలెట్లలోని ఓట్లు లెక్కించాల్సి ఉంది. ఒకవేళ లిబరల్ పార్టీ మెజారిటీ సాధించనప్పటికీ మార్క్ కార్నీ మిత్ర పక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. కెనడా ప్రధాన ప్రతిపక్షమైన కన్జర్వేటివ్ పార్టీ 134 చోట్ల విజయం సాధించింది, ఆ పార్టీ నేత పియరీ పోయిలివ్రా తాను పోటీ చేసిన స్థానంలో ఓటమి పాలయ్యారు. ఫ్లాంకోయిస్ బ్లాంకెట్ నేతృత్వంలోని బ్లాక్ క్యూబికాయిస్ పార్టీ 22 సీట్లు గెలిచి, మూడో స్థానంలో కొనసాగుతోంది. జగ్మీత్ సింగ్ నేతృత్వంలోని ఖలిస్థానీ అనుకూల న్యూడెమొక్రటిక్ పార్టీ కేవలం నాలుగు స్థానాలు మాత్రమే గెలిచింది. దాంతో జగ్మీత్ సింగ్ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అమెరికా సుంకాల యుద్ధం, కెనడాను యూఎస్‌లో 51వ రాష్ట్రంగా చేర్చాలంటూ ట్రంప్ బెదిరింపులకు పాల్పడుతున్న వేళ ఈ ఎన్నికలు అత్యధిక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అటు భారత్‌తోనూ కెనడాకు విభేదాలు కొనసాగుతున్నాయి. కాగా, మార్క్ కార్నీ మంగళవారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రెండో ప్రపంచ యుద్ధ కాలం నుంచి అమెరికాతో తమకు మంచి సంబంధాలు ఉన్నాయని, అయితే ప్రస్తుతం ఆ దేశం కెనడాకు చేసిన నమ్మక ద్రోహం షాక్‌కు గురిచేసిందని చెప్పారు. అమెరికా తమకు చేస్తున్న ద్రోహాన్ని ఎప్పటికీ మరచిపోవద్దని, పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. కెనడియన్లు ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

ట్రక్కు డ్రైవర్లు ఆంగ్లం మాట్లాడాల్సిందే!

» ప్రజలు, దేశ భద్రత కోసమే నిర్ణయం

» ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేసిన ట్రంప్



వాషింగ్టన్, ఏప్రిల్ 29: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు.. సదరు నిర్ణయాన్ని అమలు చేయాల్సిందేనని తనకున్న ఎగ్జిక్యూటివ్ అధికారాలతో హుకుం జారీ చేశారు. దేశంలోని వాణిజ్య ట్రక్కులు నడిపే డ్రైవర్లందరూ ఆంగ్లంలో మాట్లాడాల్సిందేనని, ఆంగ్లంలో ప్రావీణ్యం సంపాదించుకోవాల్సిందేనని పేర్కొన్నారు. ఇదంతా ప్రజల భద్రత, దేశ రక్షణలో భాగంగా తీసుకున్న నిర్ణయమేనని ట్రంప్ పేర్కొనడం గమనార్హం. "వృత్తిరీత్యా డ్రైవర్లుగా ఉన్నవారికి ఆంగ్లంలో ప్రావీణ్యం ఉండాలి. ఈ విషయంపై ఎలాంటి చర్చలకూ తావులేదు." అని ఆదేశాల్లో స్పష్టం చేశారు. ట్రంప్ తన ఆదేశాల్లో ఆంగ్లాన్ని జాతీయ అధికారిక భాషగా పేర్కొన్నారు. అంతేకాదు.. భాష అమలు విషయంలో గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యం చూపుతున్నారని, ఇప్పటి నుంచి ఈ విషయంలో ఖచ్చితంగా వ్యవహరించాలని ఫెడరల్ ఏజెన్సీలను సైతం ఆదేశించారు. తాజా ఆదేశాలతో ఆంగ్లం మాట్లాడని డ్రైవర్లకు పోలీసులు భారీ జరిమానాలు విధించే అవకాశం కలగనుంది. గత ఒబామా పాలనలో 2016లో అంగ్లం మాట్లాడని డ్రైవర్లపై ఎలాంటి చర్యలూ తీసుకోకుండా నిషేధం విధించారు. ఇప్పటివరకు అది అమల్లో ఉంది. ట్రంప్ నిర్ణయంపై సిక్కు సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయం తమ పట్ల వివక్షను చూపించడమేనని, ఉపాధిని దెబ్బతీయడమేనని వారు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలో లక్ష మందికి పైగా సిక్కులు ట్రక్కు డ్రైవర్లుగా ఉన్నారు.



భారత వైమానికదళ రాఫెల్ యుద్ధ విమానం (ఫ్రెంచ్)



భారత టీ90 ట్యాంక్ (రష్యన్)

కొట్టాలి.. తిప్పికొట్టలేకుండా!

భారత సైన్యం ప్రతీకార వ్యూహమిదే!

- పాక్ గట్టిగా స్పందించలేని రీతిలో బుద్ధి చెప్పాలి
- పూర్తిస్థాయి యుద్ధం వచ్చే అవకాశం తక్కువే!
- భారత్‌ను అడ్డుకునేందుకే పాక్ అణు బెదిరింపులు

పాక్ ఉగ్రవాద శిబిరాలపై, వాటి ఆయువు పట్లపై దాడి?

పహల్గాం పాశవిక ఉగ్రవాద దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై ప్రతీకారానికి భారత్ సిద్ధమవుతోంది. ఇప్పటికే సింధు నదీ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేయడం, పాక్ పౌరుల్ని పంపించేయడం వంటి పలు చర్యలు చేపట్టిన భారత్... సైనికపరంగా కూడా కొన్ని సన్నాహాలు ప్రారంభించింది. అయితే భారత్ ఎంతవరకూ ముందుకు వెళుతుంది? పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై మాత్రమే దాడి చేస్తుందా? లేదంటే ఉగ్రవాదులకు దన్నుగా ఉన్న పాక్ సైనిక స్థావరాలపై కూడా అస్త్రాలు గురిపెడుతుందా? లేకపోతే పాక్‌పై పూర్తిస్థాయి యుద్ధానికి దిగుతుందా? అనే ప్రశ్నలు ఇప్పుడు అందరి మదిలో మెదులుతున్నాయి. పాక్‌పై త్వరలో భారత్ దాడి తథ్యమని సరిహద్దుకు ఇవతల, అవతల కూడా మెజారిటీ ప్రజలు భావిస్తున్నారు. పహల్గాం ఉగ్రవాద దాడి అనంతరం భారత ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూర్చేలా ఉన్నాయి. "ఉగ్రవాదులు భూమ్మీద ఎక్కడ దాక్కున్నా పట్టుకుంటాం. దాడికి పాల్పడ్డవారికి, దాడి వెనక సూత్రధారులకు అత్యంత కఠిన శిక్ష విధిస్తాం. వారిని కలలో కూడా ఊహించని విధంగా శిక్షిస్తాం. వారి అంతు చూసేందుకు ఎంతవరకైనా వెళ్తాం. ఉగ్రవాదుల స్వర్గధామాన్ని నిర్వీర్యం చేసే సమయం ఆసన్నమైంది" అని ఆయన వ్యాఖ్యానించారు. కానీ భారత్ దాడి ఎప్పుడు? ఎక్కడ? ఎంతమేరకు? అనే ఉత్కంఠ ఇప్పుడు అందరిలో ఉంది. గతానుభవాలు, ఇరుదేశాల బలాబలాలు-పరిస్థితులు, అంతర్జాతీయ పరిస్థితులు, రక్షణ రంగ నిపుణుల అభిప్రాయాలను పరిశీలించినప్పుడు పాక్‌పై భారత్ దాడి పూర్తిస్థాయి యుద్ధంగా కాకుండా, పరిమితంగానే ఉండే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.




భారత్, రష్యా తయారీ బ్రహ్మోస్ క్షిపణి

భారత్ ఏం చేస్తుంది?

పాక్ ఉగ్రవాద దాడులకు భారత్ సైనిక చర్యల ద్వారా స్పందించడం ఇదే మొదటిసారి కాదు. 2001లో భారత పార్లమెంటుపై పాక్ ఉగ్రవాదులు దాడి చేసినప్పుడు భారత్ ఆపరేషన్ పరాక్రమ్ పేరిట భారీ సైనిక మోహరింపు చేపట్టింది. అయిదు లక్షల మంది సైన్యాన్ని పాక్ సరిహద్దులో మోహరించి పాక్‌పై శతఘ్నులతో కాల్పులు జరిపింది. ఆ తర్వాత 2016లో యూరిలో భారత ఆర్మీ ఔట్‌పోస్టుపై ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా భారత సైనిక కమాండోలు నియంత్రణ రేఖ దాటి ఆక్రమిత కశ్మీర్‌లోని పాక్ సైనిక శిబిరాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో చాలామంది పాక్ సైనికుల్ని చంపినట్టు భారత్ ప్రకటించగా... పాక్ మాత్రం ఇద్దరే చనిపోయారని, ఓ భారత సైనికుడిని బంధించామని తెలిపింది. మొత్తమ్మీద ఆనాటి దాడిలో ఎటువైపు ఎందరు చనిపోయారనేది ఇప్పటివరకూ స్పష్టంగా తెలియదు. 2019లో పుల్వామాలో ఉగ్రవాదుల దాడిలో 40 మంది భారత సైనికులు చనిపోవడంతో భారత వాయుసేన పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సర్జికల్ స్ట్రయిక్స్ చేసింది. ఆ దాడిలో 350 మంది దాకా ఉగ్రవాదులు చనిపోయినట్టు భారత వాయుసేన వర్గాలను ఉటంకిస్తూ భారత మీడియా వెల్లడించగా, ఎవరూ చావలేదని పాక్ ప్రకటించింది. ఆ మర్నాడు పాక్ యుద్ధ విమానాలు భారత్‌లోకి ప్రవేశించి దాడి చేశాయి. భారత మిగ్-21 యుద్ధ విమాన పైలట్ అభినందన్ వర్ధమాన్ పాక్ ఎఫ్-16 (అమెరికా తయారీ)ను కూల్చివేసినట్లు మన వాయుసేన ప్రకటించింది. అయితే ఆ ఎఫ్-16 నుంచి అప్పటికే చేసిన క్షిపణి ప్రయోగం వల్ల మన మిగ్-21 కూలిపోయి వర్ధమాన్ పాక్ సైన్యానికి పట్టుబడ్డాడు. ఆ దాడిలో తాము ఎఫ్-16ను వాడలేదని, చైనా తయారీ జేఎఫ్ 17 విమానాల్ని మాత్రమే ఉపయోగించామని పాక్ చెప్పుకుంది. ఎఫ్-16 వాడారనేందుకు సాక్ష్యంగా భారత్ దాని నుంచి ప్రయోగించిన ఎయిమ్-120 డి క్షిపణి శకలాలను మీడియాకు చూపించింది. మొత్తమ్మీద భారత్ దాడిలో తమకు ఏమీ నష్టం జరగలేదని చెప్పేందుకు పాక్ ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో తాజా ఉగ్రవాద దాడి అనంతరం భారత్ ఏమి చేయబోతోంది? దానికి పాక్ ఎలా స్పందిస్తుంది? అనేది ఉత్కంఠ రేపుతోంది.

కనీసం ఇది చేయాల్సిందే!

"ఉగ్రవాద దాడులకు ప్రతీకారంగా సరిహద్దు దాటి పాక్‌పై దాడి చేయడం అనేది 2016, ప్రత్యేకించి 2019 తర్వాత ఒక కనీస చర్యగా మారింది. అందువల్ల పాక్ ఆగడాల్ని సహించబోమని సరిహద్దుకు ఇవతల, అవతల చాటి చెప్పే ఉద్దేశంతో భారత్ కొంత గట్టిగానే స్పందించే అవకాశం ఉంది. గతంలో తీసుకున్న చర్యల కంటే తక్కువ స్థాయి చర్య తీసుకోవడం అసాధ్యం" అని ప్రముఖ యుద్ధ చరిత్రకారుడు శ్రీనాథ్ రాఘవన్ బీబీసీకి చెప్పారు. "పాక్‌పై కఠిన చర్య తీసుకోవాలని భారత ప్రజల నుంచి తమ ప్రభుత్వంపై చాలా ఒత్తిడి ఉంది. పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ గట్టిగా దాడి చేస్తే అది పాక్‌కు గట్టి హెచ్చరిక పంపినట్టు అవుతుంది. అయితే పాక్ ప్రతీకార చర్యలకు దిగితే ఇదంతా తీవ్ర సంక్షోభానికి, యుద్ధానికీ దారితీసే ప్రమాదమూ ఉంది" అని విదేశాంగ విధాన విశ్లేషకుడు మైఖేల్ కుగెల్‌మ్యాన్ అభిప్రాయపడ్డారు. భారత్ ఒకవేళ దాడి చేసి పాక్ మళ్లీ ప్రతీకార దాడి చేయకపోతే పాకిస్థాన్ ప్రభుత్వంపై పాక్ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల పాక్ స్పందన ఎలా ఉంటుందనే విషయంలో భారత్ ఆచితూచి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఇటు భారత్, అటు పాక్ రెండూ అణ్వస్త్ర దేశాలు కావడం వల్ల దాడి ఏ స్థాయిలో ఉండాలనేది నిర్ణయించుకోవడం అంత సులభమైన విషయం కాదు. గతంలో కొన్నిసార్లు పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ రహస్య దాడులు చేసినట్టు వార్తలు వచ్చాయి. ఈసారి కూడా అలా చేయవచ్చుగానీ రహస్య దాడుల వల్ల జనాగ్రహం చల్లారదు. అందువల్ల భారత్ ఏం చేసినా బాహాటంగానే చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే భారత దాడి తర్వాత పాక్ గట్టిగా స్పందించలేని విధంగా మన వ్యూహాన్ని రూపొందించుకోవడం చాలా ముఖ్యమని రక్షణ నిపుణులు చెబుతున్నారు. భారత్ పరిమిత స్థాయిలో సైనిక చర్య తీసుకుంటే దానిపై పాకిస్థాన్ ఆగ్రహావేశాలతో స్పందించి పూర్తిస్థాయి యుద్ధానికి దిగే అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. కారణం... పాక్ ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. అప్పులు భారీగా పెరిగిపోయాయి. ద్రవ్యోల్బణం దాదాపు 40 శాతానికి చేరింది. ప్రభుత్వ ఆదాయంలో 45 శాతంపైగా వడ్డీలకే పోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి యుద్ధం చేసే దుస్సాహసానికి పాక్ పూనుకోకపోవచ్చు. అందువల్ల తమ ప్రజల్ని సంతృప్తిపరచడానికి భారత్ దాడిని తక్కువ చేసి చూపడంతోపాటు, తాము ఏదో నామమాత్రపు ప్రతిదాడి చేసినట్టుగా పాక్ నటించే అవకాశం ఎక్కువగా ఉంది. అందువల్ల పాక్ ఉగ్రవాద శిబిరాలపై దాడి.. లేదంటే ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాక్ సైనిక శిబిరాలపై, ఐఎస్ఐ స్థావరాలపై దాడి అనే రెండు ఆప్షన్లలో ఒకదానిని భారత్ ఎంచుకోవచ్చునని ఎక్కువమంది రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



బాలాకోట్ దాడుల్లో భారత్ ఉపయోగించిన ఫ్రెంచ్ మిరాజ్ యుద్ధ విమానం

అమెరికా, రష్యా, చైనా స్పందనేమిటి?

చరిత్రను పరిశీలిస్తే భారత్‌కు రష్యా... పాకిస్థాన్‌కు అమెరికా సన్నిహితంగా ఉంటూ వచ్చాయి. ఇటీవలి కాలంలో అమెరికా భారత్‌కు కొంత చేరువైంది. ఇరుదేశాల మధ్య రక్షణ సంబంధాలు కూడా పెరిగాయి. అయితే పహల్గాం ఉగ్రదాడిని అమెరికా ఖండించినప్పటికీ, భారత్-పాక్ మధ్య తాజా పరిణామాల్లో తాము జోక్యం చేసుకోబోమని స్పష్టంచేసింది. భారత్‌కు చిరకాల మిత్రదేశమైన రష్యా ఉక్రెయిన్‌తో యుద్ధంలో తలమునకలై ఉంది. భారత్ ఉపయోగించే ఆయుధాల్లో అత్యధికం రష్యా నుంచి కొనుగోలు చేసినవే. వాటిలో ఉపయోగించే క్షిపణులు, మందుగుండు, స్పేర్‌పార్టుల్లో చాలాభాగం రష్యా నుంచి రావాల్సిందే. కానీ ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఆ సరఫరాలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఇంకోవైపు మన మరో శత్రు దేశమైన చైనా పాక్‌కు మద్దతు ప్రకటించింది. భారత్ దాడి చేసే పక్షంలో తాము పాక్‌కు అండగా ఉంటామని బాహాటంగానే చెప్పింది. ఇటీవలి కాలంలో పాక్ తన ఆయుధాల్లో అత్యధికం చైనా నుంచే దిగుమతి చేసుకుంటోంది. చైనాతో కలిసి జేఎఫ్ 17 యుద్ధ విమానాల్ని తయారు చేసింది. భారత రాఫెల్ విమానాలకు సమాధానంగా చైనా నుంచి పాక్ జే 10సీ యుద్ధ విమానాల్ని కొనుగోలు చేసింది. ఇంకోవైపు టర్కీ కూడా పాక్‌కు విమానాలు, ఆయుధాలను సరఫరా చేస్తోంది. ఫ్రాన్స్ మాత్రం పూర్తిగా భారత్ వెన్నంటే ఉంది. గతంలో కార్గిల్ యుద్ధ సమయంలో కూడా ఫ్రాన్స్ భారత్‌కు మందుగుండు సామగ్రిని సరఫరా చేసి ఆదుకుంది. అయితే ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితులు పూర్తిస్థాయి యుద్ధాలకు అనువుగా లేవు. టారిఫ్‌ల యుద్ధం, ఆర్థిక మాంద్యం వల్ల చాలాదేశాలు ఆర్థికంగా ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నాయి. శతఘ్నుల నుంచి ప్రయోగించే 155ఎంఎం తూటాలు అన్ని యుద్ధాల్లో ఎంతో కీలకమైనవి. ఒకవైపు ఉక్రెయిన్ యుద్ధం, మరోవైపు గాజా యుద్ధం జరుగుతుండడంతో ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ఆ తూటాలకు కరువొచ్చి పడింది. ఈ పరిణామాలన్నీ గమనిస్తున్న భారత్ ఆచితూచి అడుగులు వేస్తోంది. చైనాకు పోటీగా ఆర్థికంగా బలోపేతం కావాలని, సూపర్ పవర్‌గా ఆవిర్భవించాలని ఆశిస్తున్న భారత్ ఇప్పుడు పాక్‌తో పూర్తిస్థాయి యుద్ధానికి దిగితే ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది. అందువల్ల భారత వ్యూహకర్తలు అన్ని ఆప్షన్లనూ పరిశీలించి మనకు తక్కువ నష్టం కలిగే రీతిలో పాక్‌కు ఏ విధంగా బుద్ధి చెప్పగలం అనే వ్యూహాన్ని రూపొందిస్తున్నారు.



ఫ్రాన్స్ నుంచి భారత్ కొనుగోలు చేసిన రాఫెల్ విమానాలకు జవాబుగా చైనా నుంచి పాకిస్థాన్ కొన్న జే10సీ విమానం

అణు దాడికి అవకాశం ఎంత?

పాక్‌పై భారత్ యుద్ధం ప్రకటిస్తే పాక్ భారత్‌పై అణు దాడికి పాల్పడుతుందా అనేది ఒక పెద్ద ప్రశ్న. కానీ పాక్ అణు విధానం (న్యూక్లియర్ డాక్ట్రిన్)ను పరిశీలిస్తే చిన్న కారణాలకే భారత్‌పై అణ్వస్త్ర ప్రయోగం చేయవచ్చన్నట్టుగా దానిని రూపొందించినట్టు అనిపిస్తుంది. ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ సమాచారం ప్రకారం నాలుగు రకాల పరిస్థితుల్లో భారత్‌పై అణు దాడి చేయవచ్చని పాక్ అణు విధానం చెబుతోంది. (కుడివైపు బాక్స్ చూడండి) దీనిని బట్టి చూస్తే భారత్‌పై అణ్వస్త్ర ప్రయోగం చేయడానికి పాక్‌కు మరీ పెద్ద కారణమంటూ అవసరం లేదు. సంప్రదాయ ఆయుధాల్లో భారత్‌తో తాను పోటీ పడలేదు కాబట్టి భారత్‌తో చిన్న ఉద్రిక్తత తలెత్తితే చాలు... అణ్వస్త్రాలు ప్రయోగించేస్తామని పాక్ బెదిరిస్తూ ఉంటుంది. తాజాగా పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్, రైల్వే శాఖ సహాయమంత్రి హనీఫ్ అబ్బాసీలు భారత్‌పై అణ్వస్త్రాలు ప్రయోగిస్తామంటూ దుందుడుకు ప్రకటనలు చేశారు. ఇలాంటి ప్రకటనల ద్వారా భారత్ తమపై అసలు దాడే చేయకుండా అడ్డుకోవాలనేది పాక్ ఎత్తుగడ. అయితే పాక్ అనుసరిస్తున్న ఈ వ్యూహాన్ని అడ్డుకునేందుకు భారత్ ఒక ప్రతివ్యూహాన్ని రూపొందించింది. అదే కోల్డ్ స్టార్ట్ డాక్ట్రిన్!

పాక్ ఎప్పుడు అణుదాడి చేస్తుందంటే?

భౌగోళిక కారణాలు

1 భారత సైన్యం పెద్దఎత్తున పాక్ భూభాగంలోకి ప్రవేశించి ముందుకు దూసుకువెళితే... ప్రత్యేకించి సింధు లోయను దాటి వస్తే

సైనిక కారణాలు

2 పాక్ సాయుధ దళాల్లో అధిక భాగాన్ని భారత్ నిర్వీర్యం చేస్తే... ప్రత్యేకించి పాక్ వాయుసేనను భారత్ గట్టిగా దెబ్బతీస్తే లేదా పాక్ అణు కేంద్రాలపై/స్థావరాలపై దాడి చేస్తే లేదా పాక్‌పై రసాయన/జీవ ఆయుధాలతో దాడి చేస్తే

ఆర్థిక కారణాలు

3 పాక్ నౌకాదళాన్ని దెబ్బతీసి నావల్ బ్లాకేడ్ (1971లో కరాచీ పోర్టును భారత్ దిగ్బంధం చేసిన తరహాలో) ద్వారా పాక్ ఆర్థిక వ్యవస్థను స్తంభింపజేస్తే లేదా సింధు, జీలం, చీనాబ్ నదుల్లో పాక్ వాటా జలాలను విడుదల చేయకుండా అడ్డుకుని పాక్‌ను ఆర్థికంగా అతలాకుతలం చేస్తే

రాజకీయ కారణాలు

4 పాక్‌లో రాజకీయ అస్థిరత కలిగిస్తే... లేదా పాక్‌లో ఏదైనా ప్రాంతాన్ని ఆ దేశం నుంచి విడగొడితే (బంగ్లాదేశ్ మాదిరి)

ఎవరి బలమెంత?

	భారత్	పాకిస్థాన్
రెగ్యులర్ సైన్యం	14,55,550	6,54,000
రిజర్వు బలగాలు	11,55,000	5,50,000
పారామిలిటరీ బలగాలు	25,27,000	5,00,000
వైమానిక దళం		
మొత్తం విమానాలు	2,229	1,399
ఫైటర్ విమానాలు	513	328
రవాణా విమానాలు	270	64
ట్రైనర్ విమానాలు	351	565
హెలికాప్టర్లు	899	373
ట్యాంకర్ విమానాలు	6	4
ఆర్మీ		
యుద్ధ ట్యాంకులు	4,201	2,627
సెల్ఫ్ ప్రొపెల్డ్ ఆర్టిలరీ	100	662
టోవ్డ్ ఆర్టిలరీ	3,975	2,629
మొబైల్ రాకెట్ ప్రొజెక్టర్స్	264	600
ఆర్మర్డ్ వెహికిల్స్	1,48,594	17,516
నౌకాదళం		
మొత్తం యుద్ధనౌకలు	293	121
విమానవాహక నౌకలు	2	0
జలాంతర్గాములు	18	8

(గ్లోబల్ ఫైర్‌పవర్ సమాచారం ప్రకారం)



భారత ఆర్మీ ఆయుధపరంగా, రవాణాపరంగా పాక్ ఆర్మీ కంటే చాలా బలమైనది. భారత నౌకాదళంతో పోలిస్తే పాక్ నౌకాదళం ఎప్పుడూ చాలా బలహీనమే. అయితే వాయుసేన పరంగా పాక్ సంఖ్యాబలంలో వెనకబడి ఉన్నప్పటికీ నాణ్యత, శిక్షణలో భారత్ కంటే కొంత ముందంజలో ఉండేది. 1990 తర్వాత భారత్ ఆ లోటును చాలావరకూ అధిగమించింది. సుఖోయ్ 30, రాఫెల్ వంటి విమానాల్ని సమకూర్చుకోవడం ద్వారా పాక్‌కు అందనంత ముందంజలో నిలబడింది. కానీ గత పదేళ్లుగా ఒక్క యుద్ధ విమానాన్నీ కొనుగోలు చేయకపోవడం, ఉన్న విమానాలు పాతబడి రిటైరైపోవడం, స్వదేశీ తేజస్ యుద్ధ విమానాల తయారీ నత్తనడకన సాగుతుండడం వల్ల భారత యుద్ధ విమానాల సంఖ్య తగ్గిపోయింది. అటు పాక్, ఇటు చైనా రెండు దేశాలతో ఒకేసారి యుద్ధం వస్తే ఎదుర్కోవడానికి భారత్ వద్ద 42 స్క్వాడ్రన్ల (ఒక స్క్వాడ్రన్ అంటే సుమారుగా 18) యుద్ధ విమానాలు ఉండాలనేది రక్షణ నిపుణుల సిఫారసు. ప్రస్తుతం అది 31 స్క్వాడ్రన్లకు పడిపోయింది. దీనిపై భారత వాయుసేన చీఫ్ ఏపీ సింగ్ సైతం ఇటీవల ఆందోళన వ్యక్తంచేశారు. క్షిపణులపరంగా పాక్ కంటే భారత్ చాలా ముందంజలో ఉండడం వల్ల ఈలోటును కొంత అధిగమించవచ్చు. అయితే పాక్‌కు మద్దతిస్తామని చైనా ప్రకటించిన నేపథ్యంలో రెండు దేశాలతో ఒకేసారి యుద్ధం రాని రీతిలో భారత్ తన సైనిక, దౌత్య వ్యూహాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది.

- ఆంధ్రజ్యోతి రక్షణ ప్రత్యేక ప్రతినిధి

కోల్డ్ స్టార్ట్ అంటే!

అణ్వస్త్రాలు ప్రయోగించేందుకు తగిన పెద్ద కారణాన్ని పాకిస్థాన్‌కు కల్పించకుండా తక్కువ సమయంలో సైన్యాన్ని మోహరించి పాక్‌పై పరిమిత దాడులు చేసి కొన్ని పరిమిత లక్ష్యాల్ని సాధించడం. పాక్ వద్ద అణ్వస్త్రాలు ఉన్నాయి కాబట్టి పాక్ ఉగ్రవాద చర్యలకు పాల్పడినా మనం ఊరుకోవాల్సిందేనా? అని పార్లమెంటుపై దాడి తర్వాత భారత వ్యూహకర్తలు ఆలోచించి ఈ డాక్ట్రిన్‌ను రూపొందించారు. భారత్‌పై అణ్వస్త్ర ప్రయోగం చేయాలంటే అంతర్జాతీయ సమాజం ఎలా స్పందిస్తుందనే దానిని కూడా పాక్ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల భారత్‌పై అణు దాడికి తగిన పెద్ద కారణమేదీ చూపే అవకాశం పాక్‌కు ఇవ్వకుండా పాక్‌పై కొంతమేర దాడులు ఎలా చేయాలి? ఏయే ప్రాంతాల్లో దాడులు చేయాలి? అనే అంశాల్ని మన వ్యూహకర్తలు ఈ కోల్డ్ స్టార్ట్ డాక్ట్రిన్‌లో పొందుపరిచారు. అయితే మనం పరిమిత దాడులే అని భావించినా, అంతర్జాతీయ సమాజం వాటిని ఎలా చూస్తుంది? అవి పరిమిత దాడులే కదా అని ఊరుకుంటుందా? లేదా తీవ్ర దాడులని భావించి పాక్ అణు ప్రయోగానికి పరోక్ష ఆమోదం తెలుపుతుందా? అనేది కీలకం. ఈ విషయంలో భారత దౌత్యవేత్తల పాత్ర చాలా ప్రధానమైనది. భారత్ చేస్తున్న దాడులు ఆత్మ రక్షణ కోసం చేస్తున్న పరిమిత దాడులేనని ముఖ్య దేశాలను వారు కన్విన్స్ చేయాల్సి ఉంటుంది. కానీ అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం భారత కోల్డ్‌స్టార్ట్ డాక్ట్రిన్ అనేది కేవలం సైనిక వ్యూహంగానే ఉంది. ఇందులో దౌత్యపరమైన అంశాల గురించి ఆలోచించలేదు. గతంలో అప్పటి భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రవీష్ కుమార్ హైదరాబాద్‌లో పర్యటించినప్పుడు ఈ ప్రతినిధి ఆయనను కోల్డ్ స్టార్ట్ డాక్ట్రిన్ గురించి ప్రశ్నించగా... అది కేవలం సైనిక డాక్ట్రిన్ మాత్రమేనని, విదేశాంగ శాఖకు ఇందులో ప్రమేయం లేదని ఆయన సమాధానమిచ్చారు.

చిన్న అణ్వస్త్రాలు

ఈ కోల్డ్ స్టార్ట్ డాక్ట్రిన్‌ను ఎదుర్కోవడానికి పాక్ కూడా కొన్ని సైనిక వ్యూహాలను రూపొందించింది. వీటిలో ప్రధానమైనది టాక్టికల్ న్యూక్లియర్ వెపన్స్. అంటే చిన్న అణ్వాయుధాలు! హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా వేసిన బాంబుల్ని స్ట్రాటజిక్ న్యూక్లియర్ వెపన్స్ అంటారు. అంటే భారీ అణ్వాయుధాలు. అవి లక్షల సంఖ్యలో ప్రజల్ని చంపుతాయి. నగరాల్ని నేలమట్టం చేస్తాయి. కానీ టాక్టికల్ న్యూక్లియర్ వెపన్స్ చిన్నగా ఉండి తక్కువ శక్తిని కలిగి ఉంటాయి. శత్రు దేశం తాలూకు సైనిక లక్ష్యాలపై వీటిని ప్రయోగిస్తారు. ఇవి నాలుగైదు వేల మంది సైనికుల్ని చంపగలిగే శక్తిని కలిగి ఉంటాయి. భారత సైన్యం ఒకవేళ పాక్‌లోకి పెద్దసంఖ్యలో చొచ్చుకువెళితే భారత నగరాలపై భారీ అణ్వస్త్రాలను ప్రయోగించకుండా మన సైన్యంపై ఈ చిన్న అణ్వస్త్రాలను ప్రయోగించి నిరోధించాలని పాక్ ఉద్దేశం. ఈ చిన్న అణ్వస్త్రాలు మేం వేసినా భారత్ భారీ అణ్వస్త్రాలను తమపై వేయబోదనేది దాయాది లెక్క! తద్వారా భారత్ రూపొందించిన కోల్డ్ స్టార్ట్ డాక్ట్రిన్‌ను దెబ్బతీయాలన్నది వారి వ్యూహం. ఇందుకోసం నాసర్ అనే స్వల్ప శ్రేణి క్షిపణుల్ని పాక్ రూపొందించి సిద్ధంగా ఉంచుకుంది. కానీ పాక్ పన్నిన ఈ వ్యూహం చెల్లదని భారత్ అప్పట్లోనే స్పష్టం చేసింది. "మీరు ప్రయోగించే అణ్వస్త్రం చిన్నదా, పెద్దదా అనేది మాకు అనవసరం. మీరు దానికి టాక్టికల్ అని పేరు పెడతారా, స్ట్రాటజిక్ అని పేరు పెడతారా అనేది మేం పట్టించుకోం. భారత్‌పై మీరు చిన్న అణ్వస్త్రం ప్రయోగించినా సరే దానికి భారత్ చేసే అణు ప్రతీకారం పెద్ద స్థాయిలోనే ఉంటుంది" అని 2013లో అప్పటి జాతీయ భద్రతా సలహామండలి చైర్మన్ శ్యాం శరణ్ స్పష్టం చేశారు. అందువల్ల భారత్‌పై చిన్న అణ్వస్త్రాల్ని వేయాలన్నా పాక్ ఒకటికి పదిసార్లు ఆలోచించుకోక తప్పని పరిస్థితి ఉండవచ్చు.



భారత్‌పై చిన్న అణ్వస్త్రాలను ప్రయోగించేందుకు పాక్ తయారుచేసిన నాసర్ క్షిపణి

భారత నౌకాదళ ఐఎన్ఎస్ విక్రాంత్ విమానవాహక యుద్ధ నౌక.. దానిపై ఉన్న రష్యన్ మిగ్ 29కే యుద్ధ విమానాలు ప్రస్తుతం దీనిని అరేబియా సముద్రంలో పాక్‌కు దగ్గరగా మోహరించినట్లు వార్తలు వచ్చాయి





మొబిలిటీ వ్యాలీ పార్క్ భూమి పూజలో పాల్గొన్న శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు తదితరులు.

అంతర్జాతీయ ప్రమాణాలతో.. నియోజకవర్గానికో పారిశ్రామిక వాడ

- ఎంఎస్ఎంఈలతో యువతకు ప్రోత్సాహం
- పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో.. 862 ఎకరాల్లో మొబిలిటీ పార్క్
- భూమి పూజ చేసిన స్పీకర్, మంత్రి

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికొక పారిశ్రామిక వాడను ఏర్పాటు చేస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. పారిశ్రామిక వాడల్లో ఎంఎస్ఎంఈల ఏర్పాటు దిశగా యువతను ప్రోత్సహిస్తామని వివరించారు. ఆ దిశలో తెలంగాణను పారిశ్రామికంగా విఽరంత అభివృద్ధి చేస్తామన్నారు. రూ.44.3 కోట్లతో టీజీఐఐసీ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం ఎనకతల గ్రామంలో అభివృద్ధి చేయనున్న మొబిలిటీ వ్యాలీ పార్క్‌కు ఆయన అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో కలిసి.. మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 862 ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే మొబిలిటీ వ్యాలీ పార్క్ ద్వారా పదివేల మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. పరిశ్రమల ఏర్పాటును కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని, వాటిని మరింత బలోపేతం చేసేందుకే ప్రత్యేక పాలసీ ప్రకటించినట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎంతో మంది పారిశ్రామికవేత్తలు ముందుకొస్తుంటే, ఉద్దేశపూర్వకంగా కొంత మంది తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు.



కల్వకుర్తిలో ధాన్యాన్ని తగులబెడుతున్న రైతులు

3 కిలోల తరుగు తీస్తున్నారు!

- కొన్న ధాన్యాన్ని తరలించడం లేదు
- ఉమ్మడి పాలమూరులో రైతుల ఆందోళన

పీపనగండ్ల/గోపాల్‌పేట/కల్వకుర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పంట చేతికొచ్చి అమ్ముకుంటున్న వేళ ఎదురౌతున్న సమస్యలతో రైతులు ఆందోళనకు దిగుతున్నారు. ధాన్యం కొనుగోలులో పరిమితికి మించి తరుగు తీస్తున్నారని, కొన్న ధాన్యాన్ని తరలించడంలో ఆలస్యం చేయడంతో నష్టం వాటిల్లుతోందని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలుచోట్ల రైతులు మంగళవారం రాస్తారోకోలు నిర్వహించారు. వనపర్తి జిల్లా పీపనగండ్ల మండలం గోవర్ధనగిరి ఐకేపీ కేంద్రంలో వారం రోజులుగా కొనుగోళ్లు నిలిపివేశారు. విఽషన్ ద్వారా తాలు తొలగించాలని, ఆ తరువాత కొనుగోలు చేస్తామని నిర్వాహకులు తేల్చి చెప్పారు. దీంతో ఆందోళనకు గురైన రైతులు రాస్తారోకో నిర్వహించారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్దారంలో కూడా రైతులు రాస్తారోకో చేశారు. కాంటా చేసి లారీలు రాక కొనుగోలు కేంద్రాల్లో వేల కొద్దీ బస్తాలు నిల్వ ఉన్నాయని, అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండుచోట్ల అధికారుల హామీతో రైతులు ఆందోళన విరమించారు. ధాన్యం కొనుగోలులో తరుగు తీయొద్దని నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తిలోని అంబేద్కర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో చేశారు. రోడ్డుపై ధాన్యం పోసి తగులబెట్టారు. 40 కిలోల బస్తాకు మూడు కిలోల తరుగు తీస్తున్నారని, మిల్లర్లు కట్టింగ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

మతి భ్రమించి మాట్లాడుతున్న కేసీఆర్

- ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : గత 15 నెలలుగా అధికారం లేక... కేసీఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నారంటూ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీమ్ ఎద్దేవా చేశారు. వరంగల్ సభలో కాంగ్రెస్ పార్టీపై తన అక్కసునంతా వెళ్లగక్కారని చెప్పారు. గాంధీభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫహీమ్ మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయని కేసీఆర్.. ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. తాను అసెంబ్లీకి రానంటున్న కేసీఆర్.. పిల్లలు హరీశ్‌రావు, కేటీఆర్‌లను పంపుతానంటున్నారని, వారికి హార్లిక్స్ డైపర్లు సరఫరా చేసేందుకు తాము సిద్ధమని ఎద్దేవా చేశారు. కాగా.. 15 నెలల కాంగ్రెస్ పాలనలో చేసిన 27 రకాల అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేశారు.

హేచరీస్ కంపెనీ గుమస్తా నుంచి 1.68కోట్లు స్వాహా

- యజమానినంటూ కాజేసిన సైబర్ నేరస్థుడు
- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : యజమానినంటూ హేచరీస్ కంపెనీలో పనిచేసే గుమస్తాను నమ్మించి రూ. కోటీ 68 లక్షలను కొల్లగొట్టాడు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సైబర్ నేరస్థుడు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైమ్ విభాగం ఇన్‌చార్జి ఏసీపీ ఫణిందర్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడి వరంగల్‌లోని ఓ ప్రముఖ హేచరీస్ కంపెనీలో పని చేసే గుమస్తాకు ఈ నెల 19న గుర్తుతెలియని వ్యక్తి వాట్సాప్‌లో మెసేజ్ పంపి.. మీ యజమానిని.. ఇది నా కొత్త ఫోన్ నెంబర్ సేవ్ చేసుకోమని చెప్పాడు. దీంతో ఆ ఫోన్ నెంబర్ సేవ్ చేసుకున్న గుమస్తా యజమానితో మాట్లాడుదామని మరుసటి రోజు కాల్ చేయగా మీటింగ్‌లో ఉన్నానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆ తర్వాత రోజు సేవ్ చేసుకున్న ఆ నెంబర్ నుంచి కాల్ వస్తుండడంతో గుమస్తా ఎత్తగా తన ఖాతాల్లో ఎంత డబ్బు ఉందో చెక్ చేయమని చెప్పాడు. పలు ఆర్థిక లావాదేవీల గురించి అడిగి, డబ్బున్న ఖాతాల నుంచి ఫలానా నెంబర్‌కు బదిలీ చేయమని చెప్పాడు. దీంతో గుమస్తా రెండు దఫాలుగా రూ. 1.68 కోట్లను బదిలీ చేశాడు. మరోమారు ఫోన్ చేయడంతో సదరు వ్యక్తిపై అనుమానం వచ్చిన గుమస్తా యజమానికి సంబంధించిన వ్యక్తిగత నంబర్‌కు ఫోన్ చేసి మోసపోయిన విషయం గ్రహించాడు. వెంటనే వరంగల్ పోలీసు కమిషనరేట్‌లోని సైబర్ క్రైమ్ విభాగంలో హేచరీస్ సంస్థ యజమాని, గుమస్తా కలిసి ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడు యూపీకి చెందిన ప్రదీప్‌కుమార్‌గా గుర్తించి అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. స్వాహా చేసిన మొత్తాన్ని వేర్వేరు ఖాతాలకు మళ్లించినట్లు గుర్తించారు. విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయండి

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపండి.. కేంద్రానికి మంత్రి ధనసరి సీతక్క డిమాండ్

- శాంతి చర్చల కోసం కేంద్రంపై ఒత్తిడి
- 2న సదస్సు నిర్వహిస్తాం: వామపక్షాలు

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, మహబూబాబాద్ టౌన్, వడ్డెపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'ను వెంటనే నిలిపివేయాలని మంత్రి ధనసరి సీతక్క డిమాండ్ చేశారు. తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని నిలువరించేలా చొరవ చూపాలని కోరారు. భారత్ బచావో ప్రతినిధులు డాక్టర్ ఎమ్ఎఫ్ గోపీనాథ్, గాదె ఇన్నయ్య, జంజర్ల రమేష్‌బాబు మంగళవారం ప్రజా భవన్‌లో మంత్రి సీతక్కను కలిశారు. వేల సంఖ్యలో కేంద్ర భద్రతా బలగాలు కర్రెగుట్టల్లో సంచరిస్తుండడంతో ఆదివాసీలు భయాందోళనలకు లోనవుతున్నారని, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరిపేలా చూడాలని సీతక్కకు విన్నవించారు. దీనిపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. 'కేంద్ర బలగాల మోహరింపుతో అడవి బిడ్డలు తీవ్ర భయాందోళనలకు లోనవుతున్నారు. బల ప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా సమస్య పరిష్కారమయ్యేలా కేంద్రం వ్యవహరించాలని ఓ ఆదివాసీ బిడ్డగా కోరుతున్నాను. ఆ జాతి బిడ్డగా వారికి అండగా నిలుస్తాను. ఆదివాసీల హక్కులు ఎవరూ కాలరాయొద్దు' అని కేంద్రానికి సూచించారు. మావోయిస్టులతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఆదివాసీ జాతిని అంతమొందించేందుకు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరాయి. మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వామపక్ష నేతలు మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మే 2వ తేదీన హైదరాబాద్‌లో సదస్సు నిర్వహిస్తున్నామని, ఇందులో శాంతి చర్చల కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. సమావేశంలో సీపీఎం నుంచి జూలకంటి రంగారెడ్డి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి వేములపల్లి వెంకట్రామయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నుంచి కేజీ రాంచందర్, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఐ (ఎంఎల్) నుంచి ప్రసాదన్న, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నుంచి రమేశ్ రాజా, ఎస్‌యూసీఐ నుంచి మురహరి, ఫార్వర్డ్ బ్లాక్ నుంచి ప్రసాద్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

చర్చలు జరపాలి: ప్రజా సంఘాలు

ఛత్తీస్‌గఢ్‌లోని కర్రెగుట్టల్లో నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని దళిత, గిరిజన, ఆదివాసీ ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కర్రెగుటల్లో కేంద్ర బలగాలను వెనక్కి మళ్లించాలని డిమాండ్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సిద్ధబోయిన లక్ష్మీనారాయణ, కో-కన్వీనర్లు జైసింగ్ రాథోడ్, సోమ రామ్మూర్తి మాట్లాడారు. ఆదివాసీలపై జరుగుతున్న దాడిని ఆపేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

శాంతి చర్చలకు ముందుకు రావాలి: అద్దంకి

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి శాంతి చర్చలకు ముందుకు రావాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సూచించారు. మహబూబాబాద్‌లో జాతీయ మాలమహానాడు (జేఎంఎం) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సులో టీజీవో రాష్ట్ర నాయకుడు హరికోట్ల రవి, జేఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గం గుట్టల్లో మావోయిస్టులు!

- కర్రెగుట్టల నుంచి మకాం మార్పు!
- అనుమానిస్తున్న కేంద్ర బలగాలు
- అక్కడ కూడా కూంబింగ్ ప్రారంభం
- కర్రె గుట్టల్లో బలగాల బేస్ క్యాంప్
- గుంజిపర్తిలో సెల్ టవర్ నిర్మాణం



గుంజిపర్తిలో మొబైల్ టవర్ నిర్మాణం

చర్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు బలగాలు కర్రెగుట్టలను చుట్టు ముడుతుండగానే.. మావోయిస్టులు పక్కనే ఉండే దుర్గం(దుర్లభమైన) గుట్టల్లోకి మకాం మార్చారా? 50 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండే ఈ గుట్టల్లోకి వెళ్లడం అత్యంత దుర్లభంగా ఉంటుందా? ఈ ప్రశ్నలకు కర్రెగుట్టల్లో కూంబింగ్‌లో ఉన్న కేంద్ర బలగాలు అవుననే చెబుతున్నాయి. కర్రెగుట్టల్లో కూంబింగ్ ఎనిమిదో రోజుకు చేరుకోగా.. దుర్గం గుట్టల్లో మంగళవారం నుంచి గాలింపు మొదలైంది. దుర్గం గుట్టల్లోనూ భారీ గుహలు ఉంటాయని, మార్గమధ్యంలో చిత్తడి ఊబులు ఉంటాయని స్థానిక ఆదివాసీలు చెబుతున్నారు. అటు కర్రెగుట్టల్లోనూ కూంబింగ్ కొనసాగుతోందని ఓ జవాన్ వివరించారు. "మాకున్న పక్కా సమాచారంతో 200 మంది మావోయిస్టులు ఉన్న గుట్టను చుట్టుముట్టాం. బలగాల నుంచి వారికి తప్పించుకునే అవకాశాల్లేవు. గుట్టలపైన, గుహల్లో నీటి సదుపాయం లేక.. మావోయిస్టులు ఇబ్బంది పడుతున్నారని తెలిసింది" అని ఆ జవాన్ వెల్లడించారు. కర్రెగుట్టల్లోపల ఉన్న మైదాన ప్రాంతంలో పోలీసు బలగాల తాత్కాలిక క్యాంప్ కూడా ఏర్పాటైనట్లు తెలిపారు. ఇప్పుడు జవాన్లకు అవసరమైన సామగ్రిని హెలికాప్టర్ ద్వారా చేరవేస్తున్నారు. ఆ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' ఎక్స్‌క్లూజివ్‌గా సేకరించింది. కమ్యూనికేషన్ కోసం బలగాలు పూజారీ కాంకేర్ - కర్రెగుట్టలకు మధ్యన ఉండే గుంజిపర్తి అనే గ్రామంలో సెల్‌టవర్‌ను నిర్మించాయి. మంగళవారం సాయంత్రానికి సిగ్నల్ విడుదల కూడా ప్రారంభమవ్వడం గమనార్హం..! ఈ గ్రామంపై నెల క్రితం వరకు కూడా పూర్తిగా మావోయిస్టులకు పట్టు ఉండేది. కాగా.. కర్రెగుట్టల పరిసర గ్రామాలపై పోలీసుల ఆంక్షలు కొనసాగుతున్నాయి. గ్రామస్థులను బయటకు రాకుండా బలగాలు అడ్డుకుంటున్నాయి. కొత్తవారిని గ్రామాలకు వెళ్లనీయడం లేదు. తెలంగాణ వైపు వాజేడు, వెంకటాపురం మండలాలు, ఛత్తీస్‌గఢ్ వైపు పామేడు, పూజారీ కాంకేర్ పరిసరాల్లో ఈ పరిస్థితి కొనసాగుతోంది.

మరింత ముదిరిన ఎండలు

- రాష్ట్రవ్యాప్తంగా భగ్గుమంటున్న భానుడు
- చాలా చోట్ల 43 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- వడదెబ్బతో ఐదుగురు మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మరింత ముదురుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడి భగభగలు మంటలు పుట్టిస్తున్నాయి. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పలుచోట్ల మాత్రం సాయంత్రానికి మబ్బులు కమ్ముకుని వాతావరణం కాస్త చల్లబడుతోంది. మరో రెండు రోజులు వాతావరణం ఇదే తరహాలో ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం అత్యధికంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం గోదూర్‌లో 44.4 డిగ్రీలు, నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో 44.3 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో 43 డిగ్రీలకుపైగా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చాలా చోట్ల 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా జిల్లాల్లోనూ 40 డిగ్రీలకుపైగానే ఉన్నాయి.

వడదెబ్బతో పెరుగుతున్న మరణాలు

రాష్ట్రవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలతో వడదెబ్బ మరణాలు పెరుగుతున్నాయి. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఐదుగురు వడదెబ్బకు బలయ్యారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కస్తూరీనగరానికి చెందిన రైతు కేలోత్ రంగ్యా (52) మంగళవారం పొద్దంతా పొలం పనులు చేయడంతో వడదెబ్బకు గురై మృతి చెందాడు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామంలో ఇల్లిల్లూ తిరుగుతూ కూరగాయలు అమ్మే యాకర సాలమ్మ (65), సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం గట్టికల్‌లో ఉపాధి పనులు చేస్తూ వడదెబ్బకు గురైన తలారి నర్సయ్య (59), నిజామాబాద్ జిల్లా వర్ని మండలం జలాల్‌పూర్‌కు చెందిన వ్యవసాయ కూలీ ఏసిక అర్చన (53), ఖమ్మం జిల్లా మణుగూరు మండలం దమ్మక్కపేటకు చెందిన బిల్లా మంగమ్మ (78) వడదెబ్బకు గురై మృతిచెందారు.

ధాన్యం అన్‌లోడింగ్‌లో మిల్లర్ల జాప్యం

- 4 రోజులుగా లారీలతో పడిగాపులు
- నల్లగొండలో లారీ డ్రైవర్ల రాస్తారోకో

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల నుంచి తీసుకొచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడంలో మిల్లర్ల జాప్యాన్ని నిరసిస్తూ లారీ డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. నల్లగొండ పట్టణం దేవరకొండ రోడ్డులోని బాలాజీ రైస్ మిల్లు వద్ద నాలుగు రోజులుగా పడిగాపులు కాస్తున్నామని సుమారు 25 లారీల డ్రైవర్లు తెలిపారు. స్థలం లేదని ధాన్యం దిగుమతి చేసుకునేందుకు మిల్లు యజమాని నిరాకరిస్తున్నాడని చెప్పారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడంతో లారీలను రోడ్డుపై నిలిపి రాస్తారోకో చేశారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంగరబోయిన వెంకన్నయాదవ్ మాట్లాడుతూ జిల్లాలో ఇలాంటి పరిస్థితి అనేక మిల్లుల వద్ద ఉందని తెలిపారు కొన్నిచోట్ల సుమారు 500కు పైగా లారీలు బారులు తీరాయన్నారు. అధికారులు ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, ఐకేపీ కేంద్రాలకు లారీలను పంపాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. లారీలు మిల్లుల వద్ద ఉండిపోతే కొత్తగా ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు.

సొసైటీ సిబ్బందిని నిర్బంధించి... గన్నీసంచులు తీసుకెళ్లిన రైతులు

వైరా, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా వైరా మండలం గరికపాడు సొసైటీ కార్యాలయంలో సిబ్బందిని నిర్బంధించి రైతులు గన్నీసంచులు తీసుకువెళ్లారు. మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సొసైటీ కార్యాలయానికి పదివేల ఖాళీ గన్నీసంచులు వచ్చాయి. అయితే కాంటా వేసి రోడ్లపై ఉన్న ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించేవరకు రైతులు ఎవరికీ గన్నీసంచులు ఇవ్వొద్దని అధికారులు ఆదేశించారని సిబ్బంది చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీ చైర్మన్ అయిలూరి కృష్ణారెడ్డి, సీఈవో రామకృష్ణ, సిబ్బందిని నిర్బంధించి గన్నీసంచులను తీసుకువెళ్లారు. ఒకవేళ అధికారులు మీపై ఏవైనా చర్యలు తీసుకుంటే బాధ్యత వహిస్తామని రైతులు సిబ్బందికి భరోసా ఇచ్చారు.

శ్రీశైలంలో డ్యాం సేఫ్టీ బృందం

- ప్లంజ్‌పూల్, వాటరింగ్ సిస్టమ్ పరిశీలన

శ్రీశైలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) బృందం మంగళవారం శ్రీశైలం జలాశయాన్ని పరిశీలించింది. చైర్మన్ అనిల్ జైన్ నేతృత్వంలో కేంద్ర జలసంఘం డిప్యూటీ డైరెక్టర్ ప్రభాత్‌కుమార్, చీఫ్ ఇంజనీర్ రాకేశ్ కశ్యప్, ఎన్‌డీఎస్ఏ రీజినల్ డైరక్టర్ గిరిధర్, ఈఎన్‌సీ రత్నకుమార్, 'డ్రిప్' ప్రతినిధి నీతూ.. స్థానిక జలాశయ ఇంజనీర్లతో కలసి ఆనకట్ట భద్రతపై మూడు గంటల పాటు సమీక్ష నిర్వహించారు. డ్యాం ఇంజనీర్లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆనకట్ట స్థితి గతులను, 2009 వరదల కారణంగా ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యి తదితర వివరాలను తెలియజేశారు. సాయంత్రం ఎన్‌డీఎస్ఏ బృందం ఆనకట్ట అప్రోచ్ రోడ్, ప్లంజ్‌పూల్ ప్రాంతంతో పాటు, గ్యాలరీలోకి వెళ్లి బకెట్ పోర్షన్, వాటరింగ్ సిస్టంను పరిశీలించారు. వారి వెంట శ్రీశైలం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ కబీర్‌బాషా, ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి తదితరులు ఉన్నారు. డ్యాం భద్రత, చేపట్టాల్సిన మరమ్మతులను ఎన్‌డీఎస్ఏ బృందం కేంద్ర జలశక్తి శాఖ దృష్టికి తీసుకెళ్తుందని ఇంజనీర్లు తెలిపారు.

అంతర్జాతీయ సదస్సుకు సీఎం కార్యదర్శికి ఆహ్వానం



చంద్రశేఖర్

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : బొటానికల్ గార్డెన్స్ కన్జర్వేషన్ ఇంటర్నేషనల్(బీజీసీఐ) ఆధ్వర్యంలో దక్షిణ కొరియాలో నిర్వహించే సదస్సులో పాల్గొనాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డికి ఆహ్వానం అందింది. జూన్ 9 నుంచి జరిగే ఈ అంతర్జాతీయ సదస్సులో చంద్రశేఖర్ రెడ్డి "కనెక్ట్ కల్చర్ విత్ నేచర్ బొటానికల్ గార్డెన్స్" అనే అంశంపై చర్చించనున్నారు. ఇటీవల సీఎం చేతుల మీదుగా ప్రారంభమైన కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్‌లో చంద్రశేఖర్ రెడ్డి 75 థీమ్ పార్కులను ఏర్పాటు చేయించారు. వాటిలో సుమారు 2000 రకాలకు చెందిన మొక్కలు ఉన్నాయి. వృక్ష పరిచయ క్షేత్రం పేరుతో మొక్కలను పరిచయం చేసే కార్యక్రమానికీ శ్రీకారం చుట్టారు. చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు రకరకాల మొక్కలను తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.